ఫిబ్రవరి
2014

94

సంపుటి : 8 సంచిక : 10

వెల రు. 5/-

## ఈ సంచికలో........

ప్రత్యామ్నాయ విధానాల కోసం రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం

సామాజిక న్యాయం కోసం పోరాటం: కొన్ని అనుభవాలు

పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం అనివార్యం

అస్థిత్వ ఉద్యమాలు-మార్క్సిస్టు అవగాహన

పట్టణ ప్రాంతాల్లో పోరాటాల ఆవశ్యకత

ప్రయివేటీకరణకు ప్రత్యామ్నాయాలున్నాయి

సోషలిజం: సోషలిజానికి మార్గం - వియత్నాం అవగాహన

మట్టి మనుషులను కదం తొక్కించిన వాడివేడి కలం వాసిరెడ్డి భాస్కరరావు

శత జయంతి నివాళి

## మట్టి మనుషులను కదం తొక్కించిన వాడివేడి కలం

# వాసిరెడ్డి భాస్కరరావు

యు. రామకృష్ణ

సుంకర-వాసిరెడ్డి (సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు) తెలుగు నాటకానికి ఓ దిశానిర్దేశం చేసిన మహనీయులు. 'ముందడుగు', 'మాభూమి', 'అపనింద' వంటి అభ్యుదయ, ప్రగతిశీల, విప్లవ దృక్పథంగల నాటకాలను రచించి.. ఆనాటి సమాజంలోని ఫ్యూడల్ భూస్వాముల పద ఘట్టనల కింద నలిగిపోతున్న సామాన్యులను చైతన్యవంతులను చేసి.. తమ బానిస సంకెళ్లను పెటేల్మని తెగ టార్చుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేసిన ప్రజా రచయితలు వారు. పాటలు, బుర్రకథలు, నాటకాలు.. వారు ఏది రాసినా అవి ప్రజలను కదం తొక్కించాయి. వారి నాటకాలు చదివినా, ప్రదర్శనలు చూసినా శరీరాలు జలదరించేవి.. రోమాలు నిక్కబొడిచేవి.. నెత్తురు సలసలా కాగేది.. అంతిమంగా ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేసేవి. కనుకనే తమ నాటకాలను ప్రభుత్వం నిషేధించినా.. కమ్యూనిస్టులంటూ అరెస్టు చేసి చెప్పలేని చిత్రహింసలు పాల్జేసినా.. జైలు గోడల వెనక్కి నెట్టినా.. తాము నమ్మిన ఆశయ సిద్ధి కోసం.. వారు పట్టిన కలాన్ని వదిలిపెట్టలేదు.. అంతేకాదు నమ్మిన కమ్యూనిస్టు పార్టీకి యావదాస్తినీ సమర్పించిన త్యాగధనులు వారు. ఆ జంట రచయితల్లో ఒకరైన వాసిరెడ్డి భాస్కరరావు శత జయంతి ఈ సంవత్సరం జరుగుతున్నది. ఆయనకు నివాళిగా ఈ వ్యాసం.

వాసిరెడ్డి భాస్కరరావు ఓ సాధారణ రైతు కుటుంబంలో భ్రమరాంబ, వీరయ్య దంపతులకు 1914 సెప్టెంబరు 2న కృష్ణాజిల్లా వీరులపాడులో జన్మించారు. బాల్యంలోనే తల్లి చనిపోవడంతో నల్గొండ జిల్లాలోని పెంచికలదిన్నెలోని పినతల్లి దుర్గమ్మ వద్ద పెరిగి పెద్దయ్యారు. భాస్కరరావు అసలు పేరు 'ఛాయా భాస్కరం'. ఆయన చిన తాత పేరు ఛాయన్న. ఈ పేరు కలిసివచ్చేటట్లుగా 'ఛాయా భాస్కరం' అని తల్లిదండ్రులు పేరు పెట్టారు. అయితే ఆయన అందరిచేతా భాస్కరరావుగానే పిలవబడ్డారు.

ఆయన రైతు కుటుంబంలో జన్మించినప్పటికీ రైతు జీవనం గురించి అంతగా తెలియకుండానే పెరిగారు. ప్రాథమిక విద్యను



వీరులపాడులోనే చదివారు. హేతువాద దృక్పథంతో రచనలు చేస్తున్న త్రిపురనేని రామస్వామి చౌదరి సమకాలికుడు అష్టావధాని జంగా హనుమయ్య చౌదరి వద్ద సంస్కృతాంధ్రాలు చదువుకున్నారు. సాహిత్య పాఠాలు చదివి తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించారు. గ్రామంలోనే ఆయన రెండేళ్లపాటు వీధి బడిని నడిపారు. ఆ సమయంలోనే గ్రామంలో నెలకొల్పిన హిందీ పాఠశాలలో చేరి 'రాష్ట్ర భాషా విశారద' చదువుతున్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్నారని పాఠశాల యాజమాన్యం ఆయనపై అభియోగం మోపితే ఆగ్రహంతో ఆ పాఠశాలనే వదిలి వెళ్లారు. తరువాత ఆయుర్వేద వైద్య విద్యను అభ్యసించేందుకు విజయవాడ వెళ్లారు. కానీ ఆయనకు ఆయుర్వేద వైద్య విద్య అబ్బలేదు. అక్కడే హిందీ విద్యాలయంలో చేరి హిందీ చదవ సాగారు. క్రమంగా 'రాష్ట్ర భాషా విశారద' పట్టానూ, తర్వాత 'హిందీ ప్రచారక్' శిక్షణనూ పొందారు. స్వయం కృషితో చదివి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి 'హిందీ విద్వాన్' పట్టా పొందారు. ఆ విధంగా గ్రామంలో తొలి హిందీ పట్టభద్రుడాయన.

1936వ సంవత్సరంలో కృష్ణాజిల్లా బోర్డు హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడుగా ఉద్యోగంలో ప్రవేశించారు. సరిగ్గా అదే సమయంలో గ్రామంలో అతివాద రాజకీయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అలాగే 1937లో కూలి సంఘ ఉద్యమం కొనసాగింది. ఈ రెండూ ఆయనపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. ఉద్యోగం చేస్తూనే పరోక్షంగా గ్రామ రాజకీయాల్లో, కూలిసంఘ ఉద్యమంలో పాల్గొనేవారు. అంతకుముందు గ్రామంలో అష్టావధాని హనుమయ్య చౌదరి వద్ద చదివే సమయంలో.. కాకుమాని అప్పయ్య కవి రాసిన పద్యం, "ఉపమగలిగిన శయ్యలనొప్పియున్న అంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు, పాయసంబైన సంస్కారవక్వమైన కాకజుష్టంబు హవ్యంబుగాని యట్టు" (దీనర్థం: పాయసాన్ని ఎంత మధురంగా వండినప్పటికీ, కాకి ముట్టుకుంటే నైవేధ్యానికి పనికిరానట్టుగానే.. అలంకారములు, మంచి శైలి ఉన్నప్పటికీ, శూద్రుడు రచించిన కావ్యము పనికిరాదు) అని చదవడంతోనే ఆయనకు అరికాలి మంట నెత్తికెక్కేది. ఆ విధంగా ఆయన ప్రాచీన పరాయణతను తెగనాడి.. క్రమంగా శ్రామికవర్గ పక్షపాతిగా మారి.. కమ్యూనిస్టు పార్టీ పట్ల మొగ్గు చూపడం ప్రారంభించారు.

1938-39 కాలంలో వీరులపాడుకే చెందిన వాసిరెడ్డి రామారావు (ఈయన 1952లో శాసనసభ్యుడుగా ఎన్నికయ్యారు) నందిగామ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. వాసిరెడ్డి భాస్కరరావు ఆయనకు తోడుగా ఉంటూ బలమైన రైతు సంఘ నిర్మాణానికి దోహదకారి అయ్యారు. ఇలా 1942 వరకూ గడిపారు. ఈ కాలంలో కమ్యూనిస్టు పార్టీపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. ఆ కాలంలో కమ్యూనిస్టులు సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలతో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తున్నారు. దీంతో వాసిరెడ్డి భాస్కరరావు స్వేచ్ఛగా రాజకీయాల్లో పనిచేయాలని భావించారు. 1942లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు.

అప్పటికే కృష్ణాజిల్లా విజయవాడ తాలూకా ఈడుపుగల్లు నుంచి తిరువూరు తాలూకా కొణతమాత్మకూరు వెళ్లి స్థిరపడి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న సుంకర సత్యనారాయణ, తన తమ్ముడు వీరభద్రరావుతో కలిసి 'స్టాలిన్ గ్రాడ్ యుద్ధం' బుర్రకథ రచన చేశారు. జర్మన్ నాజీ నియంత హిట్లరు రష్యాపై దండెత్తి ప్రజలపై ఘోరంగా దాడులు జరుపుతున్న సమయంలో సోవియట్ వీరుల త్యాగాలు ఉ

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. మట్టి మనుషులను కదం తొక్కించిన వాడివేడి కలం వాసిరెడ్డి భాస్కరరావు
– యు. రామకృష్ణ 2

2. ప్రత్యామ్నాయ విధానాల కోసం రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం
– సీతారామ్ ఏచూరి 4

3. సామాజిక న్యాయం కోసం పోరాటం: కొన్ని అనుభవాలు
– బి.వి. రాఘవులు 7

4. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం అనివార్యం
– కీ॥శే॥ మాకినేని బసవపున్నయ్య 12

5. అస్థిత్వ ఉద్యమాలు-మార్క్సిస్టు అవగాహన
– ఎస్. వీరయ్య 14

6. పట్టణ ప్రాంతాల్లో పోరాటాల ఆవశ్యకత
– డేవిడ్ హార్వేతో ముఖాముఖి 19

7. ప్రయివేటీకరణకు ప్రత్యామ్నాయాలున్నాయి
– డేవిడ్.ఎ.మెక్డనాల్డ్&గ్రెగ్ రూయిటర్స్ 23

8. సోషలిజం: సోషలిజానికి మార్గం వియత్నాం అవగాహన
– ఎన్‌గుయెన్ ఫు ట్రోంగ్ 28



ఎడిటర్:
ఎస్. వెంకట్రావు

ఎడిటోరియల్ బోర్డు:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# యువభారతం

భారత దేశం రాను రాను 'యువ భారత దేశం'గా మారుతోంది. అదే సమయంలో 'నిరుద్యోగ యువ భారత దేశం'గా కూడా మారుతోంది... ప్రభుత్వ సర్వేలు చెబుతున్న వాస్తవాలివి.

ప్రస్తుతం దేశ జనాభాలో 33 శాతం మంది 15 ఏళ్ల లోపువారున్నారు. వీరంతా త్వరలో పనిచేసే వయస్సులోకి ప్రవేశిస్తారు. 2020 నాటికి ప్రపంచంలోనే అత్యంత 'యువ దేశం'గా భారత్ నిలవనుంది. అప్పటికి మొత్తం జనాభాలో 64 శాతం మంది ఆదాయాన్ని ఆర్జించే వయసులో ఉంటారు. చైనా, జపాన్, యూరప్ దేశాలతో పోలిస్తే మన దేశంలో యువత అధికంగా ఉంటారు. వీరి శక్తి సామర్థ్యాలు దేశాభివృద్ధికి పెద్ద పెట్టుబడి అవుతాయి....ఇది ఒక పార్శ్వం.

రెండో పార్శ్వం....2012-13 సంవత్సరంలో 15-29 ఏళ్ల మధ్య యువకుల్లో 13.3 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారనీ, రానురాను దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్నదనీ కార్మిక మంత్రిత్వ శాఖ జరిపిన ఒక సర్వే చెపింది. ఈ వయసులోనే డిగ్రీ చదివిన యువకుల్లో నిరుద్యోగం మంరింత ఎక్కువ ఉంది. వీరిలో గ్రామీణ ప్రాంతాల్లో 36.6 శాతం మందీ, పట్టణ ప్రాంతాల్లో 26.5 శాతం మందీ నిరుద్యోగులుగా ఉన్నారు. చదువురాని యువతలో 3.7 శాతం మాత్రమే నిరుద్యోగులుగా ఉన్నారు. అందువల్ల డిగ్రీలు చదివిన యువకులు కూడా కూలి పనులు చేస్తున్నారు. దాని వల్ల మన దేశంలో యువకులు పొందిన నైపుణ్యాలు కూడా వ్యర్థమై పోతున్నాయని సర్వే పేర్కొంది.

యువకుల శక్తి సామర్థ్యాలను పెట్టుబడిగా ఉపయోగిస్తే దేశం అభివృద్ధి చెందుతున్నదాంట్లో సందేహం లేదు. కానీ ఎటువంటి ఆర్థిక పంథా అనుసరిస్తే యువశక్తిని వినియోగించుకోగలం అన్నదే మన ముందున్న ప్రశ్న. "ఇముడ్చుకునే అభివృద్ధి (ఇన్‌క్లూజివ్ గ్రోత్) తో కూడిన సరళీకరణ" విధానాలు అవలంభిస్తున్నాం, దీని వల్ల ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం రెండూ దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. కాని దాని విధానాలు దేశంలోని యువతను నిరుద్యోగం వైపు నడిపాయి. ఇప్పుడు బిజెపి ప్రధాని అభ్యర్థిగా ప్రకటించుకున్న నరేంద్ర మోడీ "సాంఘిక సంక్షేమ కార్యక్రమాలతో కూడిన శీఘ్ర అభివృద్ధి" తమ విధానమని ప్రకటించారు. రెండు విధానల్లోనూ సారాంశం ఒకటే: 'పెట్టుబడిదారులకు కోటానుకోట్ల రూపాయల రాయితీలు, సదుపాయాలు కల్పించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది, అప్పుడు యువతకు ఉపాధి లభిస్తుంది అని'.

కానీ ఇప్పుడు దేశంలో పారిశ్రామికాభివృద్ధి మందగించింది పెట్టుబడి లేక కాదు. ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేకపోవడంవల్ల పారిశ్రామికోత్పత్తులకు గిరాకీ ఉండడం లేదు. అందువల్ల అభివృద్ధి మందగించింది. కాంగ్రెస్, బిజెపీ రెండూ కట్టుబడి ఉన్న సరళీకరణ విధానాల వల్ల ఒకవైపు ధనికుల వద్ద సంపద విపరీతంగా పోగు పడుతుంటే మరోవైపు ప్రజల ఆదాయాలు తగ్గి వారి కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. ధనిక వర్గాలు పరిశ్రమలు పెట్టినా ఉత్పత్తిని కొనేవాడు లేడు కాబట్టి తమ లాభాలను మరింత గరిష్టంగా పెంచుకోడానికి స్పెక్యులేటివ్ మార్కెట్లవైపు పెట్టుబడులుగా తరలిస్తున్నారు. అందువల్లనే ఒకవైపు శతకోటీశ్వరులు, కోటీశ్వరుల సంఖ్య పెరుగుతుంటే మరోవైపు దారిద్ర్యం, నిరుద్యోగం పెరుగుతున్నాయి.

అందువల్ల ఇప్పుడు దేశానికి... పెట్టుబడులకు గరిష్ట లాభాలు చేకూర్చే సరళీకరణ విధానాలు కాదు, ప్రజలకు ఆర్థిక బాధలనుండి ఉపశమనం కలిగించి, వారి కొనుగోలు శక్తి పెంచే విధానాలు కావాలి. అవినీతిని అరికట్టి, కార్పొరేట్లకు రాయితీలు తగ్గించి, వారిపై పన్నులు వేయడం ద్వారా లభించే ఆదాయాన్ని ప్రభుత్వం అభివృద్ధి పథకాల మీద ఖర్చుచేయాలి. ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కలిగించే సంక్షేమ పథకాలు అమలు చేయాలి. అప్పుడు ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఉత్పత్తులకు గిరాకీ పెరిగి ఉపాధితో కూడిన అభివృద్ధి జరుగుతుంది. యువతకు ఉపాధి లభిస్తుంది. నిరుద్యోగం, పేదరికం తగ్గుముఖం పడుతాయి. సరళీకరణకు ప్రత్యామ్నాయమైన ఈ విధానాలు అమలు చేయకుండా ఎన్ని నినాదాలు చేసినా, ఎన్ని పథకాలు ప్రకటించినా అవన్నీ ప్రజలను మోసం చేయడానికి పనికొస్తాయిగానీ సమస్యను మాత్రం పరిష్కరించవు.


**చందా వివరాలు**
విడిపత్రిక : **రు.5** సంవత్సర చందా : **రు.60**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.



**చిరునామా**
ఎడిటర్,
మార్క్సిస్టు
(సైద్ధాంతిక మాసపత్రిక)
ప్రజాశక్తి ప్రెస్, గవర్నర్‌పేట,
విజయవాడ-2

**ఈ మాసం ముఖ్యాంశం**

# ప్రత్యామ్నాయ విధానాల కోసం రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు.

**సీతారామ్ ఏచూరి**

**జనవరి 18వ తేదీన హైదరాబాద్‌లోని ఎం.బి. భవన్‌లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సీతారామ్ ఏచూరి ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులను వివరించారు. ఆయన ప్రసంగాన్ని సంగ్రహంగా మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం:**

నేటి ప్రపంచం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో వుంది. 2008లో అమెరికాలో ఏర్పడిన ద్రవ్య సంక్షోభం నేడు ప్రపంచం మొత్తాన్ని చుట్టుముట్టింది. ఈ సంక్షోభం నాలుగు దశలుగా సాగి ప్రస్తుతం అయిదవ దశలో వుంది.

మొదటి దశ, అమెరికాలోనూ, ఇతర పెట్టుబడి దారీ దేశాల్లోనూ ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల ఏర్పడింది. నయా-ఉదారవాద విధానాల వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. దీన్ని అధిగమించడానికి అక్కడి ఫైనాన్స్ సంస్థలు ప్రజలకు చౌకయిన రుణాలు ఇవ్వడం ప్రారంభించాయి. అప్పుచేసి పప్పుకూడు అన్నట్లు బ్యాంకు రుణాలు, క్రెడిట్ కార్డులు పొందిన ప్రజలు మార్కెట్ చేయడం వల్ల పారిశ్రామిక వేత్తల ఉత్పత్తులు అమ్ముడు పోయాయి.

కానీ ఈ పరిస్థితి ఎక్కువ కాలం నిలవ లేదు. రుణాలు తీర్చే సామర్థ్యం ప్రజల వద్ద లేకపోవడం వల్ల సంక్షోభం రెండో దశ ప్రారంభ మైంది. ప్రజలు రుణాలు చెల్లించక పోవడంతో బ్యాంకులు, వాటికి రుణాలిచ్చిన ఫైనాన్స్ సంస్థలు కుప్పకూలిపోయాయి. 2008లో సబ్‌ప్రైమ్ రుణాల సంక్షోభంలో ఫైనాన్స్ సంస్థలు కుప్పకూలిపోవడంతో ద్రవ్య సంక్షోభం తీవ్ర మైంది.

ఈ సంక్షోభం నుండి ద్రవ్య సంస్థలను గట్టెక్కించడానికి ప్రభుత్వాలు బెయిలవుట్ ప్యాకేజీలు ప్రకటించాయి. కోటాను కోట్ల నిధులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వాలు ఈ ఫైనాన్స్ సంస్థలను బతికించాయి. అమెరికా ప్రభుత్వం ఒక్క 2008-09 సంవత్సరంలోనే 12.2 ట్రిలియన్ (లక్షకోట్ల) డాలర్ల బెయిలవుట్ ఇచ్చింది. ఇది ఒక ఏడాది అమెరికా స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)కి దాదాపు సమానం. అమెరికా జిడిపి 12.5 ట్రిలియన్ డాలర్లు. ఇతర ఐరోపా తదితర దేశాల్లో కూడా పరిస్థితి ఇదే విధంగా తయారైంది.

ఈ బెయిలవుట్ ప్యాకేజీల వల్ల ఫైనాన్స్ సంస్థల అప్పు కాస్తా ప్రభుత్వ అప్పుగా మారింది. దీంతో సంక్షోభం నాలుగో దశలోకి ప్రవేశించింది. దాంతో అనేక దేశాల్లో ప్రభుత్వాలు కుప్పకూలడం ప్రారంభమైంది. గ్రీసు, సైప్రస్ ప్రభుత్వాలు ఈ సంక్షోభం వల్ల కుప్ప కూలాయి. స్పెయిన్, పోర్చుగల్ ఇతర అనేక దేశాలు సంక్షోభంలో పడ్డాయి.

ప్రభుత్వాల అప్పుల వల్ల ప్రభుత్వ ఖర్చులు తగ్గించుకోవాలన్న ఒత్తిడి వాటిపై పెరుగుతోంది. ప్రస్తుతం సంక్షోభం ఈ దశలో, అయిదో దశలో వుంది. ఒత్తిడికి తట్టుకోలేని అనేక దేశాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయి. పొదుపు చర్యలు ప్రారంభించాయి. పని గంటలు పెంచుతున్నాయి. వేతనాలు తగ్గిస్తున్నాయి. ఉద్యోగాలపై నిషేధాలు పెడుతున్నాయి. దీనివల్ల అనేక దేశాల్లో నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. యూరప్‌లో నిరుద్యోగం 20 శాతానికి చేరుకుంది.

రానున్న సంవత్సరాల్లో కూడా ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందన్న నమ్మకం ఆర్థిక పండితులకు కలగడం లేదు. ఒకవైపు ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతుండడంతో వారి ప్రతిఘటన కూడా పెరుగుతోంది. ప్రజలు అనేక రూపాల్లో పోరాటాల్లోకి వస్తున్నారు. వామ పక్షాలు బలంగా వున్న చోట ఈ పోరాటాలను అందిపుచ్చుకుంటున్నారు. అందువల్ల అటువంటి దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల బలం పెరుగుతోంది. పోర్చుగల్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో దాని ఓటింగు బలం గతంలో కన్నా 2 శాతం పెరిగింది. గతంలో దానికి 28 మున్సిపాలిటీలుండేవి కాస్తా ప్రస్తుత

ఎన్నికల్లో 34 మున్సిపాలిటీలు గెలుచుకుంది. దేశంలోని మున్సిపాలిటీల్లో మూడో వంతు కమ్యూనిస్టు పార్టీ చేతిలో ఉన్నాయి. దేశ రాజధాని లిస్బన్‌లో కూడా కమ్యూనిస్టు పార్టీ విజయం సాధించింది.

తూర్పు యూరప్‌లోని పాత జెకోస్లోవేకియాలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల్లో పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఇప్పుడు ఈ దేశం బొహీమియా, మ్రొవియాలుగా విడిపోయి ఉంది. ఈ దేశంలో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఉధృతంగా నడిచిన నేపథ్యంలో పార్టీ ఈ విజయాలు సాధించిన విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఈ దేశంలో పాలక వర్గాలు ఫాసిజాన్నీ, కమ్యూనిస్టు పార్టీనీ ఒకే గాటన కట్టి కమ్యూనిస్టు పార్టీని నిషేధించడానికి ప్రయత్నించారు. అటువంటి పరిస్థితుల్లో పార్టీ 15 శాతం ఓట్లు సాధించడం చిన్న విషయం కాదు.

జపాన్‌లో కూడా ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ మంచి విజయాలు సాధించింది. ఒక దశాబ్దం తరువాత అక్కడ ఎన్నికల్లో జపాన్ కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం రెట్టింపయింది.

ఇక లాటిన్ అమెరికాలో పరిణామాలు మనకు తెలుసు. అక్కడ సామ్రాజ్యవాద వ్యతిరేక, వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డం, ప్రజానుకూల, ప్రత్యామ్నాయ విధానాలు అనుసరించడం జరుగుతోంది. అయితే ఇటీవల హ్యూగో ఛావెజ్ చనిపోయిన వెంటనే వెనిజులాలో జరిగిన ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడు ముదురోకు చాలా తక్కువ మెజారిటీ వచ్చింది. దాంతో అక్కడ పురోగామి ప్రభుత్వ దెబ్బతింటుందేమోనన్న ఆందోళన కలిగింది. అయితే తదనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఛావెజ్ స్థాపించిన సోషలిస్టు పార్టీకి 13 శాతం పైగా ఓట్లు పెరిగాయి. చిలీలో కూడా ప్రజా ఉద్యమం వేగంగా, బలంగా పెరుగుతోంది.

మొత్తం మీద చూసినప్పుడు ఏ దేశాల్లోనైతే వామపక్షాలు బలంగా ఉండి, ప్రజా పోరాటాలను అందుకుంటున్నాయో అక్కడ అవి బలపడుతున్నాయి.

కానీ యూరప్‌లో వామపక్షాలు బలహీనంగా ఉన్న దేశాల్లో మితవాద శక్తులు పురోగమించడాన్ని మనం చూస్తున్నాం. ఇలాంటి అనేక దేశాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మితవాద శక్తులు గెలిచాయి.

**"రానున్న రోజుల్లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఈ రాజకీయ ఘర్షణ మరింత పెరుగుతుంది. మన పార్టీ 20 మహా సభ చెప్పినట్లే ప్రపంచ పరిణామాలు సాగుతున్నాయి. మన దేశంలో కూడా ఈ ఘర్షణ తీవ్ర మవుతోంది. ఈ పరిస్థితి ప్రజా పోరాటాలకు అనుకూలమైన భూమిక సృష్టించింది. భౌతిక పరిస్థితి అనుకూలంగాఉంది. అయితే వీటినిఉపయోగించుకునే భౌద్ధిక శక్తులను- ప్రజా పోరాటాలను అభివృద్ధి చేయాలి."**

రానున్న రోజుల్లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఈ రాజకీయ ఘర్షణ మరింత పెరుగుతుంది. మన పార్టీ 20వ మహా సభ చెప్పినట్లే ప్రపంచ పరిణామాలు సాగుతున్నాయి. మన దేశంలో కూడా ఈ ఘర్షణ తీవ్ర మవుతోంది. ఈ పరిస్థితి ప్రజా పోరాటాలకు అనుకూలమైన భూమిక సృష్టించింది. భౌతిక పరిస్థితి అనుకూలంగా ఉంది. అయితే వీటిని ఉపయోగించుకునే భౌద్ధిక శక్తులను- ప్రజా పోరాటాలను అభివృద్ధి చేయాలి.

ఈ నేపథ్యంలో సామ్రాజ్యవాదం తన పెత్తనాన్ని పెంచుకోడానికి ప్రయత్నాలు తీవ్రతరం చేసింది. కొన్ని రంగాల్లో దానికి ఎదురు దెబ్బలు కూడా తగులుతున్నాయి.

మధ్య ప్రాచ్యంలో సిరియాలో అంతర్యుద్ధం సృష్టించి దానిపై తన ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి అమెరికా ప్రయత్నించింది. ఇరాక్, లిబియాల మాదిరిగానే అక్కడ కూడా ప్రయత్నాలు చేసింది. కాని రష్యా జోక్యం వల్ల దాని ఆటలు సాగలేదు. సిరియాతో ఒప్పందం చేసుకోవాల్సి వచ్చింది. అలాగే ఇరాక్‌ను ఒంటరిపాటు చేసి దాడి చేయడానికి అది చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. రష్యా, చైనాల జోక్యంతో అక్కడ పరిస్థితి మారింది. ఇరాక్‌తో అమెరికా ఒప్పందానికి రావలసి వచ్చింది. ఈ ఒప్పందంతో ఇజ్రాయిల్ అమెరికా పట్ల ఆగ్రహంతో ఉంది. అయినప్పటికీ ఇజ్రాయిల్, సౌదీలను ఉపయోగించుకుని మధ్య ప్రాచ్యంలో తన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది.

### భారత ఉపఖండంలో పెరుగుతున్న మితవాదం

ఆఫ్ఘనిస్థాన్ నుండి అమెరికా వెనక్కు తగ్గుతుంటే ఆ మేరకు తాలిబాన్ల శక్తి పెంచుకుంటున్నారు. అమెరికా పూర్తిగా వెళ్లిపోతే ఆఫ్ఘనిస్థాన్ తాలిబాన్ల నియంత్రణలోకి వెళ్లే అవకాశం ఉంది. దీని వల్ల మన పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోకూడా తాలిబాన్ల శక్తి పెరుగుతుంది. దీని ప్రభావం మన దేశంపైన కూడా ప్రతికూలంగా ఉంటుంది.

రెండోవైపు మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో కూడా మిత వాద శక్తులు బలపడుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికలను అక్కడి ముస్లిం మితవాదులూ, ఖలీదా జియా

వెలువడింది
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రచురణ
భాషా ప్రయుక్త సమైక్య రాష్ట్రాలు
సిపియం వైఖరి వివరించే పత్రాలు
ప్రతులకు :
వెల : రు 3/- పేజీలు : 32
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20
ఫోన్: 27608107, 9490098009, 9490099057,
బ్రాంచీలు :

**“ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలంటే ఆర్థిక సంస్కరణలను మరింత లోతుగా అమలు చేయాలని పాలక వర్గాలు చెబుతున్నాయి. నిజానికి మన ప్రభుత్వాలు అనుసరించిన సంస్కరణల వల్లనే ఈ దుస్థితి వచ్చింది. దేశాన్ని ఈ దుస్థితికి తెచ్చిన సంస్కరణలనే మళ్లీ మందుగా వాడాలని వారు నిర్ణయించారు.”**

నాయకత్వంలోని ప్రధాన ప్రతిపక్షం బహిష్కరించాయి. ప్రతిపక్షాలు లేకుండా ఎన్నికలు జరపడం సరికాదని భారత దేశం సలహా ఇచ్చింది. ఏకపక్ష ఎన్నికల్లో షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ గెలుపొందింది. కానీ ఆ ప్రభుత్వానికి బంగ్లా ప్రజల్లో గుర్తింపు లేదు. బంగ్లాదేశ్‌లోని మితవాదులకూ తాలిబాన్లకూ మధ్య సంబంధాలు ఏర్పడుతున్నాయి. దీని ప్రభావం భారత్‌పై పడుతుంది. మన మీద దాడులు పెరిగే అవకాశం వుంది.

నేపాల్‌లో దాదాపు 8 సంవత్సరాలుగా రాజ్యాంగం తయారు కాలేదు. అది తయారైతే తప్ప అక్కడ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వం ఏర్పడే అవకాశం లేదు. మావోయిస్టు పార్టీకి చెందిన ప్రచండ రెండు సార్లు ప్రధాని అయినారు. కమ్యూనిస్టు పార్టీ (యుఎంఎల్)కు రెండు సార్లు ప్రధాని పదవి లభించింది. నేపాలీ కాంగ్రెస్ నుండి ఒకసారి ప్రధాని అయినారు. ఈసారి ఎన్నికల్లో ప్రచండకు ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టుల్లో గ్రూపులు ఏర్పడ్డాయి. నేపాల్‌లో ఏర్పడిన ఈ అస్థిరత ఈ ప్రాంతంలోని మితవాద శక్తులకు మంచి అనుకూలంగా మారింది. వారు నేపాల్ ద్వారా తమ కార్యకలాపాలు నడపడానికి అవకాశాలు ఏర్పడ్డాయి.

ఈ నేపథ్యంలో మన దేశంలో బిజెపి, మతతత్వం రాజకీయంగా పెరగడం ఈ అస్థిరతకు మరింత ఊతమిస్తోంది. ఎందుకంటే మన దేశంలో బిజెపి మతోన్మాదం పెరగడం ఇరుగుపొరుగు దేశాల్లో మితవాద శక్తుల విజృంభణకు తోడ్పడుతుంది. మన దేశంలో 1990 ఎన్నికల సందర్భంగా పాకిస్తాన్‌లోని జమాతె ఇస్లామీ నాయకుడిని విలేకరులు అడిగినప్పుడు ఆయన వాజ్‌పేయి ప్రభుత్వం రావాలని చెప్పాడు. భారత్‌లో హిందూ మతోన్మాదం ఎంతగా బలపడితే పాకిస్థాన్‌లో మేమూ అంతగా బలపడతాము అని ఆయన చెప్పాడు. అందువల్ల హిందూ, ముస్లిం మతోన్మాదాలు రెండూ ఒకదానికి ఒకటి సహకరించుకుని పెరుగుతాయి. నేడు భారత్‌లో బిజెపి పెరిగితే, మోడీకి ఆదరణ పెరిగితే ముస్లిం మతత్వం వెర్రితలలు వేయడానికి అవకాశాలు పెరుగుతాయి.

**జాతీయ రాజకీయాలు**

మన దేశంలో ప్రస్తుతం మతోన్మాద రాజకీయాలను ఆపడం మన ప్రధాన కర్తవ్యంగా వుంటుంది. ఎందుకంటే మతోన్మాదం పెరిగే కొద్దీ మన వర్గాల మధ్య ఐక్యత దెబ్బతింటుంది. మతోన్మాదం పెరిగే కొద్దీ మన విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం కష్టతరమవుతుంది. అందువల్ల మన వుద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలంటే మనం శ్రామిక ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాలి. దానికి గాను బిజెపీని రాజకీయంగా ఓడించడం చాలా అవసరం.

ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం మన దేశం మీద కూడా వుంది. మన దేశంలో కూడా ఆర్థిక పరిస్థితి దిగజారుతోంది. మన స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) 9 శాతం నుండి 5 శాతానికన్నా తక్కువకు పడిపోయింది. వ్యవసాయం చాలా కాలంగా అధోగతి వైపు పయనిస్తోంది. వస్తూత్పత్తి రంగం దిగజారుతోంది. సర్వీసు రంగం కూడా స్థంభించింది. ఎగుమతులు దిగజారాయి. విదేశీ మారక నిల్వలు తరుగుతున్నాయి. రూపాయి విలువ పడిపోతోంది.

ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలంటే ఆర్థిక సంస్కరణలను మరింత లోతుగా అమలు చేయాలని పాలక వర్గాలు చెబుతున్నాయి. నిజానికి మన ప్రభుత్వాలు అనుసరించిన సంస్కరణల వల్లనే ఈ దుస్థితి వచ్చింది. దేశాన్ని ఈ దుస్థితికి తెచ్చిన సంస్కరణలనే మళ్లీ మందుగా వాడాలని వారు నిర్ణయించారు.

**దోహా చర్చలు**

దోహాలో జరుగుతున్న ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటివో) చర్చల్లో మన దేశం చివరికి పశ్చిమ దేశాల ఒత్తిడికి లొంగి కుదుర్చుకున్న ఒప్పందం దేశంలోని పేద ప్రజానీకానికి నష్టదాయకంగా పరిణమించనున్నది. దేశంలోని ధరల విధానాన్ని మార్చకూడదని దోహాలో ఒప్పందం కుదిరింది. అంటే మార్కెట్ ధరల విధానంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదు. ఆహారోత్పత్తులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వకూడదనేది దోహా చర్చల్లో వచ్చిన ప్రధాన వాదన. అలా చేస్తే మార్కెట్‌లో రేట్లు పెరుగుతాయి. దాని వల్ల అంతర్జాతీయ స్వేచ్ఛా మార్కెట్ దెబ్బతింటుంది. అందువల్ల ప్రభుత్వాలు ప్రజలకు ఇవ్వాల్సిన సదుపాయాలేవైనా నగదు రూపంలో ఇవ్వాలిగానీ సబ్సిడీల రూపంలో ఇవ్వకూడదు. దోహాలో సబ్సిడీల తగ్గింపును 4 ఏళ్లు వాయిదా వేయడం జరిగింది. దాన్ని మన ప్రభుత్వం దోహా విజయంగా ప్రచారం చేసుకుంటున్నది. కానీ ఇప్పుడు ప్రభుత్వం 60 శాతం వరకు సబ్సిడీలు ఇస్తున్నది. 100 శాతం వరకు ఇవ్వాలని మనం కోరుతున్నాం. దోహా ఒప్పందం వల్ల ప్రభుత్వ సబ్సిడీలు పెంచడం సాధ్యం కాదు. 4 ఏళ్ల తరువాత క్రమంగా తగ్గించాలి. అందుకే యుపిఎ ప్రభుత్వం 'నగదు బదిలీ' పథకం ప్రవేశ పెట్టింది. రానున్న ప్రభుత్వం ఏదైనా 'నగదు బదిలీ' అమలు చేయడం మినహా మరో

(మిగతా 34వ పేజీలో

**'మార్క్సిస్టు'కు**

**మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

ఈ మాసం ప్రత్యేకం

# సామాజిక న్యాయం కోసం పోరాటం: కొన్ని అనుభవాలు



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి

బి.వి. రాఘవులు

దళితులపై జరుగుతున్న సామాజిక అణిచివేత, ఆర్థిక దోపిడీ అంతం కావాలని మన రాజ్యాంగం నిర్దేశించింది. అనేక చట్టాలు చేశారు. అనేక పథకాలు ప్రవేశపెట్టారు. వాటి అమలు తీరు, సాధించిన ఫలితాలు అశా జనకంగా లేవు. దీనికి ముఖ్యమైన కారణం దళితుల పరిస్థితుల్లో సమూల మార్పుల కోసం పోరాడుతన్న వారికంటే కూడా యథాతథ పరిస్థితి కొనసాగితే లబ్ధిపొందే శక్తుల ప్రభావం ప్రభుత్వం పైనా, పౌరసమాజంపైనా బలంగా వుండటం. మరో కారణం - దళితుల పక్షం వహిస్తున్న వివిధ కులసంఘాలు, వర్గ సంఘాలు, ప్రజాసంఘాల అవగాహన లోనూ, ఆచరణ లోనూ ఉన్నలోపాలు, బలహీనతలు. ఈ రంగంలో మేము చేపట్టిన కార్యక్రమాల నుండి పొందిన అనుభవాలను మీ ముందుంచుతున్నాను. దళిత సంఘాల బలాలు, బలహీనతలను గురించి కూడా చెప్పాలి. దళిత సమస్యలను చేపట్టిన సందర్భంలో దళిత సానుభూతిపరుల, వ్యతిరేకుల ప్రతిస్పందనలు ఎలా వున్నాయోకూడా చెప్పదలుచుకున్నాను.

దలితుల సమస్యలపై రాష్ట్రంలో మూడు ప్రధానమైన ఉద్యమాలు జరిగాయి. ఒకటి ఎస్.సి, ఎస్‌టి కమీషన్ ఏర్పాటు కోసం జరిపిన పోరాటం. రెండవది అంటరానితనంపై ప్రత్యక్ష కార్యాచరణ. మూడవది - ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ (ఉప ప్రణాళిక) కోసం జరిపిన పోరాటం. ఈ మూడు ఉద్యమాల పట్ల వివిధ శక్తులు అవలంబించిన సానుకూల, వ్యతిరేక వైఖరులు మా అనుభవంలోకి వచ్చాయి.

ముందుగా ఆంధ్ర ప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్‌టీ కమీషన్ ఏర్పాటు కోసం జరిగిన పోరాటం గురించి చెబుతాను.

ఈ ఉద్యమం ప్రారంభించే నాటికి అస్పృశ్యత గురించి సమాజంలో ఉన్న అవగాహన ఎలా ఉందో చూద్దాం. అంటరానితనం దాదాపు పూర్తిగా అంతమైపోయిందని అందరూ అనుకుంటున్నారు. అనేక మంది అడిగారు. మన రాష్ట్రంలో కులవివక్ష ఇంకా ఎక్కడుంది? అని. బూర్జువా భూస్వామ్య పార్టీలైతే దళతుల పట్ల వివక్ష లేదని అడ్డంగా వాదిస్తున్నారు. ఎక్కడన్నా కొద్దిగా ఉంటే దాన్ని ఈ వామపక్షాలు, దళిత సంఘాలు ఎక్కువ చేసి చూపుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇక ఆర్.ఎస్.ఎస్/ బి.జె.పి పరివారం మరొక వాదన చేస్తున్నారు. క్రైస్తవ సంస్థలు మత మార్పిడులను సమర్ధించుకోవడం కోసం అంటరానితనం సమస్యను ఎక్కువగా చేసి ప్రచారం చేస్తున్నారనేది వారి ఆరోపణ. చివరికి బూర్జువా భూస్వామ్య పార్టీలలో వున్న కొందరు దళిత నాయకులు కూడా కులవివక్ష పెద్ద సమస్య కాదులే అన్నట్లు కొట్టి పడేయటం ఆనవాయితీ అయింది. మీడియాలోని ప్రధాన స్రవంతి కూడా ఈ సమస్యపట్ల మౌనం వహించింది. తప్పని సరై ప్రస్తావించిన సందర్భాలలో సైతం వాస్తవాలను వక్రీకరించిన సందర్భాలున్నాయి.

1999 అక్టోబరులో కె.వి.పి.యస్ (కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) అంటరానితనం, కులవివక్ష ఏ స్థాయిలో ఉన్నాయో క్షేత్రస్థాయిలో అంచనా వేయడానికి ఒక రాష్ట్ర స్థాయి సర్వే నిర్వహించింది. మన కార్యకర్తలు 15 రోజుల్లో 11 వేల దళిత వాడలను సందర్శించారు. కళ్ళు తెరిపించే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

పరిశీలనలకు అధికార ముద్ర వుంటే సర్వ జనామోదం పొందుతాయి. శంఖంలో పోస్తే కాని తీర్థం కాదన్నట్లు. అందుకనే రాష్ట్రంలో కులవివక్షను అధ్యయనం చేసి, దాన్ని అంతం చేసే మార్గాలను సూచించే అధికార సంఘాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ ఉద్యమం చేశారు.

1998,99 సంవత్సరాలలో నిరంతర పోరాటం జరిగింది. మార్చి 22 చలో అసెంబ్లీ కార్యక్రమంలో వేలాది ప్రజలు పాల్గొన్నారు. వామపక్షాల శాసనసభ్యులు సమస్యలను సభలో లేవనెత్తారు. ఇలా శాసనసభలోనూ, బైటా వత్తిడి పెరిగే సరికి తప్పనిసరై ప్రభుత్వం రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పున్నయ్య గారి ఆధ్వర్యంలో ఏక సభ్య సంఘాన్ని నియమించింది. ఇది జరిగింది 2001 మార్చి 23న. ఈ సంఘం రాష్ట్రమంతా పర్యటించి దళితుల స్థితిగతుల గురించీ, వీరనుభవిస్తున్న వివక్ష గురించీ సాక్ష్యాధారాలను సేకరించింది. అనేక చోట్ల బహిరంగ విచారణలు నిర్వహించింది. వ్యక్తులు, సంఘాలు, రాజకీయ పార్టీలు సమర్పించిన అర్జీలనూ, ఫిర్యాదులనూ స్వీకరించింది. తాను సేకరించిన సమాచారాన్ని ఆధారం చేసుకుని ఈ సంఘం ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. రెండువేల పేజీల నివేదిక అది. అందులో మన సర్వేలో వెలుగు చూసిన విషయాలు నిర్ధారించబడ్డాయి. జస్టిస్ పున్నయ్య కమీషన్ సిఫార్సులను అమలు చేయడానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఏర్పాటు చేయాలని మరో పోరాటం జరిపాము. ఎట్టకేలకు ఫబ్రవరి 2003లో ప్రభుత్వం ఒక చట్టం చేసింది. తద్వారా రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ

> **"ఆలయ ప్రవేశం అనే అంశం గురించి విభిన్న పక్షాలు మనల్ని విమర్శించడంలో ఏకమయ్యాయి. కమ్యూనిస్టులు మతాన్ని ప్రోత్సహించడం ఏమిటని అడిగారు కొందరు. హిందూ మతమే కులవ్యవస్థకు పునాది కదా, అలాంటి మతాన్ని వదిలిపెట్టి వేరే మతాల్లో చేరకుండా అడ్డుకోవడం కాదా మీరు చేస్తున్న పని? అని అడిగారు కొందరు. మరికొందరైతే మీ కమ్యూనిస్టులు నాస్తికులు కదా, మీరు పనిగట్టుకొని దళితులతో దేవాలయ ప్రవేశం చేయించడం ఏమిటన్నారు."**

కమీషన్ ఏర్పాటయింది. జస్టిస్ పున్నయ్యను దానికి మొదటి ఛైర్మన్‌గా నియమించారు.

పున్నయ్య గారు బాధ్యతలు నిర్వహించిన మూడేళ్ళు కమీషన్ చాలా చురుకుగా, క్రియాశీలంగా వ్యవహరించింది. దళితులకు ధైర్యాన్నిచ్చింది. విశ్వాసాన్ని కలిగించింది. దళిత సమస్యలపై ప్రభుత్వం జవాబుదారీతనం కలిగి వుండాలని కమీషన్ గట్టిగా కోరింది. జస్టిస్ పున్నయ్యగారి పదవీకాలం అయిపోగానే ప్రభుత్వం కొత్త ఛైర్మన్‌గా తన సొంతమనిషిని నియమించింది. ఇంతే సంగతులు – కమీషన్ కార్యక్రమాలు చప్పబడ్డాయి. ఈ కొత్త ఛైర్మన్ 2009లో అధికార పార్టీ అభ్యర్థిగా ఎన్నికలలో పోటీ చేయడం వల్ల ఛైర్మన్ స్థానం ఖాళీ అయింది. ఇంతవరకు ఛైర్మన్ స్థానం భర్తీ చేయలేదు. గతంలో అధికారంలో వున్న పార్టీయే మళ్ళీ అధికారం పొందినప్పటికీ, నాలుగేళ్ళకు పైగా ఛైర్మన్ స్థానం ఖాళీగానే వుంది.

ఒక రాష్ట్రస్థాయి కమీషన్‌ను ఏర్పాటు చేయటంతోనే కులవివక్ష అంతమవుతుందనీ, దళితుల సమస్యలన్నీ తీరిపోతాయనీ ఎవ్వరూ భ్రమపడలేదు. సమస్య గురించి ప్రజలను కదిలించటానికి ఇదొక సాధనంగానూ, వేదికగానూ వుపయోగపడగలదని భావించాము. ఛైర్మన్ చురుకుగా వుంటే ప్రభుత్వ యంత్రాంగంపై ఒత్తిడి తేవడానికి అవకాశం బాగా వుంటుంది. మొదటి ఛైర్మన్ హయాంలో ఇది నిరూపణ అయింది. అప్పటి ఛైర్మన్ (జస్టిస్ పున్నయ్య) దళిత సమస్యలపై స్పందించడం, దీక్షగా వ్యవహరించడం జరిగింది. ఆయనది రాజకీయ నియామకం కాకపోవడం వల్ల అది సాధ్యమయింది. అధికార పక్షం చెప్పుచేతల్లో వుండే వ్యక్తి ఛైర్మన్ అయిన తర్వాత పరిస్థితి మారిపోయింది.

కమీషన్‌కు అధికారాలు ఏమీ లేవు. అయినప్పటికీ పాలకవర్గాలు, పాలకపార్టీలు దాని వునికినే భరించలేకపోతున్నాయి. కారణం వుంది. క్రియాశీలకార్యకర్తల పోరాటాలకి ఈ కమీషన్ ఒక సాధనంగా వుపయోగపడే అవకాశాన్ని వారు గుర్తించారు. అందువల్లనే ఛైర్మన్ స్థానం ఇప్పటికీ ఖాళీగా వుంది.

ఆసక్తికరమైన విషయం ఒకటుంది. ఇతర విషయాలలో గట్టిగా మాట్లాడే దళిత సంఘాలు కమీషన్ ఛైర్మన్ పదవి గత నాలుగేళ్ళుగా ఖాళీగా వున్న విషయం గురించి మౌనం పాటించాయి. ఈ కమీషన్‌కు తిరిగి జవసత్వాలు కలిగించాలనే కోరిక పట్ల వారు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు.

ఇక అంటరానితనంపై మనం జరిపిన పోరాటాన్ని విశ్లేషించుకుందాము. 2006లో అంటరానితనానికి వ్యతిరేకంగా కె.వి.పి.యస్ రాష్ట్ర వ్యాప్త ప్రత్యక్ష కార్యాచరణ జరిపింది. రంగారెడ్డి జిల్లాలో నేనూ, పాతికమంది కార్యకర్తలూ కలిసి ఒక సైకిల్ యాత్ర చేశాము. 2006 ఏప్రిల్ 2 నుండి 13 వ తేదీ వరకు ఈ యాత్ర జరిపాము. 950 కిలోమీటర్లు తిరిగాము, 152 గ్రామలను పర్యటించాము. 69 గ్రామాలలో ప్రత్యక్ష కార్యచరణ చేయగలిగాము. ఆలయప్రవేశం, రెండుగ్లాసుల విధానాన్ని భగ్నం చేయడం – ఇంకా కొన్ని ఇతర కార్యక్రమాలను చేపట్టాము. ఇదే మాదిరిగా తిరిగి 2007లో సైకిల్ యాత్రలు జరిపాము. ఈసారి 10 రోజులపాటు 8,336 గ్రామాలగుండా పర్యటన జరిగింది. 41 వేల కిలోమీటర్ల దాకా యాత్ర సాగింది.

ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. మేము పొగడ్తలు, తెగడ్తలు రెండూ పొందాము. శాంతియుతంగా వున్న గ్రామాలలో తగాదాలు రెచ్చగొడుతున్నామని కొన్ని శక్తులు మమ్మల్ని విమర్శించాయి. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి బతుకుతున్న ప్రజల్లో స్పర్ధలు కలిగిస్తున్నామని నిందించారు. మా పర్యటనలో అనేక గ్రామాల్లో ఒక ప్రత్యేక పరిస్థితి ఎదురైంది. కొందరు దళితులు మేము గ్రామంలోకి వెళ్ళగానే ఎదురొచ్చి తమ గ్రామంలో ఏమాత్రం కుల వివక్ష లేదనీ, చక్కటి సహజీవనం సాగిస్తున్నామనీ చెప్పారు. మేము ఆరాతీస్తే తెలిసిందేమిటంటే ఈ వ్యక్తులు అగ్రవర్ణ భూస్వాముల చెప్పుచేతల్లో వుండే దళారులని. అనేక సందర్భాల్లో మగవారికంటే ధైర్యంగా దళిత మహిళలు ముందుకొచ్చి వాస్తవాన్ని వివరించారు. మగవారు ప్రత్యేకించి వయసుమళ్ళినవారు సంక్షేమపథకాలు, భూముల కేటాయింపు, స్మశానాల సమస్యలు–వీటి గురించి ఏకరువు పెట్టి కుల వివక్ష పెద్ద సమస్య కాదనే అభిప్రాయం కలిగించే ప్రయత్నం చేశారు. దళితుల ఫిర్యాదులు ప్రభుత్వం వైపు గురిపెట్టినంతకాలం అగ్రవర్ణ భూస్వాములు ఆగ్రహించరని వారికి తెలుసు. అగ్రవర్ణాలతో ఘర్షణ వస్తే తట్టుకోలేమనే అంచనా వుండటం వల్ల సామాజిక అణచివేతతో రాజీ ధోరణి వహించడానికి అలవాటుపడిపోయారు.

ఆలయ ప్రవేశం అనే అంశం గురించి విభిన్న పక్షాలు మనల్ని విమర్శించడంలో ఏకమయ్యాయి. కమ్యూనిస్టులు మతాన్ని ప్రోత్సహించడం ఏమిటని అడిగారు కొందరు. హిందూ మతమే కులవ్యవస్థకు పునాది కదా, అలాంటి మతాన్ని వదిలిపెట్టి వేరే మతాల్లో చేరకుండా అడ్డుకోవడం కాదా మీరు చేస్తున్న పని? అని అడిగారు కొందరు. మరికొందరైతే మీ కమ్యూనిస్టులు నాస్తికులు కదా, మీరు పనిగట్టుకొని దళితులతో దేవాలయ ప్రవేశం చేయించడం ఏమిటన్నారు. అస్పృశ్యత అనే సమస్య ఆ విమర్శకులకు పట్టదు. అసలు సమస్య ఒక మతాన్ని ప్రోత్సహించడమా, మరొక మతాన్ని తిరస్కరించడమా అన్నది కాదు. మన వాదానికి మతంతో ప్రమేయం లేదు. కొందరు వ్యక్తులు కొన్ని విశ్వాసాలు కలిగి వున్నారు. వారికి మిగతా ప్రజలలాగే ఆలయంలో ప్రవేశించడానికి సమాన హక్కులు కావాలని, తాము విశ్వసించే మతంలో కులవివక్ష పోవాలని కోరుకుంటున్నారు. ఇక్కడ కమ్యూనిస్టులుగా మా వ్యక్తిగత విశ్వాసాల ప్రమేయం లేదు. వివక్షకు గురౌతున్న వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నాము. కులవివక్షకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో ఇదొక మార్గం.

బూర్జువా భూస్వామ్య పార్టీల నాయకులు, ప్రత్యేకించి స్థానిక నాయకులు మోసపూరితంగా వ్యవహరించారు. కొందరు నాయకులు అతి తెలివి ప్రదర్శించారు. వారు యాత్ర బృందానికి ఎదురొచ్చి స్వాగతం పలికి పొగడ్తలతో ముంచెత్తే వారు. తమ గ్రామంలో కులవివక్ష ఏమాత్రం లేదని సెలవిచ్చేవారు. అయితే వారు

మా దగ్గర వున్నంత వరకు మౌనంగా వున్న స్థానిక దళితులు ఆ పెద్దలు అవతలకు వెళ్ళగానే కులవివక్ష నిరాఘాగంగా కొనసాగుతున్నదని తెలియజేసేవారు. కొన్ని గ్రామాలలో మరొక పరిస్థితిని ఎదుర్కొన్నాము. స్థానిక దళిత నాయకులు దళానికి ఎదురొచ్చి మా గ్రామంలో వివక్ష లేదనీ, మీరు మరో గ్రామానికి వెళ్ళండనీ చెప్పేవారు. స్థానిక పెత్తందారులు వీరితో అలా చెప్పించారు. అనేక గ్రామాలలో పెత్తందారులు వారి రాజకీయ విభేదాలను పక్కన పెట్టి దళిత వ్యతిరేక విధానంలో ఐక్యమయ్యారు. కొన్నిచోట్ల అగ్రవర్ణాలకంటే ఎక్కువగా బి.సి. కులాల వ్యక్తులు ఈ కార్యక్రమానికి వ్యతిరేకంగా ఆగ్రహావేశాలు ప్రదర్శించారు. కొన్ని సందర్భాలలో పురుషులను మించి మహిళలు ఉద్రేక పడ్డారు.

దళితులపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు అనేక సందర్భాలలో జరుగుతూ వున్నాయి. ఆయా సందర్భాలలో న్యాయంకోసం ప్రజలు ఆందోళనలు చేయటం కూడా చూస్తున్నాము. కారంచేడు, చుండూరు, లక్సింపేట ఘటనలకు సంబంధించి దళిత సంఘాలు మంచి కృషి చేశాయి. దళిత సంఘాల నాయకుల మధ్య ఐక్యత లేదుగానీ, సంఘటనల అనంతరం స్పందించటంలో వెనుకబడటం లేదు. అయితే అంటరానితనానికి వ్యతిరేకంగా వారు ఉద్యమాలు చేయటం లేదు. దళితుల ఆత్మగౌరవానికీ, సమానహక్కుల సాధనకు మద్దతు కోసం వారి కార్యాచరణ కనిపించదు.

**" దళితులపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు అనేక సందర్భాలలో జరుగుతూ వున్నాయి. ఆయా సందర్భాలలో న్యాయంకోసం ప్రజలు ఆందోళనలు చేయటం కూడా చూస్తున్నాము. అయితే అంటరానితనానికి వ్యతిరేకంగా వారు ఉద్యమాలు చేయటం లేదు. దళితుల ఆత్మగౌరవానికీ, సమానహక్కుల సాధనకు మద్దతు కోసం వారి కార్యాచరణ కనిపించదు. "**

దళిత నాయకులలో ఎక్కువమంది పట్టణాలలో నివసించే ఉద్యోగులు. కాబట్టి గ్రామాలలో కొనసాగుతున్న కులవివక్ష పట్ల వారికి అవగాహన లేదు, కనుకనే వారు కులవివక్ష పట్ల స్పందించటం లేదు అనుకోవడం సరికాదు. సరిగ్గా ఈ నాయకులే షెడ్యూల్డు కులాల వర్గీకరణ గురించి గ్రామాల్లో చురుగ్గా పనిచేస్తున్నారు. కాబట్టి అవగాహనాలోపం అనే సమస్య లేదు. సమస్య వున్నదెక్కడంటే వారి విశ్వాసాలు, ప్రాధాన్యతలలోను, వారి వైఖరి లోను. ఈ సంఘాలు రిజర్వేషన్ల సమస్య పట్ల స్పందించే తీరుకు అస్పృశ్యత పట్ల స్పందించే తీరుకు చాలా తేడా వుంది. ప్రతి సంవత్సరం, ఏప్రిల్ 14న దళిత సంఘాల నాయకులు డా॥ అంబేద్కర్ జయంతిని గ్రామాలలోనూ, పట్టణాలలోనూ జరుపుతారు. ఆరోజు మాత్రం అంటరానితనం పట్ల, కులవివక్షపట్ల ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తారు. అంతటితో సరి. కనీసం ఏటా నాలుగైదు రోజులపాటు గ్రామాల్లో



జస్టిస్ పున్నయ్య

పర్యటించి అస్పృశ్యతకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ దళితులలో చైతన్యాన్ని కలిగించుదామనే ఆలోచనగానీ, ప్రయత్నం గానీ వారిలో కనిపించడం లేదు.

కమ్యూనిస్టులెంతసేపూ వర్గ పోరాటాలపైనా, ఆర్థిక విధానాలపైనా కేంద్రీకరిస్తారు గానీ, సాంఘిక అణచివేతను పట్టించుకోరనే విమర్శ వుంది. ఈ విమర్శలో కొంత నిజం వుంటే వుండవచ్చు. విచిత్రమేమంటే ఈ విమర్శ చేస్తున్న దళిత సంఘాల నాయకులు మాత్రం పూర్తిగా రిజర్వేషన్లు, ఆర్థిక వెసులుబాట్ల గురించి మాత్రమే పనిచేస్తున్నారు.

కులవివక్షతో సుదీర్ఘకాలంగా సమాధానపడిపోయిన దళితులను పోరాటానికి సిద్ధం చేయడం అంత సులభమైన పనికాదు. "ఈ రోజు మీరు మా పక్కనుండి ధైర్యం చెబుతారు. రేపు అగ్రవర్ణాల భూస్వాములు మాపై దాడిచేస్తే మా గతేమిటి?" అనే ప్రశ్న తరచుగా ఎదురవుతున్నది. ఇది న్యాయమైన ప్రశ్న. మనం వారిని వదిలిపెట్టకుండా తోడుగా వుంటామనే విశ్వాసం కలిగించిన తర్వాత వారు వివక్షను ఎదుర్కోవడానికి ముందు కొచ్చారు. మన సంఘంగానీ, ఇతర సంఘాలు గానీ వారికి విశ్వాసం కలిగించడం, దృఢ నిశ్చయం, కర్తవ్య దీక్ష కలిగిన స్థానికులు నాయకత్వం వహించడానికి ముందుకు రావడం జరిగిన సందర్భాలలో దళితులు ప్రత్యక్ష కార్యాచరణలో పాల్గొన్నారు.

అలాంటి పరిస్థితులు లేని చోట్ల, మన యాత్ర ప్రచారం మాత్రం చేయగలిగింది. ఒక గ్రామంలో దళితులు సంఘటితం కావడం, అక్కడ ముందునుండీ పనిచేస్తున్న కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక న్యాయం కోసం నిలబడే కమ్యూనిస్టులు లాంటి రాజకీయ శక్తులు తోడ్పాటునివ్వడం అనే పరిస్థితులు లేకుండా వివక్షను అంతమొందించడం సాధ్యం కాదు.

మూడవ ఉద్యమం ఉపప్రణాళిక, నోడల్ ఏజెన్సీల గురించి చట్టం చేయమనే డిమాండుకు సంబంధించినది. దళితుల పట్ల వివక్ష కేవలం సామాజికపరంగానే కాదు, ఆర్థిక విషయాలలో కూడా కొనసాగుతున్నదనడంలో అనుమానాలకు తావులేదు.

గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో దళితవాడలూ, ఆదివాసుల నివాస ప్రాంతాలూ నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. బడ్జెట్ కేటాయింపుల విషయంలో దళితులకూ, ఆదివాసులకూ అన్యాయం జరుగుతున్నది. అదేమీ లేదని ప్రభుత్వం బుకాయిస్తున్నది. న్యాయంగా అయితే కేటాయింపులకు సంబంధించి దళితుల, ఆదివాసుల జనాభాను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సమస్యపై దళిత సంఘాలూ, స్వచ్ఛంద సంస్థలూ చాలా సంవత్సరాలుగా కృషి చేస్తున్నాయి. అర్జీలు, అభ్యర్థనలతో పనిజరగడం లేదని గుర్తించిన కె.వి.పి.యస్ 2007 ఫిబ్రవరిలో పోరాటానికి పిలుపు నిచ్చింది. 25 మంది రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులు 6 రోజులపాటు సత్యాగ్రహం పాటించారు. ప్రభుత్వం నోడల్ ఏజెన్సీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడానికి నవంబరు దాకా పట్టింది. ఆ ఉత్తర్వులు ఇంత

> **" దళితులు కేవలం సంక్షేమ పథకాల అమలు కోసమే పోరాడుతున్నంతకాలం పాలకవర్గ పార్టీలు, పెత్తం దారీ శక్తులు ఏమాత్రం కలవర పడవు. పైగా మద్దతు ప్రకటిస్తాయి కూడా. "**

కోరుకుంటారు.

దళితులు కేవలం సంక్షేమ పథకాల అమలు కోసమే పోరాడుతున్నంతకాలం పాలకవర్గ పార్టీలు, పెత్తం దారీ శక్తులు ఏమాత్రం కలవరపడవు. పైగా మద్దతు ప్రకటిస్తాయి కూడా.

ప్రతి పక్షంలో వున్న పార్టీలు ఆందోళనలో పాల్గొంటాయి. అధికారంలో వున్న పార్టీలు వరాలు కురిపిస్తుంటాయి. కొన్ని అమలు జరుగుతాయి కూడా. దళితుల చొరవ,

వరకు అమలుకు నోచుకోలేదు. సబ్‌ప్లాన్ (ఉప ప్రణాళిక) గ్యారంటీగా అమలు జరగాలంటే చట్టం ఏర్పాటు తప్పనిసరి అనే అవగాహనతో 2011లో ఏడు రోజుల పాటు సత్యాగ్రహం జరిపాము. ఈ కోరిక సాధ్యా సాధ్యాలను పరిశీలించడానికి ప్రభుత్వం ఒక మంత్రుల సబ్‌- కమిటీని నియమించింది. ఉప ముఖ్య మంత్రి ఈ కమిటీకి అధ్యక్షుడు. కమిటీ సిఫార్సులను ప్రభుత్వం పట్టించుకోలేదు. మార్చి 27న వంద సంఘాలతో కూడిన విశాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఒక పెద్ద నిరసన కార్యక్రమం జరిగింది.



ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సాధన కోసం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సదస్సు

తప్పనిసరైన పరిస్థితిలో ప్రభుత్వం 2012 డిసెంబరులో ఒక చట్టం చేసింది. ఇది మంచి పరిణామమే కానీ ఈ చట్టంలో చాలా లొసుగులున్నాయి. దళితులు, ఆదివాసుల కోసం ఉద్దేశించబడ్డ నిధులు ఖచ్చితంగా వారికే ఖర్చు చేస్తారనే గ్యారంటీ లేకుండా పోయింది. చట్టంలోని లొసుగులను సవరించడానికి, చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావలసివుంది.

ఈ మూడు ఉద్యమాలూ జరుగుతున్న సందర్భాలలో వివిధ శక్తులు ఏ విధంగా ప్రవర్తించాయో గమనించినప్పుడు అనేక ఆసక్తి దాయకమైన విషయాలు వెలుగులోకొచ్చాయి. కుల వివక్ష వ్యతిరేక పోరాటం పట్ల, ఉప ప్రణాళిక కోసం జరిగిన ఉద్యమం పట్ల, వివిధ శక్తులు విభిన్నమైన వైఖరులను అవలంబించాయి.

కులాలకతీతంగా మానవులంతా శరీరధర్మ పరంగా ఒక్కటేనని సైన్సు నిరూపించింది. మనుషులంతా ఒక్కటేనని మానవతా విలువలు బోధిస్తాయి. అయినప్పటికీ కులపరమైన పట్టింపులు, వివక్ష కొనసాగడానికి కారణం రాజకీయ, ఆర్థిక పరిస్థితులు. పేద దళితులు అగ్ర వర్ణ భూస్వాములు పెత్తనాన్ని ప్రశ్నించ కుండా నివారించే సాధనం కుల వివక్ష. వారు గనుక కుల వివక్షను ఎదిరించి, తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటే పెత్తందార్లకు అది పెద్ద సమస్యగా తయారవుతుంది. ఏమిటా సమస్య? ఇతర పేదలను, బి.సిలను చెప్పుచేతల్లో వుంచుకోవడం కష్టమవుతుంది. ఎలాగంటే – దళితులు కాని పేదలు, భూస్వాములతో కుల పరంగా వున్న సంబంధంకంటే దళితులతో పని పరంగా వున్న సంబంధానికి ప్రాముఖ్యత నివ్వడం జరుగుతుంది. పేదల బలం పెరుగుతుంది. వర్గ దోపిడీకి, భూ కేంద్రీకరణకు వ్యతిరేకంగా శక్తివంతమైన పోరాటం సాధ్య మవుతుంది. ఇది పాలకవర్గాల అధిపత్యపు పునాదులను దెబ్బకొడుతుంది. అందువల్లనే తమ వర్గ దోపిడీని రక్షించు కోవాలంటే కుల వివక్ష కొనసాగాల్సిందేననే అవగాహనలో పాలక వర్గాలున్నాయి. కుల వివక్షకు వ్యతిరే కంగా దళితులు తమశక్తులను కూడగట్టుకుని పోరాడటం అనివార్యంగా వర్గపోరాటాలకు తోడ్పడుతుందని గుర్తించాలి. పెత్తందారీ శక్తులు – వారే పార్టీలో వున్నా ఒక్కటే – దళితులు, ఇతర పేదల తమ కింద అణిగి మణిగి వుండా లనే కోరుకుంటున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా తమ చెప్పుచేతల్లో వున్నవారి ఓట్లు తాము ఎటుచెబితే అటు వేసేట్లు చూసుకుంటారు. కాబట్టి గ్రామీణ పెత్తందారీ శక్తులు, పాలక వర్గాలు కుల వివక్ష కొనసాగాలనే

క్రియాశీలత ఈ అంశానికి పరిమితమైనంత కాలం అగ్ర వర్ణాల దోపిడీకీ, రాజకీయ ఆధిపత్యానికీ ప్రమాదం ఏమీ ఉండదు. దళితుల్లో కొందర్ని చేరదీసి తమ ఏజెంట్లు గానో, మత ప్రచారకులుగానో, రాజకీయ అనుచరులుగానో తయారు చేసుకుని తమ ప్రాభవాన్ని కాపాడుకోవడం కోసం వారిని వాడుకుంటూ వుంటారు. ఈ విధంగా పాలక వర్గాలతో అంటకాగే వ్యక్తులు దళితుల మధ్యనే వుంటూ పాలకవర్గ పార్టీలకు ప్రమాదం రాకుండా కాపాడుతూ వుంటారు.

దళిత సంఘాలు కుల వివక్షకు వ్యతిరే కంగా పోరాడింది తక్కువ. సబ్ ప్లాన్ అమలు కోసం మాత్రం చురుకైన పాత్ర నిర్వహించాయి. అనేక మంది దళిత మేధావులు, బృందాలు, సబ్ ప్లాన్ అధ్యయనం కోసం అనేక సంవత్స రాలపాటు ఎంతో కృషి చేశారు. చైతన్యాన్ని కలిగించడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహిం చారు. పాలక పార్టీలలోని దళిత ప్రతినిధులు, రాష్ట్ర అధికార యంత్రాంగంలోని దళిత అధికారులు వారి వారి పద్ధతులలో ఒత్తిడి తెచ్చారు. ఈ సమస్యపై దళిత సంఘాలు పెద్ద ఎత్తున ప్రజా సమీకరణ చేయలేదు కానీ, ఆ సంఘాల నాయకులు మాత్రం ఆందోళనలో పాల్గొన్నారు. దళిత సబ్‌–ప్లాన్ అనే అంశం

పాలక వర్గాలకు చిరాకు పుట్టించే విషయం కాదు కాబట్టి ప్రభుత్వంలో వున్న దళిత ప్రతినిధులు సైతం చురుకైన పాత్ర పోషించారు. దీనికి విరుద్ధంగా పాలకవర్గ పార్టీలకు చెందిన దళిత ప్రతినిధులు కుల వివక్ష వ్యతిరేక పోరాటాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వారిలో కొందరు మేము మంచిపనే చేస్తున్నామని లోపాయికారీగా చెప్పారు. మరోవైపు, దళిత సంఘాల నాయకులు ఉద్యమాన్ని పైకి ప్రశంసించారు తప్ప ఉద్యమంలో పాల్గొనడానికీ, బలోపేతం చేయడానికీ ముందుకు రాలేదు.

ప్రభుత్వం చట్టం చేసింది తీవ్రమైన వత్తిడి ఫలితంగా. కాగా ఇతర పార్టీలు వ్యతిరేకిస్తున్నా నిలబడి తానే చొరవగా దళితుల కోసం చట్టం చేశానని డబ్బాకొట్టుకుంది. ముఖ్య మంత్రి తనకు తానే 'దళిత బంధువు'నని బిరుదునిచ్చుకున్నారు. 'ఇందిరమ్మ కలలు' పండిస్తున్నామని చెప్పుకోవడం మొదలైంది. ఇంత ఘనకార్యం చేసిన ముఖ్యమంత్రిని కీర్తించడంలో అధికార పార్టీ మంత్రులు, శాసన సభ్యులు పోటీపడ్డారు.

ప్రభుత్వంలో ఎవరున్నప్పటికీ ఇంత వరకూ కుల వివక్ష తొలగించే కర్తవ్యం పట్ల కనీసమైన ఆసక్తి చూపిన వారులేరు. ఈ సమస్యపై శాసన సభలో ప్రత్యేకమైన చర్చ జరపాలనే డిమాండును పట్టించుకోలేదు. యస్.సి, యస్.టి కమీషన్ ఛైర్మన్ పదవిని నాలుగేళ్ళుగా ఖాళీగా వుంచారు. రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందిన దళిత ప్రతినిధులు అంటరానితనాన్ని వ్యతిరేకించడంలో విఫలమయ్యారు. వారిపై గ్రామీణ పెత్తందారీ శక్తుల ప్రభావం పనిచేస్తున్నదని అర్థమవుతున్నది.

చట్ట సభలలో అస్పృశ్యత గురించీ, కుల వివక్ష గురించీ చర్చ జరగదు. ప్రస్తావన వుండదు. దళితుల సంక్షేమం కోసం ఇది చేశాం, అది చేశాం అని సొంత డబ్బా వాయించుకోవడం మాత్రం పాలక పార్టీలకు అలవాటుగా తయారైంది. మండల, జిల్లా పరిషత్తులలోనైతే ఈ మాత్రం కూడా కనపడదు. ఎందుకంటే అక్కడ గ్రామీణ పెత్తందారీ శక్తుల ప్రభావం మరింత తీవ్రంగా, ప్రత్యక్షంగా వుండటమే కారణం.

మొత్తం మీద రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి. బూర్జువా పార్టీలు ఎట్టకేలకు రిజర్వేషన్లు, సబ్-ప్లాన్ వంటి అంశాలపై రాజీకొస్తాయి. అవసరమైతే పూర్తిగా అంగీకరిస్తాయి కూడా. ఎందుకంటే తగాదా ఈ అంశాలకు పరిమితమైనంతకాలం వారి ఆధిపత్యానికీ, దోపిడీ వ్యవస్థకూ ఎలాంటి ముప్పూ వుండదు.

> **“ప్రభుత్వంలో ఎవరున్నప్పటికీ ఇంత వరకూ కుల వివక్ష తొలగించే కర్తవ్యం పట్ల కనీసమైన ఆసక్తి చూపిన వారులేరు. ఈ సమస్యపై శాసన సభలో ప్రత్యేకమైన చర్చ జరపాలనే డిమాండును పట్టించుకోలేదు. యస్.సి, యస్.టి కమీషన్ ఛైర్మన్ పదవిని నాలుగేళ్ళుగా ఖాళీగా వుంచారు. రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందిన దళిత ప్రతినిధులు అంటరానితనాన్ని వ్యతిరేకించడంలో విఫలమయ్యారు. వారిపై గ్రామీణ పెత్తందారీ శక్తుల ప్రభావం పనిచేస్తున్నదని అర్థమవుతున్నది.”**

ఉద్యమ నాయకులను చేరదీసి, తమ చెప్పుచేతలలో వుంచుకోవడం ద్వారా ఉద్యమం తమ ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్థాయికి చేరకుండా నివారించడమనేది వారికి వెన్నతో పెట్టిన విద్య. అయితే, కుల వివక్ష, అస్పృశ్యత లాంటి సమస్యలు ముందు కొచ్చినప్పుడు వారి వైఖరి కఠినంగా తయారవుతుంది. దుర్మార్గమైన అణచివేత వ్యవస్థను కాపాడుకోవాలనేది వారి దృఢ నిశ్చయం. పరిస్థితిని మార్చే ప్రయత్నాలను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దెబ్బ తీస్తూనే వుంటారు. గ్రామీణ పేదలపై తమ పట్టు సుస్థిరంగా వుండాలంటే కుల వివక్ష కొనసాగాల్సిందేనని వారికి తెలుసు.

దళితుల కోసం పనిచేస్తున్న సంఘాల కార్యకలాపాలను పరిశీలిస్తే, అనుభవాలు స్పష్టంగా చెబుతున్నాయి – వారి కార్యాచరణలో వున్న బలహీనతలు సానుకూల ఫలితాలు రాకుండా అడ్డు పడుతున్నాయని.

ఈ సందర్భంగా ప్రధానమైన బలహీనతలు ఆరింటిని గుర్తించాము.

**1. దళిత, ప్రజా సమూహాలను వారి హక్కుల సాధనకై సమీకరించడంలో వైఫల్యం:**

అనేక సంఘాలు, సంస్థలు, వ్యక్తులు కుల వ్యవస్థకు వ్యతిరేకంగానూ, దళితులు ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసమూ పని చేస్తున్న మాట నిజమే కాని వారు చాలా వరకు ప్రత్యేక సంఘటనల పట్ల ప్రతి స్పందించడానికే పరిమితమై పోయారు. దళితులు తమ హక్కుల కోసం నిలబడేలా నిత్యం తామెదుర్కొంటున్న వివక్షపై తిరగబడేలా చేయడానికి అవసరమైన నిరంతర ప్రచార ఉద్యమం ఈ సంఘాలు, నాయకులు చేపట్టడం లేదు.

**2. ఆచరణ కొంచెం, ఆర్భాటం హెచ్చు:**

కుల సమస్య గురించి అంతులేని చర్చలు, వాదనలు సాగుతూ ఉన్నాయి. హిందూ మతాన్ని తిరస్కరించకుండా కుల వ్యవస్థనెలా అంతమొందిస్తాం అనేదొక ప్రశ్న. వర్గాలు పోకుండా కులాలు పోతాయా అన్నది మరో ప్రశ్న. అసలు కుల వ్యవస్థను మూలాల్తో పెకలించకుండా కుల వివక్షను, అస్పృశ్యతను తొలగించగలమా? ఇది ఇంకో ప్రశ్న. ఈ విధంగా చర్చలు మొదలవడం, పరస్పర దూషణలకూ, నిందారోపణలకూ దిగడం పరిపాటి అయింది. సమస్యలను అర్థం చేసుకోవడానికి సిద్ధాంత పరమైన చర్చలు, వాదనలూ అవసరమే. అయితే వాదోపవాదాలకే పరిమితమై పోతే సరిపోతుందా? వాదాల ద్వారా పరిష్కారం కాని సమస్యలను ఆచరణ ద్వారా పరిష్కరించుకొనే అవకాశం ఉంది. చెప్పేదేమిటి, చేసేదేమిటి అనేదాన్ని బట్టి ఏ సంఘం విలువ ఎంతో తెలుసుకోవచ్చు.

**3. అంటరానితనాన్ని తొలగించే విషయంలో విశ్వాసం లేకపోవటం:**

కొందరు వ్యక్తులు అసలు కులమనేది పోతేగాని అస్పృశ్యత, కుల వివక్ష పోదని నిరాశ వ్యక్తం చేస్తుంటారు. ఇది సరైన ఆలోచన కాదు. నిరంతరమైన, సంయుక్త పోరాటం ద్వారా అస్పృశ్యతను, కుల వివక్షను అంతమొందించడం సాధ్యమే.

**4. అనైక్యత:**

వివిధ కుల సంఘాల, అస్థిత్వ సంఘాల ధోరణి ఐక్యత వైపు కాకుండా చీలికలు, పేలికలు చేసే పద్ధతిలో ఉంది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుంది పరిస్థితి. సామాజిక న్యాయం సాధించే కర్తవ్యానికి ఈ పరిస్థితి పెద్ద అవరోధంగా ఉన్నది. కారంచేడు, చుండూరు వంటి దుర్ఘటనల సందర్భాలలో ఒక మాదిరి ఐక్యత కనిపించినా అది వెంటనే మాయమైపోతున్నది. అందరూ ఎదుర్కొనే సాధారణ సమస్యను మరచి అంతర్గత విభేదాలను ముందుకు తెస్తున్నారు. విశాల ఐక్యత కోసం ప్రయత్నించడమే లేదు. ఐక్యత సాధించడానికి ఉత్ప్రేరకాలుగా పని చేసే సంఘాల ఆవశ్యకత నేడు ఎంతగానో ఉంది.

**5. వేలాడుతున్న ఒంటెత్తు ధోరణులు:**


దళితులు కాని వారికి దళితుల

(మిగతా 18వ పేజీలో)

**శత జయంతి సంవత్సర ప్రత్యేకం**

# పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం అనివార్యం

**కీ॥శే॥ మాకినేని బసవపున్నయ్య**



రచయిత భారత కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు, సిపిఐ(ఎం) వ్యవస్థాపకుల్లో ఒకరు

**1992 జనవరి 3 నుంచి 9 వరకు మద్రాసులో జరిగిన సిపిఐ(ఎం) అఖిల భారత మహాసభలో మాకినేని బసవపున్నయ్య చేసిన ప్రారంభోపన్యాసమిది. సోవియట్ విచ్ఛిన్నం, సోషలిస్టు వ్యవస్థ పతనం నేపథ్యంలో ఆయన చేసిన ప్రసంగం కమ్యూనిస్టు వ్యతిరేక తుపానులో ఎర్రజెండా చేతపట్టుకుని నిలబడిన కార్యకర్తలకు ఎంతో ఉత్సాహాన్నీ, నమ్మకాన్నీ ఇచ్చింది. సోషలిజం మినహా ప్రపంచానికి మరో మార్గం లేదని నాడు ఆయన చెప్పింది అక్షర సత్యమని నేటి ప్రపంచ పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. కామ్రేడ్ బసవపున్నయ్య శతజయంతి సంవత్సరం సందర్భంగా ఈ వ్యాసం:**

పార్టీ 14వ మహాసభ నిర్వహణ సందర్భంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించవలసిందిగా కేంద్రకమిటీ నన్ను కోరింది. ఏడు దశాబ్దాలకు పైగా పూర్వపు సోవియట్ యూనియన్‌లో సమున్నతంగా నిలిచి ఎగిరిన అరుణ కేతనం అవనతమైన సమయంలో ఈ అవకాశం నాకు లభించడం మహోన్నతమైన గౌరవంగా నేను భావిస్తున్నాను. ఇతరచోట్ల జరిగినదేమైనప్పటికీ భారతదేశంలోని మేము, కార్మిక రైతాంగపు జెండాగా, అన్ని రకాలైన అణచివేతల నుండీ, దోపిడీల నుండి మానవ జాతిని విముక్తి చేసే జెండాగా, ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికి మార్గదర్శియైన జెండాగా యీ అరుణ పతాకను సమున్నతంగా నిలిపి వుంచుతాము. గత 70 ఏళ్ళు అంతకు ముందు నుంచి అసంఖ్యాకులైన కమ్యూనిస్టు అమరవీరుల రుధిరంతో ఎరుపెక్కిన యీ అరుణ పతాకకు వందనాలర్పించుదాం.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తన 14వ మహాసభను జరుపుకొంటున్నది. అఖిల భారత కమ్యూనిస్టు మహాసభ తమిళనాడులో జరగడం యిది మూడవసారి. అప్పటిలో భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటిగానే వున్నది. 1953లో మూడవ మహాసభ మధురైలో జరిగింది. ఇక్కడే 1972లో తొమ్మిదవ మహాసభ జరిగింది. మరలా 1992 జనవరి 3 నుంచి 9 వరకు మద్రాసులో జరిగే 14వ మహాసభకు కూడా తమిళనాడు ఆతిథ్యమిస్తున్నది. 1953లో మధురై మహాసభ గడిచిన తరువాత దాదాపు నాలుగున్నర దశాబ్దాల కాలం గడిచింది. ఇవి ప్రపంచంలో చారిత్రాత్మక మార్పులు జరిగిన దశాబ్దాలు. ప్రస్తుతం మనం 20వ శతాబ్దపు ఆఖరి దశాబ్దంలో వున్నాము. ప్రపంచ చరిత్రలో అత్యంత కీలకమైన సమయంలో యీ దశాబ్దిలోకి మనం ప్రవేశించాము. పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకులూ, విప్లవ ప్రతీఘాతకులూ ఒక్క పెట్టున అరుస్తూ "కమ్యూనిజం మృతి చెందింది, అది సమసిపోయింది. సమాధి కట్టండి" అంటూ కేకలు వేస్తున్నారు. కమ్యూనిస్టు "మరణ సందేశాన్ని" ప్రచారం చేసేటందుకై బూర్జువా పత్రికలలోని కలం వీరులు వందల కొలది కాలమ్స్‌నూ, పుటలను నింపుతున్నారు.

తూర్పు ఐరోపాలోని దేశాలలో కమ్యూనిస్టుల నేతృత్వంలోని ప్రభుత్వాలు కుప్పకూలిపోవడం, కొన్ని కమ్యూనిస్టు పార్టీలు తమ పేరును విడిచిపెట్టి అవమానకరమైన సోషల్ డెమొక్రసీ పేరును స్వీకరించడం, సోవియట్ యూనియన్‌లోని 70 ఏళ్ళ సోషలిస్టు సమాజంలో సామాజిక, ఆర్థిక సంక్షోభం తలెత్తి, విచ్ఛిన్నం సంభవించడం, తుదకు స్వతంత్ర సార్వభౌమత్వ దేశాల సమాఖ్యగా రూపొందడం యివన్నీ సోషలిజం, కమ్యూనిజంల అభివృద్ధికి తీవ్ర విఘాతాన్ని కల్పించాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఒడిదుడుకులనూ, తిరోగమనాలనూ, ఓటములనూ ఎదుర్కొనడం మా హృదయంలో విచారాన్ని కల్గించిందనటంలో సందేహం లేదు. అయితే యిదే సమయంలో కరుడు గట్టిన తిరోగమన వాదులూ, విప్లవ ప్రతీఘాతకత్వాన్ని ఒంటబట్టించుకొన్నవారూ ఆనందంతో పొంగిపోతున్నారు. గత మూడేళ్ళ కాలంలో సంభవించిన యీ దురదృష్టకర ప్రపంచ పరిణామాలను ఎప్పటికప్పుడు సిపిఎం కేంద్రకమిటీ చర్చించింది. ఈ చర్చల సారాంశాన్ని చర్చల కోసం, సవరణల కోసం, ఆమోదం కోసం పార్టీ ప్రతినిధుల సభకు సమర్పించే తీర్మానాలలోనూ, డాక్యుమెంట్లలోనూ ప్రస్తావించడం జరిగింది.

కేంద్ర కమిటీకి చెందిన ఈ డాక్యుమెంట్లలోని సారాంశం ఏమిటి? ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో విభేదాలు, విభజనలు గత మూడు నాలుగేళ్ళుగా మాత్రమే కన్పిస్తున్న నూతన దృశ్యం కాదు. 1957కు ముందే తీవ్రమైన విభేదాలు పొడచూపాయి. 1957 నవంబర్‌లో మొట్టమొదట ప్రపంచ కమ్యూనిస్టు సమావేశం జరిగింది. అరవై కమ్యూనిస్టు, కార్మిక పార్టీలు దీనిలో పాల్గొన్నాయి. విభేదాలు పరిష్కారం కాలేదు. దీనిలో 1960 జూన్‌లో రుమేనియా పార్టీ మూడవ మహాసభ సందర్భంగా ప్రపంచ పార్టీలు రెండవసారి సమావేశమయ్యాయి. విభేదాలు అలాగే వుండిపోయాయి. దాంతో మరలా 1960 నవంబర్-డిసెంబర్ నెలలో మూడవ సారి సమావేశం జరిగింది. దీనికి 81కి పైగా పార్టీలు హాజరయ్యాయి.

పైన పేర్కొన్న ప్రపంచ కమ్యూనిస్టు సమావేశాలతోపాటు ప్రాంతీయ లేదా ఖండాల ప్రాతిపదికపై అనేకమైన సమావేశాలు జరిగాయి.

ఈ సమావేశాలూ, చర్చలూ, నిర్ణయాలూ, సమస్యలను పరిష్కరించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ఐక్యతను పునరుద్ధరించాయా? లేదు. తద్విరుద్ధంగా యీ విభేదాలు నిలువునా చీలటానికి దారితీశాయి. ఇవి అతి పెద్ద సోషలిస్టు దేశాలైన చైనా–సోవియట్‌లను కూడా విడదీశాయి. సోవియట్–చైనా సరిహద్దుల్లో లక్షమంది సాయుధులు పరస్పరాభిముఖంగా నిలిచారు. ఈ దురదృష్టకరమైన వివాదాలు భారత్–చైనా సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని వేశాయి.

ఈ రెండు దురదృష్టకరమైన విభజనలు ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు జనాభాగా వున్న రెండు పెద్ద దేశాల భవితవ్యాన్ని ప్రభావితం చేయడమే గాక కమ్యూనిస్టుల, వారి వెన్నంటి వుండే ప్రజల పురోగమనాన్ని అడ్డుకొని ప్రపంచ సామ్రాజ్యవాదులకు ప్రత్యేకించి అమెరికాకు సహాయపడ్డాయి. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. అంతేగానీ గత 50 సంవత్సరాల చరిత్రలో జరిగిన ప్రపంచ పరిణామాల వాస్తవ చిత్రం మాత్రం కాదు. 1941–45 మధ్యకాలంలో జర్మనీ, జపాన్, ఇటలీలకు చెందిన ఫాసిస్టు మూకలను పరాజితులను చేసి ఓడించిన ఘనత కమ్యూనిస్టులదే. లక్షలాది ప్రజల ప్రాణాలనూ, కోట్ల రూపాయల పారిశ్రామిక సంపదనూ కోల్పోవలసి వచ్చింది. ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో అమెరికా సామ్రాజ్యవాదులను ఓడించింది సోవియట్, చైనా కమ్యూనిస్టు రాజ్యాలూ, వాటి సైనిక శక్తియే. అదేవిధంగా వియత్నాం జాతీయ విముక్తి సాధనకూ, ఆ దేశం సోషలిస్టు అభివృద్ధి దశలోకి వెళ్ళడానికీ తోడ్పడింది.

గత 45 సంవత్సరాలుగా మహత్తరమైన అమెరికా అణుశక్తిని అడ్డుకొని, మూడవ ప్రపంచ యుద్ధం జరగకుండా నిరోధించింది సోవియట్ యూనియన్, జన చైనా. అలానే శాంతి, ప్రజాస్వామ్యం, సోషలిజంలకు అండగా నిలబడిన శక్తులు కమ్యూనిస్టు కాక వేరెవ్వరున్నారు? పైన తెలిపినవన్నీ 20వ శతాబ్దంలో కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన చారిత్రక విజయాల స్థూల చిత్రం మాత్రమే. కమ్యూనిజమూ, మార్క్సిస్టు ఆలోచనా విధానమూ సాధించిన ఈ చారిత్రాత్మక విజయాలు కమ్యూనిస్టు వ్యతిరేక పండితులు ఉద్దేశపూర్వకంగా విస్మరించడమో లేక మరచిపోయినట్లు నటించడమో చేస్తూ, కమ్యూనిజం మృతి చెందిందని పొద్దస్తమానం కేకలు పెడుతున్నారు.

> **❝ మన దేశంలోనూ, నూతనంగా విముక్తిపొందిన అనేక యితర దేశాలలోనూ చోటు చేసుకుంటున్న ఆర్థిక సంక్షోభాలు, యితర సంక్షోభాలు పెట్టుబడిదారీ సాధారణ సంక్షోభానికీ, దాని పతనానికీ ప్రతిరూపం. ఈ సాధారణ సంక్షోభాన్ని అధిగమించే ఆశగానీ, అవకాశంగానీ లేదు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని పరిరక్షించి, సంక్షోభ రహిత పెట్టుబడిదారీ విధానంగా పునరుద్ధరించడానికి సామ్రాజ్యవాదులు ఏమి చేసినప్పటికీ ఫలితం వుండదు. ❞**

ప్రపంచ గుత్త పెట్టుబడిదారీ విధానమూ, సామ్రాజ్యవాదమూ, పెట్టుబడిదారీ విధానం యొక్క అంత్య దశలు. కుళ్ళి కంపుగొడుతున్న పెట్టుబడిదారీ విధానం తన ఆత్మ రక్షణకోసం ప్రధానంగా, సామూహిక వినాశనానికి దారితీసే అణు తదితర భయంకరమైన ఆయుధాలను తయారుచేసే పరిశ్రమలపై ఆధారపడుతుందని దశాబ్దాల క్రితమే మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అభివృద్ధి చేసిన మహనీయుడు లెనిన్ వర్ణించాడు. గుత్త పెట్టుబడిదారీ విధానమూ, సామ్రాజ్యవాదమూ అనేవి పెట్టుబడిదారీ విధానం యొక్క సాధారణ సంక్షోభానికి చెందిన దశ. సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధాలకు చెందిన దశ. ప్రపంచంలోని వలసలను, అర్ధ వలసలను కబళించడం కోసం చేసే యుద్ధాల దశ. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో తక్కువగా నష్టపోయి ఎక్కువగా ప్రయోజనం పొందిన అమెరికన్ సామ్రాజ్యవాదం ఒక నూతన శకాన్ని, అమెరికా శకాన్ని స్థాపించడానికి ప్రయత్నించింది. అయితే యీ పగటి కలలు వాస్తవం కాజాలవు. దీనిని అడ్డుకొనేందుకూ, ఓడించేటందుకూ ప్రపంచంలో కొన్ని శక్తులు తలెత్తి ఏదో ఒక బలమైన దేశం ఆజ్ఞలను అనుమతించని, న్యాయబద్ధమైన నూతన సామాజిక క్రమంతో కూడిన నూతన శకాన్ని ప్రారంభించాయి.

పెట్టుబడిదారీ విధానం యొక్క సాధారణ సంక్షోభం కొనసాగుతున్నది. అనేక సామ్రాజ్యవాద దేశాలలో కొనసాగుతున్న ఆర్థిక మాంద్యం, గతంలో వలే నిర్ణీత కాలానికి వచ్చి, అదృశ్యమయ్యే ఆర్థిక మాంద్యం వంటిది కాదు. ఈ ఆర్థిక మాంద్యం పెట్టుబడిదారీ విధానపు సాధారణ సంక్షోభపు మరో దశ, తీవ్ర దశ. 'కమ్యూనిజం అదృశ్యం' అయిందంటూ చిందులు వేసే బూర్జువా మేధావులు పెట్టుబడిదారీ విధానం యొక్క పతనాన్నీ, అదృశ్యమవుతున్న విలువల్నీ చూడాల్సి వస్తుంది. మన దేశంలోనూ, నూతనంగా విముక్తిపొందిన అనేక యితర దేశాలలోనూ చోటు చేసుకుంటున్న ఆర్థిక సంక్షోభాలు, యితర సంక్షోభాలు పెట్టుబడిదారీ సాధారణ సంక్షోభానికీ, దాని పతనానికీ ప్రతిరూపం. ఈ సాధారణ సంక్షోభాన్ని అధిగమించే ఆశగానీ, అవకాశంగానీ లేదు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని పరిరక్షించి, సంక్షోభ రహిత పెట్టుబడిదారీ విధానంగా పునరుద్ధరించడానికి సామ్రాజ్యవాదులు ఏమి చేసినప్పటికీ ఫలితం వుండదు.

తూర్పు ఐరోపాలో యిటీవల సంభవించిన తిరోగమనం గానీ, లేదా గత సోవియట్ యూనియన్ లేదా ప్రస్తుత స్వతంత్ర రిపబ్లిక్‌లతో కూడిన సమాఖ్యలోనూ సంభవిస్తున్న తీవ్ర ఘటనలు గాని మార్క్సిస్టు సిద్ధాంతంలోనూ, కమ్యూనిజం పరిరక్షణలోనూ సిపిఎంకు గత విశ్వాసాన్ని సడలించలేవు.

గత 40, 45 సంవత్సరాల కాలంలో వలెనే ప్రపంచ బలా బలాల వర్గ అంచనాపై ఆలోచన యిప్పటికీ విలువను కలిగి వున్నది. ప్రపంచంలో ప్రధాన మైన నాలుగు వైరుధ్యాలున్నాయనే సిపిఎం అంచనా యిప్పటికీ విలువను కలిగి వున్నది. దీనిని మార్చుకోవలసిన అవసరం లేదు.

చివరగా చెప్పేదేమిటంటే మార్క్సిస్టు సిద్ధాంతానికి సిపిఎం ఇప్పటికీ కట్టుబడి వున్నది. శాంతి, ప్రజాస్వామ్యం, జాతీయ విముక్తి, సోషలిస్టు శక్తులకు సామ్రాజ్యవాదం, విప్లవ ప్రతీఘాతకులకు మధ్య వున్న వైరుధ్యం ప్రపంచ సామాజిక, వర్గ వైరుధ్యాలలో ప్రధానమైనదిగా వున్నది. ఈ అవగాహనే జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలలో తన వంతు పాత్రను నిర్వహించడానికీ, ప్రజల యొక్క పరిణతి చెందిన వారు అలాగే పురోగమ మేధావుల యొక్క విశ్వాసాన్ని అంతకంతకూ పొందడానికి సిపిఎంకు తోడ్పడింది. ●

**సిద్ధాంతం**

# అస్థిత్వ ఉద్యమాలు మార్క్సిస్టు అవగాహన



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, సిఐటియు నాయకులు.

**ఎస్. వీరయ్య**

గత కొంత కాలంగా అస్థిత్వ ఉద్యమాలు విస్తరించాయి. కారణమేమిటి?

ఎవరి ప్రయోజనాల కోసం ఈ అస్థిత్వ రాజకీయాలు?

“అభివృద్ధిలోవాటా”, “అధికారంలోవాటా” నినాదాలకు మూలమేమిటి?

బడుగు బలహీనవర్గాలవారెవరైనా అవినీతికి పాల్పడితే ప్రశ్నించకూడదా?

ఇలాంటివే అనేక ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. వామపక్ష, అభ్యుదయ ఉద్యమకారులందరు ఈ విషయాలను లోతుగా పరిశీలించటం అవసరమే.

**అస్థిత్వ రాజకీయాల నేపథ్యం ఏమిటి?**

ఒకే తరగతి లేదా ఒకే వర్గంలోని భేదాలు లేదా వైరుధ్యాల ప్రాతిపదికగా అస్థిత్వవాద ఉద్యమాలు తలెత్తుతున్నాయి. కులం, మతం, రంగు, ప్రాంతం, లింగభేదం తదితర భేదాల ఆధారంగానే ఈ ఉద్యమాలు వస్తున్నాయి. వర్గ ఐక్యతను వ్యతిరేకిస్తున్నాయి. సంఘీభావ ఉద్యమాన్ని బలహీనపరుస్తున్నాయి. అణచివేతకూ, వివక్షకూ గురైన తరగతుల పోరాట శక్తిని బలహీనపరుస్తున్నాయి. ఈ తరగతులకు చెందిన ప్రజలను ఒంటరిపాటు చేస్తున్నాయి.

గత మూడు, నాలుగు దశాబ్దాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్న దశలో అస్థిత్వవాదం ముందుకొచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి, మధ్యతరగతిలో కొన్ని భ్రమలకు దారితీసింది. అభివృద్ధి ఉన్నది కాబట్టి పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చుననీ, చిన్న చిన్న ఆటంకాలుంటే తొలగించుకోవచ్చనే ఆశలు చెలరేగాయి. కులవివక్ష, పురుషాధిక్యత, వర్ణ వివక్ష, గిరిజన సమస్య, సామాజిక వెనుకబాటు తనం వంటి సమస్యలు పరిష్కరించుకోవచ్చుననే ఆలోచనలు ముందుకొచ్చాయి. మన దేశంలోనూ అదే జరిగింది. కానీ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్న దశలో వచ్చిన భ్రమలు, సంక్షోభ కాలంలో నిలుస్తాయనుకోలేము. పెట్టుబడిదారీ విధానం ఉనికికే ప్రమాదం ఏర్పడినపుడు అస్థిత్వవాదాలకు ఆకర్షణ వుండకపోవచ్చు. వాటిని అధిగమించి విశ్వజనీనమైన భావాల వైపు మళ్లుతారు.

సోవియట్ పతనానంతర పరిణామాల ప్రభావం కూడా ఇందుకు తోడైంది. ఏడు దశాబ్దాల సోషలిస్టు వ్యవస్థ కుప్పకూలడంతో సోషలిజం భవిష్యత్ మీద విశ్వాసం సడలింది. తిరుగుబాటు కన్నా సర్దుబాటు మేలన్న ధోరణులు బలపడ్డాయి. ముఖ్యంగా చదువుకున్న మధ్య తరగతి, మేధావుల మీద ఈ ప్రభావాలు ఎక్కువగా విస్తరించాయి. “ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయం లేదు” అన్న ప్రచారం తీవ్ర ప్రభావమే చూపింది.

సోషలిజానికి ఎదురుదెబ్బ తగలటం, పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి, ఈ రెండూ కలసి అస్థిత్వవాదానికి ఊతమిచ్చాయి. కులం, మతం, తెగ, రంగు, లింగం, ప్రాంతం తదితర అస్థిత్వవాదాలు ఆచరణ రూపాలైతే, వాటి తాత్విక రూపమే ఆధునికానంతర వాదం. సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, మానవత్వం వంటి సార్వజనీన అంశాలను ఇది తిరస్కరిస్తుంది. విశ్వజనీన సూత్రాలకు, సాధారణాంశాలకు విలువ లేదంటుంది. ముక్కలుగా, విడివిడిగా చూడడమే తప్పు, కలిపి చూడటం అర్థం లేనిదంటుంది. దేనికది ప్రత్యేకతలుగా చూడటమే తప్ప అన్నీ కలిపి పరిశీలిస్తే అర్థమయ్యే శాస్త్రీయ, సాధారణాంశాలేమీ వుండవంటుంది.

అందుకే ఆచరణలో దళితుల సమస్యలుగా, గిరిజనుల సమస్యలుగా, వెనుకబడిన తరగతుల సమస్యలుగా, మహిళల సమస్యలుగానే తప్ప, అణగారిన వర్గాల సమస్యలుగా చూడ నిరాకరిస్తుంది. దీని వల్ల సమస్యను లేవనెత్తడమే తప్ప పరిష్కారం దొరకదన్న వాస్తవం మరుగున పడిపోతున్నది. పైగా ఈ సమస్యల వెనుకనున్న వర్గ ప్రయోజనాన్ని చూడడానికి నిరాకరిస్తుంది.

**దోపిడీ వ్యవస్థ పట్ల అస్థిత్వవాదుల వైఖరి ఏమిటి?**

అస్థిత్వవాద ఉద్యమాలు ఆయా తరగతుల ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలకు దారి తీస్తున్నాయి. సామాజిక అసమానతలు, అణచివేతకు, వివక్షకు సంబంధించిన సమస్యలను అవి లేవనెత్తటమే ఇందుకు కారణం. సమస్యలు లేవనెత్తటం, అణచివేతను ప్రశ్నించటమే తప్ప ఈ విధానాలను పెంచిపోషిస్తున్న పెట్టుబడిదారీ దోపిడీని, వ్యవస్థను అస్థిత్వవాదులు ప్రశ్నించరు. ఈ వ్యవస్థ మార్పు కోసం ఉద్యమించ నిరాకరిస్తారు. పెట్టుబడిదారీ విధానం పరిధిలోనే పరిష్కారం వెతకటమే ఇందుకు కారణం. అందుకే పెట్టుబడిదారీ వర్గం కూడా ఈ ఉద్యమాలను సహిస్తుంది. అప్పుడప్పుడు ఈ ఉ

ద్యమాల పట్ల కొంత అసహనం వ్యక్తం చేసినా, అంతిమంగా సర్దుబాటు చేసుకుంటుంది. అస్థిత్వ వాదులు లేవనెత్తే రిజర్వేషన్, రిప్రజెంటేషన్, రికగ్నిషన్ వంటి అంశాలు పెట్టుబడిదారులకు ప్రమాదం లేనివి. ఈ విషయాలలో సర్దుబాటు వల్ల వారి లాభం కొంత తగ్గవచ్చు తప్ప పెట్టుబడిదారీ దోపిడీ విధానానికి మాత్రం ప్రమాదమేమీ లేదు. పైగా ఈ సర్దుబాటు ద్వారా కూడా పెట్టుబడిదారీ వర్గం మరో విధంగా లాభపడుతుంది. కొన్ని తరగతులకే ప్రాతినిధ్యం వహించేది కాదనీ, పెట్టుబడిదారీ వర్గంలో అన్ని తరగతులకూ ప్రాతినిధ్యం వున్నదని చూపగల విధంగా తన పునాదిని విస్తరించుకుంటుంది. స్థూలంగా అస్థిత్వవాదం పెట్టుబడిదారీ విధానాన్ని మెరుగుపరచాలనే తప్ప, మార్చాలని కోరదు. అందుకే పెట్టుబడిదారీ వర్గం ఈ ాద్యమాల పట్ల ప్రతికూలంగా స్పందించదు.

‘భారతదేశ ఆధునిక అనంతరవాద ఆలోచనలు అనేక రూపాలు తీసుకుంటున్నాయి. ఇవన్నీ నూతన సరళీకరణ విధానాలకూ, ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడికీ ఉపయోగపడే ప్రాథమిక సిద్ధాంతాలుగానే ఉండటం గమనార్హం. కనుక అన్ని రకాల ఆధునికానంతర వాదాల ముఖ్య లక్షణాన్నీ పరిశీలించాలి. ఈ సిద్ధాంతం రాజ్యం, రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, కుల అణచివేత, పర్యావరణం క్షీణించటం వంటి అనేక అంశాలను వ్యతిరేకించవచ్చు. కానీ మార్కెట్ శక్తులను మాత్రం వ్యతిరేకించదు. తీవ్రమైన రాజ్య వ్యతిరేకతతో కూడుకున్న ఈ అన్ని రకాల ఆధునిక అనంతరవాద సిద్ధాంతాలలో కనిపించే తార్కిక అర్థం ఏమిటంటే, రాజ్యంయొక్క జోక్యం లేకుండా, ఏ విధమై ఆంక్షలు లేని మార్కెట్ శక్తులు, పూర్తిగా ప్రైవేటీకరించబడిన ఆర్థిక వ్యవస్థలు సమాజంలో ముఖ్యమైన శక్తులుగా వుండాలనేదే. ప్రపంచ బహుళజాతి పెట్టుబడిదారీ శక్తులు సరిగ్గా దీనినే కోరుకుంటున్నాయి’. – ఐజాజ్ అహ్మద్

> **“‘భారతదేశ ఆధునిక అనంతరవాద ఆలోచనలు అనేక రూపాలు తీసుకుంటున్నాయి. ఇవన్నీ నూతన సరళీకరణ విధానాలకూ, ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడికీ ఉపయోగపడే ప్రాథమిక సిద్ధాంతాలుగానే ఉండటం గమనార్హం. ఈ సిద్ధాంతం రాజ్యం, రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, కుల అణచివేత, పర్యావరణం క్షీణించటం వంటి అనేక అంశాలను వ్యతిరేకించవచ్చు. కానీ మార్కెట్ శక్తులను మాత్రం వ్యతిరేకించదు.”**

### ఎవరి కోసం ఈ అస్థిత్వ రాజకీయాలు?

కుల వివక్ష వ్యతిరేకత, కుల నిర్మూలనకు బదులు “దళిత బూర్జువా” నినాదాన్ని ముందుకు తెస్తున్నారు. సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడే బదులు వాటినే ఉపయోగించుకోవాలంటున్నారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం పేరుతో కొల్లగొడుతున్న సంపదలో వాటా కోరాలంటున్నారు. ఈ సిద్ధాంతం ప్రాతిపదికగానే ఒక దశాబ్దం క్రితం మధ్యప్రదేశ్‌లో జాతీయ స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సు ఆమోదించిన తీర్మానం భోపాల్ డిక్లరేషన్‌గా పిలుస్తున్నారు. ఈ సదస్సుకు సహకరించింది దిగ్విజయ్‌సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కాగా, ఈ సిద్ధాంతం ప్రాతిపదికగా ఏర్పడిన దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధినేత మిళింద్ కాంబ్లే పూర్వాశ్రమంలో బిజెపి నాయకుడు కావడం యాధృచ్ఛికం కాదు. రాజకీయ రంగంలో అధికారం కోసం పోట్లాడుకుంటున్న ఈ రెండు పార్టీలు పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను కాపాడటంలో, అస్థిత్వ ఉద్యమాలను ప్రోత్సహించడంలో ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి.

ఈ ఆలోచన కూడా కాంగ్రెస్ లేదా బిజెపి నాయకులకో లేదా ఈ దేశ పెట్టుబడిదారుల బుర్రల్లోనో పుట్టిందికాదు. ప్రపంచీకరణ సిద్ధాంతాన్ని అరువు తెచ్చుకున్నట్టే దళిత బూర్జువా సిద్ధాంతం కూడా అమెరికా పెట్టుబడిదారుల నుండి తెచ్చుకున్నదే. 60వ దశకం చివర 70వ దశకం ఆరంభంలో శ్వేత జాతి వివక్షకు వ్యతిరేకంగా తిరగబడుతున్న నల్లజాతి ప్రజల ఉద్యమాలను పక్కదారులు పట్టించేందుకు నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ ప్రయోగించిన ఆయుధమిదే. 1968లో చేసిన ఒక ఉపన్యాసంలో నల్లజాతి మిలిటెంట్లు కోరుకుంటున్నది వేరుపడటంకాదనీ, అణిగిమణిగి ఉంటూ అడుక్కునేవారుగా కాక యజమానులుగానూ, పారిశ్రామికవేత్తలుగానూ సంపదలో వాటాకోరుతున్నారన్నాడు. నల్లజాతీయులకు పూర్తిస్థాయిలో వ్యాపార అవకాశాలు పెంచాలనీ, ఆటంకాలన్నీ తొలగించాలనీ 1972లో మాక్స్‌వెల్‌కు రాసిన లేఖలో తెలిపారు. నాలుగు దశాబ్దాల అనంతరం ప్రస్తుత సంక్షోభ ఫలితంగా ఉపాధి సమస్య శ్వేత జాతీయులకన్నా నల్లజాతీయుల్లోనే ఎక్కువగా ఉన్నదని అమెరికన్ బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ తెలుపుతున్నది. శ్వేతజాతీయులలో నిరుద్యోగసమస్య 3.9శాతం నుండి 9 శాతానికి పెరగగా, నల్లజాతీయులలో 7.7శాతం నుండి 16.5శాతానికి పెరిగిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది.

మనదేశంలో ఈ సిద్ధాంతం చెబుతున్న వారు కూడా వారి అభిప్రాయాలనేమీ దాచుకోలేదు. మధ్యప్రదేశ్ నమూనా రాజకీయ ప్రజాస్వామ్యాన్ని పెట్టుబడికి కూడా విస్తరిస్తుందట! ఇది సామాజిక నిర్మాణంలోకి చొచ్చుకుపోవడం ద్వారా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ విస్తరణకు మార్గం సుగమం చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్‌సింగ్ అన్నారు. స్పష్టమైన ప్రయోజనాన్ని ఆశించే తాను దళిత బూర్జువా సిద్ధాంతం ప్రతిపాదిస్తున్నానని చంద్రభాన్ ప్రసాద్ చెప్పారు. 1990వ దశకం తరువాత భారత ఆర్థిక వ్యవస్థ అంటే డబ్బు సంపాదించడమేనని గుర్తించాన్నారు. అందుకే దళిత పెట్టుబడిదారీ విధానం ప్రతిపాదించానన్నారు. ప్రపంచీకరణను దళితులు ప్రమాదకారిగా చూడవద్దనీ, దానినొక అవకాశంగా తీసుకోవాలన్నారు. దళితుల నుండి కొంత మంది బూర్జువాలను సృష్టించనంతకాలం దళితుల విముక్తి కోసం సాగే ఉద్యమం అసంపూర్ణంగానే ఉంటుందన్నారు. ప్రభుత్వ రంగం ఉచ్ఛదశలో ఉన్న కాలంలో కూడా 2 కోట్లకు మించి ఉపాధి కల్పించలేకపోయిందనీ, అందునా దళితులు, గిరిజనులకు 45 లక్షలకు మించి కల్పించలేకపోయిందన్నారు. సంఘటిత ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు జరిపినా ఇంతకన్నా ఉపాధి అవకాశాలు మెరుగయ్యేదేమీ లేదన్నారు. మరోవైపు వీరే దేశంలో కొద్దిమంది దళితులు శతకోటీశ్వరులుగానూ, కొన్ని వందల మంది కోటీశ్వరులుగానూ, కొన్ని వేల మంది లక్షాధికారులుగానూ మారాలంటున్నారు. ఇది పెట్టుబడిదారీ విధానాన్ని ప్రజాస్వామీకరిస్తుందంటున్నారు. అంతేతప్ప దీని వల్ల దళితులకూ, గిరిజనులందరికీ సంఘటిత రంగంలో ఉపాధి లభిస్తుందని మాత్రం చెప్పలేకపోతున్నారు.

నిజానికి ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకు పెట్టుబడి దారులు సిద్ధంగాలేరు. అస్థిత్వవాదులు

**"అస్థిత్వవాదులు న్యాయమైన అనేక సమస్యలు లేవనెత్తు తుంటారు. కులవివక్షగానీ, సామాజిక తరగతుల వెనుకబాటు తనం గానీ, మహిళల అసమానత సమస్యగానీ, ప్రాంతీయ అసమానతలు గానీ సమాజాన్ని పీడిస్తున్న తీవ్ర సమస్యలే. కానీ ఈ సమస్యల పరిష్కారానికి మార్గంగా చూపుతున్న అస్థిత్వ వాద సిద్ధాంతాలు మాత్రం ఆచరణలో ఈ సమస్యల పరిష్కారా నికి తోడ్పడకపోగా ఈ అసమానతలను పెంచిపోషిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడేందుకే తోడ్పడుతున్నాయి."**

పెట్టుబడిదారులతో పోరాటానికి సిద్ధంగాలేరు. ప్రైవేటురంగంలో కూడా ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రవేశపెట్టదలిస్తే అది ప్రైవేటు రంగానికి సబ్సిడీలు కల్పించాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త సంజీవ్ గోయెంకా అన్నారు. కార్పోరేట్ రంగంలో కూడా ఉద్యోగాలలో రిజర్వేషన్లు అమలు జరపవలసి వస్తే దళితులకు, గిరిజను లకు పని అప్పగించే బదులు వారిని ఖాళీగా కూర్చోబెట్టి జీత భత్యాలు ఇస్తామని ఒక ఫిక్కీ ప్రతినిధి అన్నారు. పెట్టుబడిదారుల వైఖరిని అస్థిత్వవాదులు వ్యతిరేకించకపోగా ఈ సరళీ కృత ఆర్థిక విధానాల సహకారంతోనే దళితుల్లో కొద్దిమందిని పెట్టుబడి దారులుగా చేయాలంటు న్నారు. దళిత బూర్జువాను సృష్టించడమే కులవివక్ష వ్యతిరేక ఉద్యమ ప్రధాన లక్ష్యంగా ఉండాలంటున్నారు. కోట్లాది సాధారణ దళిత, గిరిజన ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. నిజమైన అంబేద్కర్ అనుచరులంటే ఉద్యోగా లిచ్చేవారుగా ఉండాలేతప్ప ఉద్యోగం అడుక్కునే వారుగా ఉండకూడదని దళిత్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధినేత మిలింద్ కాంబ్లే అన్నారు. దళితులందరినీ పెట్టుబడిదారు లుగా మార్చి ఇతర కూలాల వారికి ఉద్యోగాలు ఇవ్వవచ్చునని ఆయన చెప్పగలరా? అసలు విషయం స్పష్టంగానే చెప్పారు. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడవద్దని, పెట్టుబడిదారులలో తానూ ఒకరుగా మారాలని చెప్పారు. ఇదీ అసలు విషయం. నల్లజాతీయుల విముక్తినేత డా॥డబ్ల్యు.ఇ.బి.డు బోయిస్ అసలు విషయం బయటపెట్టారు. "నల్లబూర్జువా" సిద్ధాంతం పేరుతో నల్లజాతీయులలో విభజన సృష్టిస్తారని, తమ నల్లజాతీయులను తామే దోచు కునే నల్లజాతి పెట్టుబడిదారులను సృష్టిస్తారని చెప్పారు. దళిత బూర్జువా సిద్ధాంతం పర్యవసా నాలు ఇంతకంటే భిన్నంగా ఉంటాయా? అంతేకాదు సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడవద్దనడమంటే పెట్టుబడి దారీ దోపిడీని కాపాడేందుకు, విదేశీ బహుళ జాతి సంస్థల చొరబాటుకూ తోడ్పడటమే.

**వర్గపోరాటాన్ని బలహీనపరిచే అస్థిత్వ ఉద్యమాలు**

అస్థిత్వవాదులు న్యాయమైన అనేక సమ స్యలు లేవనెత్తుతుంటారు. కులవివక్ష గానీ, సామాజిక తరగతుల వెనుకబాటుతనం గానీ, మహిళల అసమానత సమస్యగానీ, ప్రాంతీయ అసమానతలు గానీ సమాజాన్ని పీడిస్తున్న తీవ్ర సమస్యలే. కానీ ఈ సమస్యల పరిష్కారానికి మార్గంగా చూపుతున్న అస్థిత్వవాద సిద్ధాంతాలు మాత్రం ఆచరణలో ఈ సమస్యల పరిష్కారానికి తోడ్పడకపోగా ఈ అసమానతలను పెంచిపోషి స్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడేందుకే తోడ్పడుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారం కోసం, అస్థిత్వవాద పరిధి దాటి ఆలోచించడం అవసరం.

ఆర్థికరంగంలో శ్రమదోపిడీ కీలకమైన సమస్య. ఆధునిక సమాజంలో పెట్టుబడిదారీ దోపిడీగా ఇది ముందుకొచ్చింది. పెట్టుబడిదారీ విధానానికి ముందునుండే కొనసాగుతున్న ఆర్థిక దోపిడీ, సామాజిక అసమానతలూ వివిధ రూపాలలో కొనసాగుతూనే వున్నాయి. ఈ అస మానతలకు, అణచివేతకు, వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరే కంగా కూడా పోరాడాలన్న విషయాన్ని మాత్రం విస్మరించలేము. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని చెబుతున్న అస్థిత్వ వాదుల్లో కొందరు వర్గం అస్థిత్వాన్నే చూడ నిరాకరిస్తుండగా మరికొందరు అన్ని అస్థిత్వాల్లో వర్గం కూడా ఒకటిగా మాత్రమే పరిగణిస్తు న్నారు. వర్గపోరాటానికున్న కీలకస్థానాన్ని నిరాకరిస్తున్నారు. సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా మాత్రమే పోరాడటం వల్ల అణచివేత అంతమౌతుందనుకున్నా దోపిడీ కొనసాగుతూనే వుంటుంది. వర్గదోపిడీ అంతమైతే మరేవిధమైన దోపిడీగానీ, అణచివేత గానీ కొనసాగజాలవు. నిజానికి ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగినంతకాలం సామాజిక రుగ్మతలు కూడా అంతం కావు. పాలకవర్గాలు అంతం కానీయవు. పెట్టుబడిదారీ వర్గమే ఈ సామాజిక రుగ్మతలను కాపాడు తున్నది. సామాజిక రుగ్మతలు, వీటికి వ్యతిరే కంగా వచ్చే అస్థిత్వ ఉద్యమాలు, పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసే పీడితవర్గాల ఐక్యతను బలహీనపర్చుతున్నాయి. పెట్టుబడిదారీ వర్గానికి ఈ సామాజిక దురాచారాలు కొనసాగటం అవసరం. అందుకే పెంచిపోషిస్తున్నారు. అందువల్ల వర్గ పోరాటంతో పాటు సామాజిక సమస్యలను కూడా జోడించి పోరాడాలి.

శ్రమదోపిడీని ప్రతిఘటించే కార్మికవర్గంలో గానీ, ఇతర శ్రామికులలో గానీ, వివిధ కులాలు, మతాలకు చెందిన వారున్నారు. స్త్రీలు, పురు షులూ వున్నారు. ఈ శ్రామికులకు అనేక రకాల అస్థిత్వాలు చూస్తున్నాం. వీరందరినీ కలిపి వుంచేది పెట్టుబడిదారీ వర్గానికి, భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా పోరాటంలో నిలబెట్టేది వర్గ ఐక్యతే. కానీ ఇతర అస్థిత్వాలన్నీ వీరిని విడగొట్టేవే. శ్రామికులు విడిపోవటం అంటే పెట్టుబడిదారీ వర్గం లాభపడటమే. పెట్టుబడి దారీ వ్యవస్థ రక్షించబడటమే. అస్థిత్వవాదం వర్గవిభజనను మరుగుపరుస్తుంది. ఒక కులాన్నో, మతాన్నో ముందుకు తేవటం ద్వారా ఆ కులంలో వున్న అన్ని వర్గాలనూ కలిపి చూపుతుంది. పేదల్లోనూ, కార్మికవర్గంలోనూ అనైక్యత సృష్టిస్తుంది. అనుభవించిన వారికే సమస్యలు అర్థమౌతాయన్న వాదనతో బాధితులను ఒంటరి చేస్తుంది. మిత్రులు సమకూరకుండా అడ్డుకుం టుంది. పెట్టుబడిదారీ వర్గమూ, పాలకులూ కోరుకుంటున్నది కూడా బాధితులు ఒంటరిపాటు కావాలనే. "ఒక అస్థిత్వం మరొక అస్థిత్వం నుండి తమనుతాము వేరు చేసుకుంటాయి లేదా మినహాయించుకుంటాయి. ఇది అస్థిత్వ రాజ కీయాల సహజ స్వభావం. నిజానికి ఒక అస్తిత్వం మరొక అస్తిత్వం నుండి విభేదించడం ద్వారా మాత్రమే నిర్ధారిత మవుతుంది"–(ప్రకాశ్‌కరత్, ప్రధానకార్యదర్శి, సిపిఐ(ఎం).

**విప్లవ సిద్ధాంతం ప్రాధాన్యత**

సమాజంలో మౌలిక మార్పుల కోసం పోరాడుతున్న శక్తులు ఆధునికానంతరవాదం లేదా అస్థిత్వ రాజకీయ సిద్ధాంతాల మూలాలను అర్థం చేసుకోవడం అవసరం. కార్మికవర్గ విముక్తి కోసం, సామాజిక న్యాయం కోసం, శాస్త్రీయమైన మార్క్సిస్టు సిద్ధాంతం ప్రాతిపదికగా పోరాడాలి. "సిద్ధాంతం ప్రజలను ఆవహిస్తే అదొక భౌతిక శక్తిగా మారుతుంది" అన్నారు కారల్‌మార్క్స్ (మార్క్స్ ఏంగెల్స్ కలెక్టెడ్‌వర్క్స్, వాల్యూమ్–3, పేజీ 182). నిజమే విప్లవ సిద్ధాంతం ప్రజలను

ఆవహిస్తే అది విప్లవోద్యమంగా మారుతుంది. అస్థిత్వవాద సిద్ధాంతాలు ఆవహిస్తే ఏం జరుగుతుంది? అది అస్థిత్వ ఉద్యమాలకే దారి తీస్తుంది కదా! శ్రామికుల విభజనకూ, వివక్షకు లోనైనవారి ఒంటరిపాటుకూ, పెట్టుబడిదారుల ఆనందానికీ మాత్రమే దారితీస్తుందికదా! ఇది ఏ సిద్ధాంతానికైనా వర్తిస్తుంది. అందుకే విప్లవ సిద్ధాంతంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

> ❝ సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో అభివృద్ధి అంటే అది పెట్టుబడిదారుల అభివృద్ధి. దీనినే అందరి అభివృద్ధిగా చిత్రీకరిస్తున్నారు. ఈ అభివృద్ధిలోనే అస్థిత్వవాదులు వాటా అడుగుతున్నది. ❞

**అభివృద్ధిలోవాటా, అధికారంలోవాటా**

అస్థిత్వవాదులు, కులవివక్ష వ్యతిరేక ఉద్యమం లేదా కుల నిర్మూలన కోసం చేసే కృషి కన్నా రాజకీయ రిజర్వేషన్లకు, 'అభివృద్ధిలో వాటా', 'అధికారంలో వాటా' అన్న నినాదాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. కారణమేమిటి? సరళీకృత ఆర్థిక విధానాల వల్ల లాభపడిన నయా-ధనికులు, ఉన్నత మధ్యతరగతి నేపథ్యంలో ఈ సమస్యను సులభంగా అర్థం చేసుకోవచ్చు. కుల వివక్ష వ్యతిరేక పోరాటాలు ఫ్యూడల్ భావజాలానికి వ్యతిరేకం. అందుకే వీటిని పాలకవర్గాలు సహించవు. బడ్జెట్‌లో వాటా కోసం జరిగే పోరాటాన్ని కూడా అంగీకరించరు. ఇది పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ఆటంకం కదా! కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల కోసం రాయితీల రూపంలో యేటా 5 లక్షల కోట్ల రూపాయలకుపైగానే కట్టబెడుతున్నది. జనాభా ప్రాతిపదికన దళితులు, గిరిజనులు వాటా అడిగితే పెట్టుబడిదారులు తట్టుకోగలరా?

సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో అభివృద్ధి అంటే అది పెట్టుబడిదారుల అభివృద్ధి. దీనినే అందరి అభివృద్ధిగా చిత్రీకరిస్తున్నారు. ఈ అభివృద్ధిలోనే అస్థిత్వవాదులు వాటా అడుగుతున్నది. అధికారంలో వాటా అంటే ఏమిటి? ప్రస్తుత సమాజంలో రాజ్యాధికారం పెట్టుబడిదారులు, భూస్వాముల చేతుల్లో వున్నది. ఈ పాలకవర్గాల సరసన వాటా కోరుతున్నారు. ఇందుకు పాలవర్గాలకు అభ్యంతరమేమీలేదు. అణచివేతకు, వివక్షకు గురవుతున్న తరగతులలోని కొద్ది మంది నోరున్నవారిని (క్రీమీలేయర్‌ను) తమ వర్గంలో కలిపేసుకుంటే అశేష దళిత, గిరిజన ప్రజానీకం నోరు మూయించవచ్చు. ఈ క్రీమీలేయర్ ఆధారంగానే బడుగు బలహీనవర్గాలను తమ ఓటు బ్యాంకుగా గుప్పిట్లో ఉంచుకోవచ్చు. దీనివల్ల దళితులు, గిరిజనుల్లో కొద్దిమంది లాభపడవచ్చు. కానీ కోట్లాది బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఒరిగేదేమీలేదు.

కులనిర్మూలన జరిగినా లేదా కులవివక్ష అంతమైనా అది కార్మికవర్గ ఐక్యతకు తోడ్పడుతుంది. పెట్టుబడిదారీ దోపిడీకి ప్రమాదకరంగా తయారవుతుంది. అందుకే కుల భేదాలను, కుల వివక్షను పెట్టుబడిదారులు పెంచిపోషిస్తారు. అనైక్యతను కొనసాగించేందుకు రిజర్వేషన్ వ్యతిరేక, అనుకూల ఉద్యమాలను రెచ్చగొడతారు. అగ్రకులాల పెత్తనం స్థానంలో దళితుల పెత్తనం రావాలన్న సిద్ధాంతాన్ని ప్రోత్సహించేందుకు కూడా వెనుకాడరు. ఒక కులంలోని కొద్ది మంది ఉన్నతస్థాయి వారి ప్రయోజనాలనే ఆ కులంలోని అందరి ప్రయోజనాలుగా చిత్రీకరిస్తారు. పెట్టుబడిదారులు చెప్పే 'ఇముడ్చుకునే అభివృద్ధి' (ఇన్‌క్లూసివ్ గ్రోత్)కి అర్థం ఇదే. సాంప్రదాయ వృత్తులను నాశనం చేస్తున్నది పెట్టుబడిదారీ వర్గమే. ఇదే పాలకవర్గం సంక్షేమ పథకాల పేరుతో బాధితులను ఓటుబ్యాంకుగా మల్చుకుంటున్నది. అవే కుటుంబాల నుండి చదువుకున్నవారిని అభివృద్ధినినాదంతో ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నది. వృత్తుల నాశనంతో ఉపాధి కోల్పోతున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల గురించి బూర్జువా పార్టీలకు పట్టదు. వీరు సంక్షేమ పథకాలు, రాజకీయ రిజర్వేషన్ల గురించి మాత్రమే మాట్లాడుతారు. ఇది ఓట్ల రాజకీయం. కానీ బి.సి సంఘాలు కూడా ఈ రెండింటి చుట్టే పరిభ్రమిస్తున్నాయి. అవినీతి మంత్రులు కూడా కులం చాటున రక్షణ పొందే ప్రయత్నం చేస్తున్నారు. స్వప్రయోజనం కోసం తప్పుడు జి.ఓలు విడుదల చేసిన నేరానికి జైలుకు పోయిన, జైలుకు పోయే అవకాశం వున్న మంత్రులను రక్షించేందుకు 22 మంది మంత్రులు కలిసి ముఖ్యమంత్రి మీద ఒత్తిడి చేశారు. ఎస్.సి, ఎస్.టి సబ్‌ప్లాన్, కొండ ప్రాంత గిరిజనుల విష జ్వరాలు, విద్యుత్ ఛార్జీల పెంపుదల వంటి ఏ ఒక్క సమస్య పరిష్కారం కోసం కూడా ఇంత మంది మంత్రులు ఏకమైన సందర్భాలు లేవు. స్వప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాల రక్షణ కోసం బి.సి కార్డు వాడటం తప్ప మరొకటి కాదిది. అభివృద్ధిలోనూ, అధికారంలోనూ మాత్రమే కాదు అవినీతిలో కూడా వీరు వాటా కోరుతున్నారు.

**లౌకికతత్వం అంటే ఏమిటి?**

లౌకికతత్వం కూడా ప్రమాదంలో పడుతున్నది. దీనికి రకరకాల భాష్యాలు చెబుతున్నారు. మత సామరస్యమే లౌకికవాదంగా చెప్పేవారు ఉన్నారు. ప్రభుత్వం అన్ని మతాలను ప్రోత్సహించటమే లౌకికవాదంగా చెబుతున్నారు. నిజానికి మత విశ్వాసాలను వ్యక్తిగతంగా పరిగణించాలి. మతాన్ని రాజకీయాల నుండి విడదీయాలి. ఇదే లౌకికతత్వం. పరిణామ క్రమంలో పెట్టుబడిదారులు భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాడినప్పుడు లౌకిక తత్వం గురించి నినదించారు. అదే పెట్టుబడిదారులు ఇప్పుడు కార్మికవర్గం నుండి ప్రతిఘటనను ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు లౌకికతత్వం గురించి మాట్లాడిన వీరే ఇప్పుడు తమ రాజ్యాధికారాన్ని కాపాడుకోవడానికి మతాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. మతాన్నీ, రాజకీయాలనూ కలగాపులగం చేస్తున్నారు. అంబానీ తదితర పెద్దపెద్ద పెట్టుబడిదారులంతా నరేంద్రమోడీ వెనుక చేరడంలో మతలబు ఇదే. మైనారిటీలను రెచ్చగొడుతున్నవారి వెనుక కూడా పెట్టుబడిదారీ వర్గమే ఉన్నది.

**అవకాశవాద ధోరణులను ప్రోత్సహిస్తున్న పెట్టుబడిదారీ వర్గం**

వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలను అణచేందుకు పాలకవర్గాలు రాజ్యాధికారాన్ని ప్రయోగించడం సహజం. సైద్ధాంతిక రంగంలో కూడా దాడి చేస్తారు. అంతటితో ఆగరు. ఉద్యమకారులలో అవకాశవాద ధోరణులను చొప్పించేందుకు ప్రయత్నిస్తారు. కొంత మంది మేధావులు, ఉన్నతాధికారులు ఈ పనే చేస్తున్నారు. బడుగు బలహీనవర్గాల నుండి వచ్చి సామాజిక మార్పుకోసం తపిస్తున్న చురుకైన యువతీయువకులను తప్పు త్రోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. "మీరేమైనా చేయండి,

> "పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటమే కాదు, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యత కూడా కార్మికవర్గానిదే. సామాజిక అణిచివేత, కులవివక్ష, లింగవివక్ష, మైనారిటీలపట్ల వివక్షను ప్రతిఘటించాలి. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలి."

పెట్టుబడిదారులైనా కండి లేదా రాజకీయ నాయకులైనా కండి, మేము మీకు సహాయం అందిస్తాం" అంటున్నారు. శత్రువును ఎదురు బొదురుగా ఎదుర్కోవటం ఒక పద్ధతి. శత్రు శ్రేణులలో గందరగోళం సృష్టించటం మరొక పద్ధతి. వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమ శ్రేణుల లో గందరగోళం సృష్టించేందుకు అస్థిత్వ రాజకీయాలను పెట్టుబడిదారులు ఆయుధాలుగా వాడుతున్నారు. వర్గపోరాటం మీద వీరు దృష్టి కేంద్రీకరించకుండా చూడటమే వీరి లక్ష్యం. అందుకే కమ్యూనిస్టు పార్టీలో కూడా కులం వెతికే ప్రయత్నం చేస్తారు. అన్ని పార్టీలలోనూ తమ కులానికి చెందినవారు నాయకులు కావాలని ప్రచారంలో పెడతారు. కమ్యూనిస్టు పార్టీలో కూడా బలహీనులను వెతికి అవినీతి రొంపిలోకి దించుతారు. వివిధ స్థాయిల్లో ప్రజాప్రతినిధు లకు, నాయకులకు కమీషన్లు రుచిచూపించేం దుకు ప్రయత్నిస్తారు. సరిదిద్దేందుకు పార్టీ చేసే ప్రయత్నాలకు కులం ఆపాదిస్తారు. అనుక్షణం బూర్జువా మీడియా ఇందుకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. "ఎంత మంది తినటంలేదు? బడుగు బలహీనవర్గాల నుండి వచ్చిన కార్యకర్తలు తింటే తప్పేముంది?" అన్న వాదనలను చొప్పిస్తారు. కమ్యూనిస్టు పార్టీని బలహీనపర్చేందుకు, లోపలి నుండి దెబ్బకొట్టేందుకు పాలకవర్గాలు చేసే ప్రయత్నమే ఇది. అందుకే లెనిన్ చెప్పిన మాటలు సదా గుర్తుంచుకోవాలి. "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం లేదు"(లెనిన్, ఏమి చేయాలి?).

**ఆర్థిక, సామాజిక రంగాలలో పోరాటమే లక్ష్యం**

పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటమేకాదు, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యత కూడా కార్మిక వర్గానిదే. సామాజిక అణిచివేత, కులవివక్ష, లింగవివక్ష, మైనారిటీలపట్ల వివక్షను ప్రతిఘటించాలి. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఇలాంటి సమస్యలపై కార్మికవర్గం, వామపక్ష శక్తులు చొరవతో కృషి చేయాలి. "సామాజిక సమస్యల విషయంలో రెండు పొరపాటు ధోరణులు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రత్యేక తరగతులకు చెందినవారు అణిచివేతకు, వివక్షకు గురవుతున్నారు. ఈ వాస్తవాన్ని గమనించకుండా వర్గ దృక్పథం గురించి మాత్రమే మాట్లాడడం, వర్గ ప్రాతిపదికపైన మాత్రమే ఉద్యమాలు నిర్మించడం పొరపాటు ధోరణి. అస్థిత్వ ఉద్యమాలతో పూర్తిగా మమేకమైపోవటం, వాటికి తోకగా మారిపోవటం మరొక పొరపాటు ధోరణి. అణిచివేతకు, వివక్షకు గురవుతున్న తరగతులను సమీకరించటం, వారి విశ్వాసం పొందటం పేరుతో మన ప్రత్యేకతను, స్వతంత్రతను కోల్పోవటం, వారి తప్పుడు సిద్ధాంతాలను ఎదుర్కోకపోవటం పొరపాటు ధోరణి"–(ప్రకాశ్‌కరత్). వామపక్ష శక్తులు, కార్మికవర్గం చొరవ చేయటమేకాదు, ఈ ఉద్యమాలు ఎవరి నాయ కత్వం లో జరిగినా సంఘీభావం తెలపాలి. సహకరించాలి. అంతేకాదు, ఈ సామాజికోద్యమాలతో పాటు నిరంతరం పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా, సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా వర్గపోరాటం ఉధృతం చేయాలి. ●

# సామాజిక న్యాయం కోసం పోరాటం: కొన్ని అనుభవాలు

(11వ పేజీ తరువాయి)

గురించి మాట్లాడే హక్కు లేదని వాదించే ఒంటెత్తు ధోరణి ప్రబలంగా ఉంది. దళితుల గురించి దళితులు మాత్రమే అర్థం చేసుకోగలరనీ, దళితుల కోసం దళితులు మాత్రమే పోరాడగలరనీ వాదిస్తారు. ఈ ధోరణి ఇటీవలి కాలంలో కొంత తగ్గినప్పటికీ ఇంకా గణనీయంగానే ఉంది. ఈ ధోరణిని అధిగమించకుండా ఒంటరిపోరాటం విజయం సాధించదు. దళితుల ఆత్మగౌరవం కోసం సాగే పోరాటంలో దళితులది కీలకమైన స్థానం. అందులో అనుమానానికి తావు లేదు. అయితే మద్దతుగా ప్రజాస్వామ్య శక్తులనూ, దళితేతర తరగతులనూ కూడగట్టుకునే విషయాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

**6. శ్రామికవర్గ ఉద్యమాలు ఈ సమస్యపై అవసరమైనంత శ్రద్ధ చూపక పోవడం:**

దోపిడీ లేని సమాజం కోసం పని చేసే శక్తులు, ముఖ్యంగా కమ్యూనిస్టులు ప్రజల్ని అనేక సంఘాలలో కూడగట్టి ఉద్యమ బాటలో నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు– ఇంకా ఎన్నో సంఘాలు పని చేస్తు న్నాయి. తమ రోజువారీ కార్య క్రమాలకు తోడుగా దళితుల సమస్యలపై కృషికూడా అవసరమని ఈ సంఘాలు గుర్తించాయి. అయితే ఈ ప్రత్యేక అంశంపై నిరంతరం పని చేయడంలో విఫల మవుతున్నాయి. వారు తమ రంగాలలో చేపట్టే సమస్యల తీవ్రత, పని వత్తిడి దీనికి కారణం.

అస్పృశ్యత, కుల వివక్ష అంతం కావాలని కోరుకునే సంఘాలు, వ్యక్తులు ఈ బలహీనతలను అధిగమించడానికి శ్రమించాలి. ఒక విశాలమైన ఐక్యఉద్యమాన్ని నిర్మించడంలో పాలుపంచుకోవాలి. కె.వి.పియస్ ఆవిర్భవించి 15 సంవత్స రాలైంది. ఈ 15 సంవత్సరాలుగా కె.వి.పి. యస్ పై అవగాహనను ఆచరణలో పెట్టడానికి కృషి చేస్తున్నది.


**(అనువాదం:డా॥ విజయకుమార్)**

●

ఇంటర్వ్యూ

# పట్టణ ప్రాంతాల్లో పోరాటాల ఆవశ్యకత

**సామాజిక మార్పుకోసం జరిగే పోరాటాల్లో పట్టణ ప్రాంతాల్లో పోరాటాలు ఎందుకు ప్రాధాన్యత సంతరించుకున్నాయి? పట్టణ ప్రాంతాలపై నియంత్రణ సాధించటం ఈ ఉద్యమాలకు ఎందుకు అవసరం? పట్టణ ప్రాంతాల్లో సామాజిక అంతరాలు పతాకస్థాయికి చేరుకున్న సమకాలీన ప్రపంచంలో సాధ్యాసాధ్యాల గురించి మనం ఎలా పునరాలోచించాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు అన్వేషిస్తూ మేము 24 అక్టోబర్ 2013న డేవిడ్ హార్వేని ఇంటర్వ్యూ చేశాము. న్యూయార్క్ సిటీ విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేట్ సెంటర్‌లో హార్వే భౌగోళికశాస్త్రం, మానవ పరిణామ శాస్త్రంలో విశిష్ట అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. అక్కడ ఆయన సెంటర్ ఫర్ ప్లేస్, కల్చర్, పాలిటిక్స్ అధిపతిగా వున్నారు. 'సోషల్ జస్టిస్ అండ్ సిటీ' (1973) 'ది లిమిట్స్ ఆఫ్ కాపిటల్' (1982) 'స్పేసెస్ ఆఫ్ హోప్' (200) 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ నియోలిబరలిజం' (2003) వంటి పరిశోధనాత్మక గ్రంథాలు అందించిన రచయిత హార్వే. వర్గపోరాటం తీరుతెన్నులు తెలుసుకునే ప్రయత్నంలో పట్టణ ప్రాంతాలు, నివాసస్థలాల్లో పౌరజీవన ప్రమాణాలు ప్రాధాన్యతలను హార్వే వివరిస్తారు. సామాజిక మార్పుకోసం జరిగే పోరాటాల మధ్య ఐక్యత, సమన్వయం కావాలనీ, పట్టణ జీవితాన్ని ఉత్పత్తి, పునరుత్పత్తి చేసే క్రమంలో భాగస్వాములైన వారందరినీ కార్మికవర్గంగా భావించాలనీ ప్రతిపాదిస్తారు ఆయన**



**డేవిడ్ హార్వేతో ముఖాముఖి**

**హిబా బౌ అకార్ & నదా ముంతాజ్:** ముందుగా 'జడాలియ్యా' పత్రిక కోసం మిమ్ములను ఇంటర్వ్యూ చేసే అవకాశం రావడం, దానికి మీరు అంగీకరించడం అదృష్టంగా భావిస్తున్నాము. సామాజిక, రాజకీయ మార్పుకోసం ఉద్యమాల్లో పాల్గొనేవారికి సంబంధించి పట్టణ ప్రాంత ఉద్యమాల ప్రాధాన్యత ఏమిటి?

**డేవిడ్ హార్వే:** ముందు క్లుప్తంగా సైద్ధాంతిక నేపథ్యం వివరిస్తాను. మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంథం 2వ సంపుటి చదవడం ద్వారా నేను పొందిన అవగాహన ఇది. ఉత్పత్తి క్రమంలోనే అదనపు విలువ, లాభం, ఉత్పత్తి అవుతాయన్నది మార్క్స్ ప్రాథమిక విశ్లేషణ. సాధారణంగా పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటి అందరూ చదువుతారు. అందులో మార్క్స్ ఉత్పత్తి గురించి వివరిస్తారు. ఉత్పత్తి అయిన విలువ మార్కెట్‌లో అమ్ముడయ్యే వరకూ అది అదనపు విలువ రూపం సంతరించుకోదు అని మార్క్స్ స్పష్టం చేశారు. అందువల్ల ఆయన 'గ్రుండ్రిజ్' లో చెప్పినట్లు ఉత్పత్తి–అమ్మకాల మధ్య వైరుధ్యభరితమైన ఐక్యతే పెట్టుబడి అంటే ఏమిటో నిర్వచిస్తుంది.

ఉత్పత్తి ప్రక్రియలో అదనపు విలువ తయారు అవుతుంది. అయితే ఉత్పత్తి అయినచోటే అది లాభం రూపంలోకి మారదు. మరోచోట ఎక్కడో మారుతుంది. ఉదాహరణకు ఒక వస్తువు విలువ చైనా ఫ్యాక్టరీలో తయారై ఒహియోలోని కొలంబస్ పట్టణ వాల్‌మార్ట్ దుకాణంలో అమ్ముడవుతుంది. అందువల్ల పట్టణీకరణ అనేక రకాలుగా అదనపు విలువలను లాభంగా మార్చే స్థానంగా వుంటుంది. ఉత్పత్తి, అమ్మకం స్థానాల మధ్య పెట్టుబడి చలనంలో అంతర్లీన సంబంధం ఇమిడి వుంటుంది. ఉత్పత్తి స్థానంలో వర్గ పోరాటాలకు ఎంత ప్రాధాన్యత వుందో ఆ ఉత్పత్తి విలువ లాభంగా మారే పట్టణ ప్రాంతాల్లో వర్గ పోరాటానికీ అంతే ప్రాధాన్యత వుంది.

కార్మికులు మెరుగైన వేతనాలు, పని పరిస్థితుల గురించి పోరాడవచ్చు. ఆ పోరాటాల ఫలితంగా కొంత అదనపు ఆదాయం కూడా వస్తే రావచ్చు. కానీ ఆ అదనపు ఆదాయంతో ఇల్లు చేరిన కార్మికులకు పెరుగుతున్న అద్దెలు, నిత్యావసరాల ధరలు, ఇతర సేవల ధరలు దర్శనమిస్తాయి. ఆ పెరిగిన ధరల రూపంలో తిరిగి కార్మికుల ఆదాయం పెట్టుబడిదారుల జేబుల్లోకి చేరుతుంది. అందువల్ల కార్మికులకు ఉత్పత్తి స్థలాల్లో ఏం జరుగుతుంది అన్న ఆందోళన మాత్రమే కాదు, ఇంటి ఖర్చులు, విద్య, వైద్యం ఖర్చులు, ఇతర అవసరాల విషయంలో కూడా ఆందోళన చెందాల్సి వస్తోంది.

అనేకమంది సిద్ధాంతకర్తలు ఈ రెండు పోరాట రూపాలను వేర్వేరుగా చూస్తున్నారు. దానికి భిన్నంగా నేను ఈ రెండు క్షేత్రాల్లో జరిగే పోరాటాల మధ్య వైరుధ్య భరితమైన ఐక్యత వుందని భావిస్తున్నాను. అందువల్ల పట్టణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు జరిగే పోరాటం, పని స్థలాల్లో వేతనాల పెంపుదల కోసం జరిగే పోరాటాలతో సమాన ప్రాధాన్యత కలిగి వుంది. ఈ ఐక్యతను అందరూ గమనించాల్సిన అవసరం వుంది.

పట్టణాలు ఎలా రూపుదిద్దుకుంటాయి, ధరవరలు ఎలా ఉంటాయి, అద్దెలు, ఆదాయాలు ఎలా ఉంటాయి, మురికి వాడలు ఎలా ఏర్పడతాయి అనేవన్నీ దీని మీద ఆధారపడి ఉంటాయి. ఇక్కడ మురికి వాడల గురించి చెప్పుకోవాలి. చారిత్రకంగా చూస్తే మురికి వాడలు పేదలతో ఏర్పడతాయి. కానీ ఇప్పుడు ధనికులే తమంత తాముగా ప్రత్యేక వాడలు ఏర్పాటు చేసుకుని బాహ్య ప్రపంచానికి దూరమైపోతున్నారు.

అందువల్ల ఈ సమస్యను ఏకీకృత సమస్యగా పరిగణిస్తున్నారు. మనం కార్మికులుగా పనిస్థలాల్లో ఎంత పెద్ద విజయాలు సాధించినా, ఆ విజయఫలాలు నివాస ప్రాంతాలకు చేరకుండానే ఆవిరి అవ్వడం చూస్తున్నాము. పెరుగుతున్న అద్దెలు, ఇతర జీవన వ్యయాలతో కార్మికవర్గం కలవరపడుతున్నారు. అనేక రూపాల్లో పెరుగుతున్న ధరల ద్వారా పెట్టుబడి తిరిగి కార్మికులనుండి అదనపు విలువను వెనక్కు లాగేసుకుంటోంది.

ఈ విషయాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించటం అవసరం.

ఎందుకంటే విద్యార్థులు ఉత్పత్తి క్రమంలో భాగస్వాములు కారు. అటువంటి వారికి ఉత్పత్తి స్థలం గురించి వివరించవచ్చు. కానీ ఆ విషయాలు బాగా అర్థం కావాలంటే అద్దెలు పెరుగుదల గురించి చెప్పాలి. మీరు కూడా అటువంటి డిమాండ్లకోసం అటువంటి పోరాటాలే చేస్తున్నారని చెప్పినప్పుడు వారు ఇంకా బాగా అర్థం చేసుకోగలరు.

వర్గ పోరాటం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలంటే పట్టణ ప్రాంత జీవన ప్రమాణాలను గురించీ, నివాస ప్రాంతం కోసం జరిగే పోరాటాలను గురించీ అర్థం చేసుకోవటం అవసరం. పెట్టుబడి లక్షణ మేమంటే అది చాలా వెలుసుబాటుగా ఉంటుంది. ఒకచోట నష్టపోతే మరోచోట లబ్ధి పొందుతుంది. సోషల్ డెమొక్రసీ విధానాలు అమలు జరిగిన కాలంలో ఉత్పత్తి స్థలాల్లో పెట్టుబడి కొంత నష్టపోయేది. అదే సమయంలో అనేక ఇతర మార్గాలు, వ్యవస్థల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ అదనపు విలువలను సొంతం చేసుకునేది. దురదృష్టమేమిటంటే మార్క్సిస్టు మేధావులతో సహా అనేకమంది విశ్లేషకులు మేధావులు నివాస ప్రాంతాల్లో జరిగే కృషి, పరిణామాలను ద్వితీయ ప్రాధాన్యతగా పరిగణిస్తున్నారు. ఈ రకంగా పట్టణ ప్రాంతాల్లో జరిగే పరిణామాలు ద్వితీయ ప్రాధాన్యతకు నెట్టివేయబడటం పెట్టుబడికి సంతోషదాయక పరిణామమే. ఎందుకంటే అక్కడ జరిగే పోరాటాలు వర్గ పోరాటంలో అంతర్భాగంగా పరిగణించబడటం లేదు కదా!

మార్క్సిస్టు సిద్ధాంతంలో ఒక సమస్య ఏమిటంటే పెట్టుబడి గ్రంథం రెండవ సంపుటంలో పెట్టుబడి లాభంగా మారే క్రమాన్ని గురించి ఎవ్వరూ చదవకపోవడం. అందరూ ఉత్పత్తి క్రమం గురించి మాట్లాడతారు తప్ప ఆ ఉత్పత్తి అదనపు విలువగా మారే మార్కెట్ గురించి చదవరు. రెండవ సంపుటం చదవటం కష్టమే. అది చదవకపోవటమే మార్క్సిస్టు అవగాహనలో పరిమితులకు కారణం అని భావిస్తున్నాను. ఉత్పత్తి, అమ్మకం ద్వారా అందులో దాగి వున్న అదనపు విలువను సొంతం చేసుకోవటం మధ్య వున్న వ్యత్యాసాన్నీ, ఏకత్వాన్నీ అర్థం చేసుకోవటంలో ఈ పరిమితి వ్యక్తం అవుతోంది.

**ప్రశ్న:** టర్కీలోని ఇస్తాంబుల్ నగరంలో గాజీ పార్కు ఆందోళనల వెనుకనున్న పట్టణ మూలాల గురించి ఎక్కువ ప్రచారం జరిగింది. నిజానికి అరబ్ తిరుగుబాట్లూ, ఈజిప్టు ఆందోళనలతో పోలిస్తే గాజి పార్కు ఆందోళన చిన్నది. ఈజిప్టులో యువత కొత్త కాపురం మొదలుపెట్టడానికి వీలు లేనంతగా ఇళ్ళ కొరత ఎదుర్కొంటున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో జరిగే పట్టణ పోరాటాల మధ్య తేడాను ఎలా వివరిస్తారు?

**హార్వే:** ఇస్తాంబుల్, కైరో పరిణామాల గురించి నాకు అంత అవగాహన లేదు. ఇస్తాంబుల్‌లో పట్టణీకరణ అనూహ్య వేగంతో జరుగుతోంది. గాజీ పార్కు ఆందోళనకు కొద్ది రోజుల ముందు ఇస్తాంబుల్‌లో పర్యటించాను. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో టర్కీ ఆర్థికవ్యవస్థ ఒకటి. ఆ ఆర్థికాభివృద్ధిలో నిర్మాణ రంగం, పట్టణీకరణ కీలకపాత్ర పోషిస్తున్నాయనటంలో సందేహం లేదు. అయితే ఇది ఒక గాలిబుడగ. ఈ గాలిబుడగ రూపొందే క్రమంలో ప్రజలు నిర్వాసితులౌతున్నారు. నేటి ఇస్తాంబుల్ చూస్తే 2005లో పతనానికి ముందు మాడ్రిడ్‌ను (స్పెయిన్ రాజధాని...సం॥) తలపిస్తోంది అని రేడియో ఇంటర్వ్యూలో చెప్పటంతో నామీద విమర్శలు వచ్చాయి. నిర్వాసితులు ఇస్తాంబుల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. నాకు, ప్రజలను నిర్వాసితులను చేస్తున్న కొన్ని ప్రాంతాల్లో కొందరు మిత్రుల సహకారంతో పర్యటించే



**టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లోని గెజీ పార్క్‌లో నిరసన కారులపై భాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు**

వీలు కలిగింది.

ప్రస్తుతం పట్టణ నివాస ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. నగరాన్ని అభివృద్ధి చేయటంలో భాగంగా ప్రభుత్వాలు రూపొందించే అనేక మెగా ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆందోళన సాగుతోంది. గాజీ పార్కు ప్రణాళిక గురించి ప్రభుత్వం ప్రకటించినప్పుడు దానికి ప్రజా ప్రతిఘటన ఎదురవడం నన్ను అంతగా ఆశ్చర్యపరచలేదు. అయితే ఇస్తాంబుల్‌లో ఎదురవుతున్న ప్రతిఘటన ఈజిప్టు, ఇతర ఉత్తర ఆఫ్రికా దేశాల్లో ఉన్నంత బలమైనది కాదు. ఉత్తరాఫ్రికా దేశాల్లో గత రెండు దశాబ్దాలుగా ఆహార కొరతకు వ్యతిరేకంగా పదే పదే జరిగిన తిరుగుబాట్లు తాజా ఉద్యమాలకు అవసరమైన పునాదులు వేశాయి. ఆహారపు ధరలు అనూహ్యస్థాయికి పెరిగాయి. అయితే ఈ పెరుగుదల వెనుక అవినీతిని కూడా ప్రజలు చూస్తున్నారు.

కైరోలో అరబ్ ప్రజలు తొలి తిరుగుబాటు బావుటా ఎగరవేసినప్పుడు నాకు 1848 నాటి పారిస్ కమ్యూన్ మదిలో మెదిలింది. 1848 నాటి పారిస్, సమకాలీన కైరో నగరాల మధ్య ఆసక్తి కరమైన పోలిక ఉంది. 1848 తిరుగుబాటులో ప్రజలు లూయిస్ ఫిలిప్‌ను గద్దె దించాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నది సాధించారు. అవి 1848 ఫిబ్రవరి రోజులు. అలనాటి పారిస్‌తో సరితూగగలిగిన పరిణామం 2011 జనవరి 25 నాటి కైరో ప్రజల తిరుగుబాటు. ఈ తిరుగుబాటులో దేశాధ్యక్షుడు ముబారక్ గద్దె దిగాడు. 1848 జూన్ నాటికి కార్మికుల తిరుగుబాటును అణచివేసి సైన్యం తిరిగి పారిస్‌ను కైవసం చేసుకున్నది. పారిస్ తిరుగుబాటు సమయంలో ప్రజలను అణచివేసే నైపుణ్యాన్ని పారిస్ సైన్యం అల్జీరియాలో సంపాదించింది. అప్పటికి అల్జీరియా ఫ్రెంచి వలసగా వుండేది. బౌలెవాయార్డుల్లో ప్రజలను నిర్ధాక్షిణ్యంగా కాల్చి చంపేవారు. అంతటితో నిరసనలు ఆగిపోయేవి. 2013 జూన్ తర్వాత ఈజిప్టులో సైన్యం తన అధికారాన్ని పునఃస్థాపించింది. అయితే కైరోలో జరిగింది సోషలిస్టు విప్లవం కాదు. అవినీతి, అసమానం అంతమొందించి బూర్జువా ప్రజాతంత్ర రాజ్యస్థాపనకోసం సాగిన ఉద్యమం అది. ఈ పోలిక ఎంతవరకు సమంజసమో తెలీదు.

కైరోలో శక్తుల పొందిక కూడా స్పష్టమే. ఇస్తాంబుల్‌లో కార్మికుల పోరాటానికీ, కైరో తిరుగుబాటుకూ మధ్య సామ్యం వుంది. ఈ ఉద్యమంలో కార్మికులూ, అసంతృప్తితో వున్న యువత, అవినీతి, అసమానతలు అధిక ధరలతో విసిగిపోయిన నగర ప్రజలూ భాగస్వాములయ్యారు. నిరంకుశంగా వ్యవహరించే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రెండు దేశాల్లోనూ వివిధ వర్గాల మధ్య ఉద్యమ ఐక్యత వ్యక్తమయ్యింది. కానీ ఈ రెండు ఉద్యమాలు అసమ్మతి ప్రాతిపదికన మొదలైన ఆందోళనలు తప్ప సోషలిస్టు విప్లవాలు కావు.

ఇస్తాంబుల్ పరిణామాలకూ, ఆనాటి పారిస్ సంఘటనలకూ అత్యంత దగ్గరి పోలిక వుంది. ఇస్తాంబుల్ నగరం నిరసనలకు కేంద్రంగా వుండడం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేదు. పట్టణీకరణకు ప్రభుత్వం అనుకూలంగా వున్నా అక్కడ నివసించే ప్రజలంటే మాత్రం గిట్టదు.

**ప్రశ్న:** కానీ టర్కీ ప్రధాని ఎర్డోగన్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని, ఈజిప్టు అధ్యక్షుడు ముబారక్ వ్యతిరేరక ఉద్యమంతో ఎలా పోల్చగలం?

**హార్వే:** రెండు దేశాల్లోనూ పతాకస్థాయికి చేరిన అవినీతికీ, నిరంకుశత్వానికీ వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించారు. అవినీతిపై ఆధారపడ్డ ప్రభుత్వాలు ఇవి. అమెరికాలో అవినీతి లేదు అని అనటం లేదు. తేడా ఏమిటంటే అమెరికాలో అవినీతి చట్టబద్ధం చేయబడింది.

**ప్రశ్న:** వాల్‌స్ట్రీట్ ఆక్రమణ, అరబ్ తిరుగుబాట్ల మధ్య పోలికల గురించి చర్చ జరుగుతోంది. అరబ్ తిరుగుబాట్లు, వాల్‌స్ట్రీట్ ఆక్రమణ ఆందోళనకు ప్రేరణ అన్న వాదన ఉన్నప్పటికీ రెండింటి మధ్య చాలా వ్యత్యాసాలున్నాయి. రెండు ప్రాంతాల్లో వున్న సామాజిక అంతరాల నేపథ్యంలో ఈ రెండు ఉద్యమాల మధ్య వ్యత్యాసాల గురించి మీరేమంటారు?

**హార్వే:** అరబ్ తిరుగుబాట్లలో ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమ ధోరణులన్నీ ఐక్యం అయ్యాయి. దాంతో అవి ప్రజాకర్షక ఉద్యమంగా మారాయి. వాల్‌స్ట్రీట్ ఆక్రమణ గురించి అంతగా తెలీదు. నేను అమెరికా వదిలిన పది రోజుల తర్వాత ఆందోళన మొదలైంది.

రెండు ఉద్యమాల్లో పాల్గొన్న శక్తులను పరిశీలిస్తే తెహరీర్ స్క్వేర్, గాజి పార్కుల్లో పాల్గొన్న ప్రజల్లో ఉన్న వైవిధ్యం వాల్‌స్ట్రీట్ ఆక్రమణ ఉద్యమ భాగస్వాముల్లో లేదు. వాల్‌స్ట్రీట్ ఉద్యమం సైద్ధాంతికంగా బలమైన భావాలున్న కొద్దిమంది 'అరాచకవాదులు' ప్రారంభించిన ఉద్యమం. 99% మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్నా అది చాలా పరిమితమైన ఉద్యమం. కొన్ని విప్లవాత్మక, తీవ్రవాద డిమాండ్లు ముందుకు తెచ్చిన ఉద్యమం.

వాల్‌స్ట్రీట్ ఉద్యమం సైద్ధాంతికంగా చూసినప్పుడు ఆసక్తికరమైన ఉద్యమం. వారు ఉద్యమానికి నాయకత్వాన్ని అంగీకరించరు. కానీ వారు నాయకులు. ఇది ఒక వైరుధ్యం. ఉద్యమ దశ, దిశల గురించి వారిలోనే చాలా భిన్నాభిప్రాయాలు వున్నాయి. కొన్ని విధి విధానాలు రూపొందించుకున్నారు. అన్ని సామాంతరంగానే వుండాలి అన్నది వారి అభిప్రాయం. ఈ ఉద్యమం ఏదో ఒకటి సాధించగలగుతుంది అన్న నమ్మకం కలగటానికి అరబ్ తిరుగుబాట్లు ప్రేరణ  అయి వుండవచ్చు. ఏదో ఒక కేంద్రం చుట్టూ ఉద్యమం జరగడం ఈ ఉద్యమాల్లో ప్రధాన మైన అంశం. రాజకీయ క్రీయాశీలతకు 'కేంద్రీకృతం' కీలకాంశమని  హెన్రీ విసబ్‌వెరి వ్యాఖ్యానించాడు. రెండు ఉద్యమాల్లో దేశీ చిహ్నాలను ఆక్రమించుకోవడం ముఖ్యమైన భాగంగా వుంది. అయితే రెండు ఉద్యమాల్లో పాల్గొన్నవారి సంఖ్యను గమనిస్తే అరబ్ తిరుగుబాటులో ఉన్నంత ప్రజల భాగస్వామ్యం వాల్‌స్ట్రీట్‌లో లేదు.

సామాజిక భద్రత గురించి రెండు ఉద్యమాలూ ప్రాధాన్యతనిచ్చాయి. వాల్‌స్ట్రీట్ ఉద్యమంలో పాల్గొన్నది చిన్న సమూహమే అయినా అమెరికాలో రాజకీయ చర్చల వాతావరణం మార్చటానికి అది దోహదపడింది. వారు, సామాజిక అంతరాలపై చర్చను ప్రభుత్వ స్థాయికి తీసుకెళ్ళగలిగారు. వాల్‌స్ట్రీట్ ఉద్యమానికి పూర్వం అమెరికాలో ఆ చర్చ లేదు. సామాజిక అంతరాల గురించిన చర్చ కారణంగానే ఒబామా రెండోసారి ఎన్నిక సాధ్యం అయ్యింది. న్యూయార్క్ సిటీ మేయర్‌గా మొదటి సారిగా శతకోటీశ్వరులు కాని ఒక సామాన్యుడు, బిల్ డి బ్లాసియో ఎన్నికయ్యారు. ఆయన తన ఎన్నికల ప్రచారంలో రెండు న్యూయార్క్‌లున్నాయని చెప్పారు. ఒకటి సంపన్నుల నగరం, రెండోది దారిద్ర్య న్యూయార్క్. తను సామాజిక అంతరాలను తొలగిస్తానని ఇంటర్వ్యూలో చెప్పారు. దాంతో ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు. ఆ విధంగా సామాజిక అంతరాలను రాజకీయ చర్చనీయాంశంగా మార్చటంలో వాల్‌స్ట్రీట్ ఉద్యమం ప్రశంసనీయమైన పాత్ర  పోషించింది.

**ప్రశ్న:** ఒక ఉద్యమంగా వాల్‌స్ట్రీట్ ఉద్యమం నిర్దేశిత లక్ష్య సాధనలో విఫలం అయ్యింది అన్న అభిప్రాయం వుంది. కానీ మీ స్పందన అందుకు భిన్నంగా వుంది. కొన్ని కీలక అంశాలు చర్చకు తేగలిగింది ఈ ఉద్యమం అంటున్నారు.

**హార్వే:** అవును ఈ ఉద్యమ ప్రభావం గణనీయంగా వుంది. అయితే అది వారు ఆశించిన రీతిలో కాదు. నగరానికి సంబంధించి మరిన్ని సమూల మార్పులు తీసుకురావాలని వాల్‌స్ట్రీట్ ఉద్యమం కోరుకున్నది. అన్నిచోట్లా అనార్కిస్టు తరహా కమ్యూన్‌లు ఏర్పాటు చేయాలని ఆశించింది. ఆసక్తికరమయిన విషయమేమంటే వాల్‌స్ట్రీట్ ఉద్యమం ఆగిపోలేదు. నివాస ప్రాంతాల్లో ఇంకా క్రియాశీలకంగానే వుంది.



**ఈజిప్టు రాజధాని కైరోలో నిరసన ప్రదర్శనలు**

ఇంతకీ తుపాను వచ్చినప్పుడు తొలుత స్పందించింది వీళ్ళే. రెడ్‌క్రాస్ వంటి సంస్థల కంటే వేగంగా స్పందించగలిగారు కనుకనే మీడియాలో సైతం మంచి స్పందన వచ్చింది.

అంతా అయిపోయిందని అనటాన్ని నేను అంగీకరించను. వాళ్లను జుకొట్టి పార్కునుండి తొలగించడం రాజకీయంగా చర్చనీయాంశం కాకపోయి వుండవచ్చు. నివాస ప్రాంతాలకు వెళ్ళాక వాళ్ళు ఏం చేస్తారన్నది ఎవరూ చూడరు. అక్కడ వాళ్ళు క్రియాశీలంగానే వున్నారు.

**ప్రశ్న:** రానున్న సామాజిక ఉద్యమాలకు ప్రస్తుత ఉద్యమాలు సూచికలుగా చెప్పవచ్చా? ఎందుకంటే, ప్రజలను వీధుల్లోనుండి తరిమేసిన తరువాత ఉద్యమం అంతమైంది. కానీ వాల్‌స్ట్రీట్ ఉద్యమాన్ని చెదరగొట్టినప్పటికీ వారి కృషి న్యూయార్క్ వంటి నగరాల్లో రాజకీయాలను ప్రభావితం చేసిందని మీరు చెబుతున్నారు కదా!

**హార్వే:** రాజకీయాలంటేనే చాలా వరకు ప్రతీకలు. అవి వ్యవస్థీకృతంగా విజయాలు సాధించలేకపోయినప్పటికీ, ప్రతీకారత్మకంగా విజయాలు సాధిస్తాయి. ఈ ప్రతీకాత్మక విజయాలు చాలా ముఖ్యమైనవి. వ్యక్తీకరణ విషయంలో వాల్‌స్ట్రీట్ ఉద్యమం కొంత విజయం సాధించింది. నిర్మాణపరంగా చూస్తే సాధించిన విజయం పరిమితమే. నగరంలో పిల్లలందరికీ శిశు సంరక్షణ కేంద్రాలు (మనదేశంలో అంగన్‌వాడీ తరహా) ఏర్పాటుకుగాను ధనవంతుల మీద సర్‌ఛార్జి వేస్తామని కొత్త మేయర్ హామీ ఇచ్చారు. వాల్‌స్ట్రీట్ ఉద్యమం

వంటి ఉద్యమాలు లేకపోతే మేయర్ అభ్యర్థి అటువంటి నిర్ణయం ప్రకటించి వుండేవాడని అనుకోవటం లేదు.

**ప్రశ్న:** వాల్‌స్ట్రీట్ సహా పశ్చిమ ఆసియా, మధ్య ప్రాచ్యంలో జరిగిన అనేక ఉద్యమాలు బహిరంగ ప్రదేశాలను ఆక్రమించుకోవటం నిరసన మార్గాలుగా ఎంచుకున్నాయి. ఈ తరహా ఎత్తుగడలు రానున్న కాలంలో రాజకీయాలను ఎలా ప్రభావితం చేయనున్నాయి? ఈ ఎత్తుగడలకు గల పరిమితులు ఏమిటి?

**హార్వే:** ఈ ఉద్యమాలు ఆక్రమించుకున్న బహిరంగ ప్రదేశాలు చాలా ముఖ్యమైనవి. ఈ ప్రదేశాలు ఆక్రమించుకుంటే వచ్చే ప్రజాకర్షణ ఇతర పద్ధతులు అనుసరించినప్పుడు రాదు. రాజకీయాలు వ్యక్తీకరణతో నిండి వుంటాయి. ఆరకంగా చూసినప్పుడు ఈ ఉద్యమాలు ముందుకు తెచ్చిన వ్యక్తీకరణలు విజయం సాధించినట్లే.

వాల్‌స్ట్రీట్ ఉద్యమం ముందుకు తెచ్చిన ఒక ముఖ్య సమస్య బహిరంగ ప్రదేశాలు ఉమ్మడి రాజకీయ ఆస్తిగా ఎంతవరకు ఉండాలి అన్న చర్చ. మనచుట్టూ బహిరంగ ప్రదేశం చాలా వుంది. కానీ అది మనకు అందుబాటులో లేదు. బహిరంగ ప్రదేశం నేడు నియంత్రితం అవుతోంది. ఆ నియంత్రణ అన్నది ప్రజావసరాల కోసం కాదు. ఈ ఉద్యమాలు ముందుకు తెచ్చిన ప్రశ్న ఉమ్మడి ప్రదేశాల గురించి అందరూ సమావేశం కాగలిగిన ఉమ్మడి బహిరంగ ప్రదేశమేమిటి అన్న ప్రశ్న.

వాల్‌స్ట్రీట్ ఉద్యమం ముందుకు తెచ్చిన మరో ప్రశ్న పోలీసులు ఎంత త్వరగా దమనకాండకు దిగుతారు అన్న అంశం. మితవాద శక్తులు కూడా టీ పార్టీ పెడుతూ ఇటువంటి ఆందోళనకు దిగాయి. గతవారం టీపార్టీ ఆందోళనకారులు వాషింగ్టన్‌లోని రెండో ప్రపంచయుద్ధ స్మారక చిహ్నం ముందున్న బారికేడ్లు తొలగించి అధ్యక్ష భవనం ముందు కుప్పపోశారు. పోలీసులు ఏమాత్రమూ పట్టించుకోలేదు. కానీ వాల్‌స్ట్రీట్ ఉద్యమకారులు న్యూయార్క్‌లోని జుకొట్టి పార్క్‌లో ఒక్క అడుగు ముందుకు వేసినా పోలీసులు వెంటనే అరెస్టు చేసేవారు. ఈ వైరుధ్యం ప్రజల దృష్టికి వస్తోంది. అందువల్ల భావవ్యక్తీకరణ అంశాల గురించిన పోరాటం, వామపక్ష ఎత్తుగడల్లో అంతర్భాగం.

**ప్రశ్న:** మార్క్సిస్టు భౌగోళిక శాస్త్రవేత్తల దృష్టిలో పట్టణ ప్రాంత ఉత్పత్తి పరిస్థితులలో (పెట్టుబడిదారీ, నయా-ఉదారవాద వగైరాల్లో) మార్పులు సామాజిక న్యాయానికి అనివార్యం. కానీ ఇతర అనేకమంది సిద్ధాంతకర్తలు, కార్యకర్తలు పని ప్రదేశాల్లో పోరాటాల మీద కేంద్రీకరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వాల్‌స్ట్రీట్ ఉద్యమం, అరబ్ తిరుగుబాట్లు పట్టణ ప్రాంత పరిస్థితుల మీద దృష్టి మళ్ళించే పోరాటాలు కాగలవని మీరు విశ్వసిస్తున్నారా?

**హార్వే:** ఈ రెండు అంశాలు కలిపి చెప్పారు. నగరజీవన పరిస్థితుల్లో మార్పు లేకుండా ఉత్పత్తి రంగంలో మార్పులు తెస్తే ఆ మార్పులు ఏం సాధించాయి అని ప్రశ్నించుకోవాల్సిన సమయం వస్తుంది. ప్రజలు సరైన నివాసాలు లేకుండా, మురికి కూపాల్లో నివసిస్తుంటే, ఉద్యోగాలున్నప్పటికీ సరైన ఇళ్లు లేకుండా బాధపడుతుంటే ..అటువంటప్పుడు ఉత్పత్తి రంగంలో ఎన్ని విజయాలు సాధించినా అక్కరకు రావు. నేడు ఈ సమస్యలు ముందుకొస్తున్నాయి. డెట్రాయిట్ పతనం చూశాము. మన పోరాటాల్లో ఇది కీలక అంశం. కానీ పలువురు ఐక్య ఉద్యమాల గురించి మాట్లాడేటప్పుడు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కల్గిస్తుంది.

బ్రిటన్‌లో సోషలిస్టు వర్కర్స్ పార్టీ సిద్ధాంతపరంగా శక్తివంతం అయిన పార్టీ. యూరప్‌లోని వామపక్ష పార్టీల్లో బలమైన పార్టీ. అయితే అది ఫ్యాక్టరీ కార్మికుల పునాదిగా వుంది. కానీ ఆ పార్టీ ఈ మధ్య కాలంలో ఎన్నికల పన్ను, ఇతర పట్టణ ప్రాంత సమస్యపై జయప్రదంగా ఉద్యమించింది. ఒకనాడు మార్గరెట్ థాచర్‌ని గద్దె దింపిన సమస్య అది. ఆ మేరకు ఆ పార్టీ రాజకీయాల్లో శక్తివంతం అయిన పాత్ర పోషిస్తోంది. అలా ఎదగటానికి ఆ పార్టీకి సహకరించిన అంశం స్థానిక ప్రభుత్వ నిధులకు సంబంధించిన అంశం.

1918లో గ్రాంసీ ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. ఆయన కార్మిక మండళ్లకు గట్టిగా మద్దతిచ్చిన వ్యక్తి. ఆయనేమన్నాడంటే... కార్మిక మండళ్లు తమ పనిప్రదేశంలో జరుగుతున్న పని గురించి మాత్రమే ఆసక్తి చూపుతున్నాయి. కానీ కార్మిక మండళ్లకు తోడు నివాస ప్రాంతాల సంస్థలను కూడా నిర్మించడం అవసరం. ఎందుకంటే నివాస ప్రాంత సంస్థల్లో నగరాలను ఊడ్చేవారు, రవాణా కార్మికులు, బ్యాంకు క్లర్కులు, ఇతరులనేకమంది ఉంటారు. తమ పనిప్రదేశంలోని కార్మిక సమస్యలు మాత్రమే తెలిసే కార్మిక మండళ్లకన్నా కూడా ఈ మొత్తం కలిసి పనిచేస్తే నగరాల్లో పరిస్థితులు మొత్తంగా అవగాహన అవుతాయి. గ్రాంసీ "ఈ రెండు రకాల సంఘాలను కలిపి పని చేయించాలి" అన్నారు. దీక్షాకాలంగా నేను పాటిస్తున్న రాజకీయాలు అవే. కానీ నేను ఇప్పుడు పట్టణాలను గురించి ఎక్కువ వక్కాణిస్తున్నాను ఎందుకంటే మార్క్సిస్టు, సోషలిస్టు ఉద్యమాల్లోని నా వామపక్ష సహచరుల్లో చాలామంది నగరాల్లోని మొత్తం కార్మికవర్గంపై కేంద్రీకరించకుండా ఉత్పత్తిపైనా, కార్మికోద్యమాలపైనా కేంద్రీకరిస్తున్నారు.

**ప్రశ్న:** హెన్రీ లిఫెబ్రే, మీరూ, ఇతర మార్క్సిస్టు మేధావులూ పట్టణాలు ఏవిధంగా పెట్టుబడి సమీకరణ సాధనాలుగా వున్నాయో చర్చించారు. ప్రధానంగా విపరీతంగా పెరుగుతున్న భూమి, ఇళ్ల ధరలు పెరగడం ద్వారా ఒకవైపు పెట్టుబడి సమీకరణ జరుగుతుంటే, మరోవైపు కార్మికవర్గాన్ని బయటకు, మురికి కూపాలవైపు నెడుతున్న పరిస్థితి సృష్టించాయి. అటువంటి పరిసరాలున్న పరిస్థితులు సామాజిక ఉద్యమాలకు ఎంతవరకు, ఎలా తోడ్పడగలవు?

**హార్వే:** పెట్టుబడి సమీకరణ సాధనాలు కాకున్నా నగరాలు లాభాల వసూలు కేంద్రాలుగా వున్నాయి. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్నట్లు రెండు పోరాట ధోరణులను ఏకీకృతం చేయాల్సిన అవసరం వుంది. నా అభిప్రాయం, విసబ్ రే, ఇతరుల అభిప్రాయం ప్రకారం పెట్టుబడి మరో వలయం ద్వారా నగర భవన సముదాయాల్లో ప్రవేశిస్తోంది. ఫ్యాక్టరీలో వస్తువుల తయారీ ఎంత ప్రాధాన్యత కలిగినదో నగర నిర్మాణం కూడా అంతే ప్రాధాన్యత కలిగిన అంశం. నగరాన్ని ఎవరు నిర్మిస్తున్నారు... ఎలా నిర్మిస్తున్నారు... అన్న విషయాలు మనం పరిశీలించడం లేదు. ఈ రోజుల్లో కార్మికులు అంటే తాత్కాలిక కార్మికులే. నిలకడలేనివారు. వాళ్ళను సమీకరించటం క్లిష్టమైన పనే. ఫ్యాక్టరీల్లో పనిచేసే శాశ్వత కార్మికులు తగ్గిపోతున్నారు కాబట్టి "కార్మికవర్గం ఎక్కువ వుంది?" అని కొందరు అడుగుతున్నారు. పట్టణ జీవితాన్ని ఉత్పత్తి, పునరుత్పత్తి చేసే వారంతా కార్మికులేనన్న భావనను రూపొందించడం ద్వారా వారికి మనం సమాధానం చెప్పాలి.

**ప్రశ్న:** కార్యకర్తలకు మీరింకేమైనా చెబుతారా?

**హార్వే:** చెప్పను. స్థానికంగా పనిచేస్తున్న కార్యకర్తలకు వారి స్థానిక పరిస్థితులపై సలహాలివ్వకూడదని నియమం పెట్టుకున్నాను. ఎందుకంటే వారేం చేస్తున్నారో వారికి నాకంటే ఎక్కువ తెలుస్తుంది.

**(అనువాదం: కొండూరి వీరయ్య)**

గ్రంథ పరిచయం

# ప్రయివేటీకరణకు ప్రత్యామ్నాయాలున్నాయి




**గ్రంథ రచయితలు: డేవిడ్.ఎ.మెక్డ్‌నాల్డ్ & గ్రెగ్ రూయిటర్స్**

**పరిచయం: సి.టి. కొరియన్**

ప్రైవేటీకరణకు ప్రత్యామ్నాయంగా ప్రపంచవ్యాప్తంగా అమలు జరుగుతున్న విధానాల తీరుతెన్నులపై పరిశోధనాత్మకంగా విశ్లేషించి వ్రాసిన పుస్తకమిది. ప్రైవేటీకరణకు ప్రత్యామ్నాయం లేదు అనే సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేయడానికి ఇందులో అనేక ఉదాహరణలున్నాయి.

"ప్రైవేటీకరణకు ప్రత్నామ్నాయం లేదు" (టీనా) అనే సిద్ధాంతం, నయా-ఉదారవాద భక్తులు శ్రద్ధగా, ఓపిగ్గా ప్రచారం చేసే ఒక భ్రమ లేదా మిధ్య. ప్రైవేటీకరణ సిద్ధాంత ప్రచార్భాటాలలో ముఖ్యమైన అంశం ఏమిటంటే మార్కెట్ ఆధారిత ఆర్థిక చట్రాన్ని మించింది వేరొకటి లేదని. అసలు అలాంటి దాన్ని ఆలోచించలేమని. ప్రైవేటీకరణ ఆర్థిక సూత్రాల తర్కంలో ఇమిడి ఉన్న మూలాధారం దానికీ, పెట్టుబడిదారీ విధానానికీ ఉన్న సంబంధమే. దీని వల్లనే పెట్టుబడిదారీ విధానం ఒక్కటే సామాజిక, ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వగలదనీ, అందు వల్లనే ప్రజాస్వామ్య వ్యవస్థ విరసిల్లుతున్నదనీ ప్రకటించుకుంటారు.

20వ శతాబ్ధం రెండవ భాగంలో అనేక మంది పెట్టుబడిదారీ పండితులు తమ రచనల్లో వ్యక్తి స్వేచ్ఛకూ, మార్కెట్ శక్తులకూ, పెట్టుబడిదారీ వ్యవస్థకూ మధ్య ఉన్న సంబంధాలు వ్యాపింపచేసేలా పుంఖాలు పుంఖాలుగా రచనలు చేశారు. ఆ కాలంలోని సిద్ధాంత సాహిత్యం, అనేక రకాల సరుకుల్లో కొన్నిటిని "ప్రజా సరుకులాగా" గుర్తించింది. ఉదాహరణకు వీధి దీపాలు. వీటి నిర్వహణకు మార్కెట్ వెల కట్టటం అసాధ్యం కాబట్టి, ఎందుకంటే ఏ ఒక్కరో దాని ఉపయోగం నాకే చెందుతుందని చెప్పరు కాబట్టి, అది తనతోపాటు ఇతరులందరికీ ఉపయోగ పడుతుంది కాబట్టి. అటువంటి సరుకులనే "ప్రజా సరుకులని", చెప్పారు. వాటిని ప్రభుత్వమే అందించాలనీ, వాటికి అయ్యే ఖర్చును పన్నుల ద్వారా రాబట్టవచ్చనీ పేర్కొన్నారు. మిగిలిన వాటన్నిటినీ ప్రయివేటు పరం చేయవచ్చునని సిద్ధాంతీకరించారు. ఆ విధంగా ప్రయివేటీకరణలో కూడా ప్రభుత్వ పాత్ర ఉండాల్సిన అవసరాన్ని వారు చెప్పారు. 1930 దశకంలో వచ్చిన మహా మాంద్యం కూడా రాజ్యానికి కాపలాదారుని పాత్ర అవసరం ఉందని ఋజువు చేసింది. దానికి కావాల్సిన సిద్ధాంతాన్ని (సంక్షేమ రాజ్యం) బ్రిటీష్ ఆర్థికవేత్త జాన్ మెనార్డ్ కీన్స్ అందించారు. ఈ రాజ్యం పాత్ర ఎంత ముఖ్యమో, అవసరమో మొన్న 2008లో అమెరికాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం, తదనంతర పరిణామాలు ఋజువు చేశాయి. స్వేచ్ఛా మార్కెట్ భక్తి పరాయణులు తెలివిగా ఈ అంశాలన్నీ పక్కన పెట్టేసి, ప్రైవేటీకరణ బాకాను ఊదుతూనే ఉంటారు.

సమకాలీన సమాజంలో ప్రైవేటీకరణను వేగంగా ముందుకు తీసుకుపోడానికి కొన్ని అవసరాలు గుర్తించారు. వాటిలో ఒకటి ఆర్థిక కార్యకలాపాల నుండి రాజ్యం పూర్తిగా వైదొలగడం. ఆర్థిక కార్యకలాపాలను స్పెక్యులేటివ్ జూదగాళ్లకు, మరీ ప్రత్యేకించి అతి పెద్ద సంస్థలైన బహుళజాతి సంస్థలకు వదిలి, వాటి ద్వారా సరుకులు, సేవలను కూడా వినియోగదారులకు అందింటం. ఏది ఏమైనప్పటికీ ఆర్థిక చట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పాత్రలపై మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరముంది.

ఆరోగ్య సేవలను పరిశీలిద్దాం. ప్రభుత్వం, కార్పోరేట్ సంస్థలు మాత్రమే కాకుండా, ఆరోగ్య రక్షణలో ఇతరులు కూడా మన దేశంలో సేవలనందిస్తున్నారు. మిషనరీలు, ఛారిటబుల్ ట్రస్టులు వంటివి. ఇవి మాత్రమే అనుకుంటే సరిపోదు. స్థానిక కమ్యూనిటీల ద్వారా కూడా ఆరోగ్య రక్షణ అందించబడుతోంది. వాటినే స్వచ్ఛంద సంస్థలు అంటారు (యన్.జి.ఓలు). 'ప్రభుత్వ సంస్థలు'గా చెప్పబడుతున్నవి కూడా రకరకాల పద్ధతులలో నడవవచ్చు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలచే నియంత్రింపబడతాయి, కొన్ని ప్రభుత్వ కార్పోరేషన్‌లుగా పని

**❝ సేవలనందించడానికి రకరకాల లక్ష్యాలు లేదా పద్ధతులు ఉన్నప్పుడు వాటిని సాధించేందుకు వివిధ రకాల సంస్థలను కూడా ఉపయోగించుకోవచ్చు అన్న విషయాన్ని అందరూ అంగీకరించాలి. ఈ కోణంలో చూస్తే కేవలం రాజ్యం పాత్ర మాత్రమే చాలదు. ప్రభుత్వానికి సంబంధించిన అనేక శాఖలు నేరుగా ఈ సేవలందించవచ్చు, లేదా వారే వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయవచ్చు. అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా సేవలను అందిస్తున్నాయి.❞**

చేస్తాయి. ఉదాహరణకు విద్యుత్తు సరఫరా సేవలు. అనేక రకాల ఏజెన్సీల సమన్వయంతో నడిచే ఇటువంటి వాటిలో, ఇతర అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరముంటుంది. ముఖ్యంగా అవి ఏ ప్రేరణతో ఈ సేవలను అందిస్తున్నయో అర్థం చేసుకోవాలి. ఇక్కడే కార్పోరేట్ సంస్థల ప్రత్యేక లక్షణం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. వాటి అంతిమ లక్ష్యం లాభమే. కాని ప్రభుత్వ సంస్థలకు ప్రేరణ, లక్ష్యాలను అంత స్పష్టంగా పేర్కొనలేం. వాటికీ కొన్ని లక్ష్యాలూ, ఆశయాలు ఉంటాయని సాధారణంగా అందరూ అంగీకరించేదే. అయితే వాటి లక్ష్యాల్లో కొన్ని అస్పష్టంగా అగుపిస్తాయి. వాటిని విస్మరించలేము.

ఈ పరిశోధనాత్మక గ్రంథంలో ఒక ముఖ్యమైన భాగమేమంటే, ప్రైవేటీకరణకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించటానికి ఈ అస్పష్ట అంశాలను వినియోగించటం. గ్రంథ రచయితలు సమాచారాన్ని (27 సంపుటికలు) ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి సేకరించారు. మొదటిగా వారు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండ దేశాల్లో ఆరోగ్యం, మంచినీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు వంటి వాటిని ప్రజలకు అందిస్తున్న తీరునూ, వాటికి వినియోగిస్తున్న పద్ధతులనూ పరిశీలించి, ఈ సేవలన్నిటిపై పరిశోధన జరపటానికి ఒక సాధారణ సూత్రాన్ని రూపకల్పన చేశారు. ఇలా తాము చేసిందంతా ఒక రకమైన మ్యాపింగ్ చేయడం మాత్రమేనని వారు పేర్కొన్నారు. ఇలా చేయడం ద్వారా మనకు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా, విద్యుత్, ఆరోగ్యం తదితర రంగాల్లో ప్రయివేటీకరణకు ప్రత్యామ్నాయాలు ఏమి అమలు జరుగుతున్నాయో తెలుసుకోవడం సాధ్యపడుతుంది.

పై కృషి వల్ల వివిధ సేవల ప్రయివేటీకరణలో ఆయా సేవలు ఎంతవరకు సరుకులుగా మారాయో, ఎంతవరకు ప్రజా సేవలుగా ఉన్నాయో స్పష్టం అయిపోతుంది. ఎందుకంటే లాభాల కోసమే ఉన్న సంస్థలు ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య కార్పోరేషన్లు సేవలను వ్యాపారపు సరుకుగానే చూస్తాయి. మరోపక్క రాజ్యం, దాని సంస్థలు ఈ సేవలను ప్రజలకు అందించటమే లక్ష్యంగా పనిచేస్తాయి. ముఖ్యంగా ఆరోగ్య రక్షణలో కేవలం వాటిని కొనగలిగే వారికి మాత్రమే కాకుండా, మొత్తం ప్రజలందరికీ కొనుగోలు శక్తితో సంబంధం లేకుండా అందించటం ప్రభుత్వం, దాని సంస్థల లక్ష్యంగా ఉంటుంది. ప్రభుత్వ సంస్థలుకు అదనపు సౌకర్యాలు అందించే గుణం కూడా ఉంటుంది. ఉదాహరణకు రాజ్యం కేవలం సేవలను అందించడానికే ఉన్న సంస్థలా కాకుండా, ప్రజలలో ఐక్యమత్యాన్ని పెంచుతుంది. అంటే ప్రజల మధ్య సమాంతర సంబంధాలను నెలకొల్పుతుంది. రాజ్యం ఒక సేవలందించే సంస్థగానే కాకుండా ప్రజలు నేరుగా ఆ బాధ్యతలను కూడా అంగీకరించే విధంగా స్థానిక స్వయం సహాయక బృందాల ద్వారా సాధిస్తుంది. రాజ్యం మరో అడుగు ముందుకేసి ఆరోగ్యాన్ని మానవ హక్కుగా గుర్తించింది (1978లో జరిగిన ఆల్మా – అటా డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా). అందువల్ల ప్రభుత్వం తన బాధ్యతగా ప్రజలందరికి ఆరోగ్యాన్నీ, సేవలనూ అందించటానికి అంగీకరిస్తుంది. ఈ రకంగా హక్కుల ఆధారిత పద్ధతుల ఆచరణకు ఊతమిచ్చే విధంగా యునైటెడ్ నేషన్ జనరల్ అసెంబ్లీ 2010లో ప్రపంచ దేశాలన్నింటినీ, అంతర్జాతీయ సంస్థలనూ ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందుబాటులో ఉంచాలనీ, వారి కొనుగోలు శక్తికి తగ్గట్లు అందించాలనీ, పారిశుద్ధ్యం అందించటంలోను వారు చేస్తున్న కృషిని మరింత ఉధృతం చేయాలనీ పిలుపునిచ్చింది (ఆదాయాలు తక్కువగా ఉన్నప్పటికీ).

ఈ రకంగా, సేవలను అందించడానికి రకరకాల లక్ష్యాలు లేదా పద్ధతులు ఉన్నప్పుడు వాటిని సాధించేందుకు వివిధ రకాల సంస్థలను కూడా ఉపయోగించుకోవచ్చు అన్న విషయాన్ని అందరూ అంగీకరించాలి. ఈ కోణంలో చూస్తే కేవలం రాజ్యం పాత్ర మాత్రమే చాలదు. ప్రభుత్వానికి సంబంధించిన అనేక శాఖలు నేరుగా ఈ సేవలనందించవచ్చు, లేదా వారే వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయవచ్చు. అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా సేవలను అందిస్తున్నాయి. అందులో ఎక్కువ శాతం లాభార్జన అంశం లేకుండానే అందిస్తున్నాయి. ఇవేకాక స్థానిక సంస్థలు, లేదా స్వయం సహాయక బృందాలు కూడా ఉన్నాయి. ఈ స్థితిగతులను గమనించిన తరువాత, ఈ గ్రంథంలో పరిశోధకులు సూచించినదాని ప్రకారం లాభార్జనే ధ్యేయంగా, సేవలను వ్యాపార సరుకుగా చూసే విధానాన్ని ప్రైవేటీకరణ అని చెప్పదాన్ని మనం న్యాయమైన లేదా సబబైన నిర్వచనంగా గుర్తించవచ్చు. ఈ ప్రకారంగా "వీటిని మనం రెండు తరగతులుగా గుర్తించాలి. 1. లాభార్జన సంస్థలను "ప్రైవేటు" అనీ, 2 లాభార్జన లేని సంస్థలన్నిటినీ ప్రత్యామ్నాయాలుగా పేర్కొనవచ్చును. మన ప్రాథమిక లక్ష్యం కూడా ప్రైవేటీకరణకు ప్రత్నామ్నాయాలు ఉన్నాయని నిర్ధారించడం. అటువంటి ఉన్నతమైన స్వానుభవంతో సేకరించిన సమాచార మూలాలనే ఈ గ్రంథం మనకు అందిస్తుంది.

### క్యూబా అనుభవం

ప్రజారోగ్య సేవలను జాతీయం చేయడం ప్రైవేటీకరణకు సాధారణమైన ప్రత్యామ్నాయం. దీని మీద కొన్ని అపోహలున్నాయి. దానివల్ల ప్రజారోగ్యం నిరంకుశ అధికారవర్గం పరం (బ్యూరోక్రటైజేషన్) అవుతుందేమోనన్నది ఈ అపోహల్లో ఒకటి. కానీ క్యూబా అనుభవం ఈ అపోహ తప్పని తెలుపుతోంది. 1959 విప్లవం తరువాత క్యూబా ప్రభుత్వం తన మొదటి లక్ష్యంగా ప్రజారోగ్యానికి ఒక ప్రభుత్వ సంస్థను స్థాపించి, అందరికీ ఉచితంగా సేవలనందించింది. 1970 దశకంలో ఈ కార్యక్రమాన్ని వికేంద్రీకరించి 14 ప్రావెన్స్‌లు, 169 మున్సిపాలిటీలలో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి అమలు చేశారు. ఒక దశాబ్దం తర్వాత (80 ల నుంచి) కుటుంబ వైద్యుడు, నర్సు అనే పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఈ వైద్య బృందం స్థానిక కమ్యూనిటీలలోనే నివసిస్తూ, అన్ని గృహాలకూ సంచరిస్తూ వైద్య సేవలనూ, ఆరోగ్య విద్యనూ అందించటం ప్రారంభించారు.

1990 తరువాత కాలంలో ఆరోగ్య విద్యలో జాతీయ కౌన్సిల్‌ను స్థాపించి, ఆరోగ్య సేవలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించారు. ఈ శతాబ్దం చివరికొచ్చేసరికి మొత్తం

ప్రజానీకం ఇందులో భాగస్వాములవ్వటం ద్వారా, లాటిన్ అమెరికన్ దేశాలన్నిటికన్నా క్యూబా ఆరోగ్య ప్రామాణికాల్లో ఉన్నత స్థాయిని చేరుకొన్నది.

కమ్యూనిస్టు పాలనలో ఉన్న వియత్నాం కూడా దాదాపు ఇదే విధమైన జాతీయ ఆరోగ్య పథకాన్ని అమలు చేసింది. చైనా కూడా అదే రకమైన విధానాన్ని అమలు చేసింది, కానీ అది మొత్తం ప్రకానీకాన్ని అందుకోలేకపోయింది. అయినా ప్రజారోగ్య ప్రామాణికాలు గణనీయంగా పెంచడంలో తోడ్పడింది. సంస్కరణలు ప్రారంభమైన తరువాత ఈ పథకం దాదాపు మరుగున పడిపోయింది. కాని 2003లో కో–ఆపరేటివ్ వైద్య పథకం పేరుతో ప్రభుత్వం కొంత మేర ఆర్థిక వనరులు సమకూరుస్తూ, సభ్యుల నుండి కూడా సేకరిస్తూ, దాదాపు 80 కోట్ల గ్రామీణ ప్రజానీకానికి ఆరోగ్యాన్ని అందచేస్తోంది. వామపక్ష పథకాలకు ఇవి భిన్నమైనవి.

ఇరాన్‌లో కూడా దాదాపు పరిపూర్ణమైన జాతీయ పథకంతో ఆరోగ్య సేవలందించడానికి ప్రయత్నిస్తున్నారు. 1980–88 ఇరాక్‌తో యుద్ధం జరుగుతున్న కాలంలో, గ్రామీణ ప్రాంతాలలో జనాభా సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో "ఆరోగ్య గృహాలు" అనే పథకం ద్వారా ప్రజలకు వైద్యాన్ని అందించారు. ఆరోగ్య కార్యకర్తలను స్థానిక ప్రజల నుండే ఎంపికచేసి, శిక్షణనిచ్చి, ప్రాథమిక ఆరోగ్య సేవలను వారి ద్వారా అందించారు. అలాగే పట్టణ కేంద్రాలలో ఉన్న ఆధునిక వైద్యశాలలకు అనుసంధాన కర్తలుగా కూడా ఉండేలా చేశారు. ఈ మొత్తం పథకానికయ్యే ఖర్చు కేంద్ర ప్రభుత్వమే భరించింది.

వెనిజులాలో సాంప్రదాయకంగా ప్రజారోగ్య పరిరక్షణ అనేది కేవలం ప్రైవేటు రంగం మీద ఆధారపడి ఉండేది. కాని హ్యూగో ఛావెజ్ అధికారంలోకి వచ్చాక, నూతన రాజ్యాంగంలో ఆరోగ్యం అనేది సామాజిక హక్కుగా గుర్తించి, అది రాజ్యం యొక్క బాధ్యత అనీ, జీవించటానికి ఆరోగ్యం ఒక హక్కుగా రాజ్యం తోడ్పడాలనీ పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్యం అందించటానికి ప్రజా ప్రయోజిత వైద్యశాలలు ప్రారంభించబడ్డాయి. ఈ వైద్యశాల్లోని వైద్య బృందాలు ఇంటింటికీ తిరుగుతూ ఉంటాయి. ప్రజల భాగస్వామ్యం పెంచడానికి ఆరోగ్య కమిటీలు కూడా ఏర్పాటు చేశారు.

ఆసియాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో చాలా పెద్ద ఎత్తున ఆరోగ్య రక్షణనూ, ఆరోగ్య విద్యనూ అందిస్తున్నాయి. మలేసియా, థాయిలాండ్, శ్రీలంకల్లో ఈ సేవలు గణనీయంగా అందిస్తున్నాయి. థాయిలాండ్‌లో అందరికీ ఆరోగ్య రక్షణ పథకాన్ని ప్రభుత్వమే తన ఖర్చుతో కొనసాగిస్తోంది. భారతదేశంలో కూడా ప్రాథమిక ఆరోగ్య రక్షణ కేంద్రాలు, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం ద్వారా సేవలు అందించబడుతున్నాయి. లాటిన్ అమెరికాలో చాలా దేశాలలో ఆరోగ్య భద్రతను అందించేందుకు పరిపూర్ణ సామాజిక రక్షణ పథకాలను రూపొందించారు. ఆఫ్రికాలో ప్రైవేటీకరణకు భిన్నంగా కమ్యూనిటీ ఆధారిత ఇన్సూరెన్స్ పథకం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను సాంప్రదాయ సామాజిక రక్షణ పథకాలలో మినహాయించబడిన ప్రజలందరికి అందిస్తున్నారు. మాలి, సెనెగల్, ఘనా, ఇతర దేశాలలో కూడా ఇటువంటి పథకాలే నడుస్తున్నాయి. ఘనా, నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో యజమానులు, ఉద్యోగులు, కార్మికుల భాగస్వామ్యంతో జాతీయ ఇన్సూరెన్స్ పథకాల ద్వారా ఆరోగ్య రక్షణ అందిస్తున్నాయి. ఆఫ్రికన్ దేశాలలో పలు సేవా సంస్థలు ద్వారా కూడా వైద్య సేవలు అతి తక్కువ ధరలకే అందించబడుతున్నాయి.

ఆసియాలో తాగునీరు, పారిశుద్ధ్యం బాధ్యత ఎక్కువ శాతం రాష్ట్ర ప్రభుత్వాలదే. ఈ సేవలు స్థానిక మున్సిపల్ కార్పోరేషన్ల ద్వారా అందించబడుతున్నాయి. ఈ సేవలు అందించే క్రమంలో ప్రజల భాగస్వామ్యం నెలకొల్పబడి ఎక్కువ శాతం సఫలీకృతమవుతోంది. కొన్ని సందర్భాలలో ప్రజలతో కలిసి లాభార్జన లేని విధంగా, అంటే ఒకటి లేదా ఎక్కువ ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక పంచాయితీలతో, లేదా కమ్యూనిటీ ఆధారిత సంస్థలతో కలిసి పని చేస్తున్నాయి. దీనికి మంచి ఉదాహరణ తమిళనాడులో అమలవుతున్న గ్రామీణ మంచినీటి

**"ఇరాన్‌లో కూడా దాదాపు పరిపూర్ణమైన జాతీయ పథకంతో ఆరోగ్య సేవలందించడానికి ప్రయత్నిస్తున్నారు. 1980-88 ఇరాక్‌తో యుద్ధం జరుగుతున్న కాలంలో, గ్రామీణ ప్రాంతాలలో జనాభా సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో "ఆరోగ్య గృహాలు" అనే పథకం ద్వారా ప్రజలకు వైద్యాన్ని అందించారు. ఆరోగ్య కార్యకర్తలను స్థానిక ప్రజల నుండే ఎంపికచేసి, శిక్షణనిచ్చి, ప్రాథమిక ఆరోగ్య సేవలను వారి ద్వారా అందించారు."**



వైద్య రంగంలో క్యూబా స్పష్టమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపిస్తోంది: హవానాలోని పోలీక్లినిక్‌లో రోగులను చూస్తున్న డాక్టర్

> **"లాటిన్ అమెరికాలో ఒకప్పుడు లాభార్జన ధ్యేయంగా ఉండే విద్యుత్తు రంగ పరిశ్రమలలో నేడు చాలా ప్రాంతాలలో రకరకాల ప్రభుత్వ సంస్థలు, పరిపాలనా వికేంద్రీకరణ, ఆర్థిక వనరుల సేకరణ, పాలనా సౌలభ్యం, యాజమాన్య పద్ధతులన్నిటిలోనూ వినూత్నమైన, విభిన్నమైన అంశాలను కూర్చుకొని పని చేయడం ప్రారంభించాయి."**



క్యూబా మార్గంలో వెనిజులా 'ప్రజావైద్యం'

కార్యక్రమం. దీని కింద ప్రభుత్వ రంగ బోర్డు, స్థానిక కమ్యూనిటీలతో కలసి సంయుక్తంగా మంచినీటి సేవలనూ, దాంతోపాటు వ్యవసాయ నీటి వనరులనూ అందించే విధంగా పని చేస్తున్నాయి. ఇదే విధమైన కార్యక్రమాలు బంగ్లాదేశ్, ఫిలిప్పైన్స్‌లలో కూడా అనుసరిస్తున్నారు. హాంగ్‌కాంగ్ కూడా ఈ మధ్య కాలంలో, త్రాగునీటిని వ్యాపారమయం చేయకుండా ఆపేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

లాటిన్ అమెరికాలో చాలా సంవత్సరాల క్రితం నుంచి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సేవలను రాజ్యాలే బాధ్యత అందించే క్రమం ఉండేది. 1980 ప్రారంభ కాలం నుండి ప్రైవేటీకరణ అనేది ఒక పెద్ద ప్రవాహంలా ప్రవేశించింది. చాలా ప్రైవేటు మంచినీళ్ళ పరిశ్రమలు పట్టణ ప్రాంతాల్లో నివసించే ధనిక ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకొని పెద్ద ఎత్తున ముందుకు వచ్చాయి. వీటికి సిద్ధాంతపరంగా, ఆర్థికంగా మద్ధతునిచ్చే అంతర్జాతీయ సంస్థలు వెనకుండి కథ నడిపించాయి. కాని 90వ దశకం ప్రాంరభం నుండి అనేక సామాజిక ఉద్యమాలు, ఉదా: బొలీవియాలో, ఉరుగ్వేలలో జరిగిన నీరు లేనిదే ప్రాణం లేదు అనే నినాదంతో జరిగిన సంకీర్ణ ఉద్యమాలు, నీటిని ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించాలన్న డిమాండును ముందుకు తెచ్చాయి. అంతేకాదు ప్రజలకందించే సేవలన్నిటిలోనూ ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం, పారదర్శక పద్ధతులు ఆచరించాలని పెద్ద ఎత్తున తమ గళాన్ని విప్పాయి. లాటిన్ అమెరికా మొత్తం మీద ఉరుగ్వే ఒక్కటే మొత్తం ప్రజానీకానికి మెరుగైన మంచినీటిని, పారిశుద్ధ్యాన్ని అందించ గలగిందని 2010లో ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అలాగే బ్రెజిల్, వెనిజులాలోని కార్కసస్‌లలో మంచినీటి పరిశ్రమలు పరిపాలన నిర్ణయాధికారాలను ప్రజాతంత్రం చేయటం ద్వారా మెరుగైన సేవలను అందించగలిగాయి. బ్యూనస్ ఎయిర్స్, అర్జెంటీనాలలో కార్మిక నియంత్రణలో అమలవుతున్న సహకార మంచినీటి సంస్థలు ప్రపంచానికంతటికి ప్రత్యామ్నాయమని ఐక్యరాజ్య సమితి ప్రశంశించింది. హొండరస్‌లో గ్రామీణ ప్రాంతాలలో అమలవుతున్న నీటి కుండల విధానం కమ్యూనిటీలలో ఉన్న నీటి కార్యక్రమాలలో ఆదర్శవంతమైనదని పేర్కొన్నారు.

ఆఫ్రికాలో, మరీ ముఖ్యంగా సబ్-సహారా దేశాలలో ఒక క్రమ పద్ధతిలో తాగునీటిని అందించే విధానం మొత్తం వ్యాపారమై పోయింది. కొన్ని ప్రభుత్వాలు ఇప్పుడిప్పుడే ఆ బాధ్యతలు తీసుకోవటానికి ముందుకొస్తున్నాయి. అనేక మున్సిపాలిటీలలో నీటి సేవలను అందించటం ప్రారంభించాచు. కాని వాటి నిర్మాణం, సరఫరా రెండూ సంపూర్ణంగా లేవు.

లాటిన్ అమెరికాలో ఒకప్పుడు లాభార్జన ధ్యేయంగా ఉండే విద్యుత్తు రంగ పరిశ్రమలలో నేడు చాలా ప్రాంతాలలో రకరకాల ప్రభుత్వ సంస్థలు, పరిపాలనా వికేంద్రీకరణ, ఆర్థిక వనరుల సేకరణ, పాలనా సౌలభ్యం, యాజమాన్య పద్ధతులన్నిటిలోనూ వినూత్నమైన, విభిన్నమైన అంశాలను కూర్చుకొని పని చేయడం ప్రారంభించాయి. వెనిజులాలో ముఖ్యంగా కార్కసస్ నగరంలో క్షేత్ర స్థాయిలో అనేక ప్రయోగాలు జరిపి, ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించి తమ పరిసర ప్రాంతాలలో మెరుగైన సేవలను, అందులో విద్యుత్తుని కూడా అందించే ప్రయత్నం చేస్తున్నారు. అర్జెంటీనాలో కొంత కాలం పాటు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్‌ని భాగస్వామ్యం చేసి విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా అంశాలలో మెరుగైన ఫలితాలు రాబట్టే ప్రయత్నం చేశారు. అంతేకాదు ఈ రోజు అనేక దేశాలలో పవన, సోలార్ శక్తి ప్రాజెక్టు ద్వారా విద్యుత్తు ఉత్పత్తి వలన పర్యావరణ పరిరక్షణ మెరుగైందనీ, బొగ్గు, చమురు, సహజ వాయువులు, అణు రియాక్టర్ల కన్నా ఉత్తమమైన వనీ గుర్తించి, వాటిని ప్రోత్సహిస్తున్నారు. ఆఫ్రికా ఖండం మటుకు విద్యుత్తు ఉత్పాదనలో ఇంకా దూరం ప్రయాణం చేయాల్సి ఉంది. మూడింట రెండొంతుల మంది ఆఫ్రికన్లు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. వారిలో కేవలం 19 శాతం మందికి మాత్రమే విద్యుత్తు సేవలు అందుతున్నాయి. ఇది రానున్న కాలంలో మరింత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా దేశాలలో విద్యుత్తు సేవలు రాష్ట్రాల ఆధీనంలోనే ఉన్నాయి. ఘనాలో మాత్రం స్వయం సహాయక విద్యుదీ కరణ కార్యక్రమం విజయవంతంగా నడిపి స్తోంది. కొన్ని దేశాలలో కమ్యూనిటీ సహకార సంస్థల ద్వారా విద్యుదుత్పత్తి, సరఫరా కొంత పరిమిత ప్రాంతాల వరకు జరుగుతోంది.

ఆసియాలో, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలం నుండి 80వ దశకం వరకు పెద్ద ఎత్తున విద్యుత్తు సేవలను ప్రభుత్వాలే నిర్వహించాయి. 80వ దశకం నుండి పెద్ద ఎత్తున ప్రైవేటీకరణవాదం బలపడి వీటిని వెనక్కునెట్టే ప్రయత్నాలు సఫలీకృతమైనాయి.

విద్యుత్తు ఉత్పత్తి, సరఫరాలను పెద్ద ఎత్తున ఆరంభించిన ప్రైవేటు పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలకన్నా మెరుగైన, నాణ్యమైన విధానాలు సాధించి ఉండవచ్చును కాని, విద్యుత్తును పంపిణీ చేసే వ్యవస్థలను నెలకొల్పటానికి మాత్రం అవి తీవ్రంగా విఫలమైనాయి. (ఒక్క పట్టణ ప్రాంతాలలో తప్ప). అందువలనే లాభార్జన లేని ప్రత్యామ్నాయ మార్గాలను మనం అన్వేషించాలి. థాయిలాండ్‌లో ప్రభుత్వం, లాభార్జన లేకుండా పని చేసే సంస్థల సహకారముతో బయోగ్యాస్ నుండి విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. అదే ఫిలిప్పైన్స్‌లో అయితే, కమ్యూనిటీ ఆధారిత విద్యుత్తును సహకార సంస్థలూ, ప్రభుత్వమూ కలిసి గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్తు పంపిణీ చేస్తున్నాయి. 1997 ఆర్థిక సంక్షోభం తరువాత ఇండోనేషియాలో విద్యుత్తు రంగాన్ని పునర్వ్యవస్థీకరించారు. ప్రైవేటు విద్యుత్ పరిశ్రమలు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను జాతీయ విద్యుత్తు గ్రిడ్‌కు అందించటం, ప్రభుత్వమే బాధ్యత తీసుకొని విద్యుత్ సరఫరా పంపిణీ చేయడం ఆరంభించింది.

ఈ గ్రంథం మొత్తం మీద ప్రైవేటీకరణకు ప్రత్యామ్నాయాలను నిశితంగా పరిశీలించి, శోధించి, మనకందచేయటంతోపాటు, ప్రైవేటీకరణకు ప్రత్యామ్నాయం లేదు అనే వాదన శుద్ధ అబద్ధమని తేల్చిపారేసింది. అందువలన అభ్యుదయ కాముకులు, శాస్త్రీయ అవగాహనను పెంపొందించేవారు, ప్రత్యామ్నాయం కోరుకునే వారు, ఆచరించాలనుకునేవారు, ఉద్యమకారులందరిని నేను కోరేది ఏమిటంటే ఈ గ్రంథాన్ని పఠించండి.

**('ఫ్రంట్‌లైన్' నుండి, అనువాదం:భారవి)**

# చే గువేరా సాహస యాత్రపై వ్యాసం యువతకు ఉత్తేజాన్నిస్తుంది

## అభిప్రాయాలు

మార్క్సిస్టు డిసెంబర్ 2013 సంచికలో నిర్మల్ కుమార్‌గారు రాసిన 'లాటిన్ అమెరికాలో 'చే' సాహస యాత్ర'పై వ్యాసం బాగుంది. ధన్యవాదాలు. నేడు ఫ్యాషన్ సంస్కృతి కొత్త పుంతలు తొక్కుతున్నది. ప్రజలు ఎక్కువగా దేనిపై ఆసక్తి కనబరుస్తారో అటువంటి వస్తువులను ఉత్పత్తి చేసి లాభాలు పోగేసుకోవాలని నిత్యం పెట్టుబడిదారులు అన్వేషిస్తుంటారు. ఈ మధ్య కాలంలో తాము వేసుకుంటున్న చొక్కాలు, టీ షర్టులపై రకరకాల బొమ్మలు, వ్యాఖ్యానాలు ఉండేదానికోసం యువత పోటీపడుతున్నారు. అందుకు వ్యాపార వేత్తలు ఈ రకాల దుస్తులనే ముద్రిస్తున్నారు. అలా యువత ధరిస్తున్న టీ షర్టులపై ఎక్కువగా దర్శనమిస్తోంది ఒక బొమ్మ. చొక్కాలపైనే కాదు, మోటారు వాహనాలు, సెల్‌ఫోన్స్, ఆఖరికి సినిమాల్లో కూడా ఆ రూపాన్ని పెట్టడాన్ని యువత ఇష్టపడుతోంది. ఇంతకీ ఎవరిది ఆ బొమ్మ? ఎందుకు అంతగా యువతను ఆకర్షిస్తోంది? నిజంగా ఆ ప్రతిరూపం చరిత్ర యువతకు తెలుసా? వంటి ప్రశ్నలు మనముందు నిలుస్తాయి. ఎక్కువ మంది యువతకు ఆ వ్యక్తి జీవితం గురించి తెలియదు. "ప్రపంచంలో ఎక్కడ అన్యాయం, అక్రమాలు జరిగినా ఎదిరించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చిన వీరుడతను. ఆయనే ఎర్నెస్టో చే గువేరా. ప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపనకు దారితీసిన అక్టోబరు విప్లవంతో గానీ, ప్రపంచపు రూపురేఖలు మారడానికి దోహదపడిన చైనా విప్లవంతోగానీ ఆయనకు ప్రత్యక్షంగా సంబంధం లేదు. కానీ ఆయన పేరు విశ్వవ్యాపితంగా విప్లవం అన్న మాటకు ప్రతీకగా, ప్రేరణగా నిలబడింది. ఒక్క మాటలో చెప్పాలంటే విప్లవం అన్న మాట వినపడగానే ఆయన స్ఫురద్రూపం కళ్లలో కనబడుతుంది. మార్క్స్ ఊహించిన శ్రామిక వర్గ అంతర్జాతీయ విప్లవకారుడాయన. సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యక్తిత్వానికి తార్కాణం ఆయన. ఆయన చనిపోయి 46 ఏళ్లు గడుస్తున్నా ఆ పేరు ఈ తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ఆ మహావీరుణ్ణి గుండెలపై వేసుకునే షర్టులపై కాదు, గుండెల్లో దాచుకోవాలని యువత అర్థం చేసుకుంటుంది.

చే గువేరా చదువు పూర్తి కాగానే అర్జెంటీనాలో 2 వేల 800 మైళ్లు ప్రయాణం చేశాడు. తన మిత్రుడితో కలిసి ఒక పాత మోటార్ సైకిల్‌పై లాటిన్ అమెరికా దేశాల్ని సందర్శించాడు. నియంత పాలనలో మగ్గిపోతూ, పేదరికంలో అల్లాడిపోతున్న అభాగ్యుల జీవితాలను చే కళ్లారా చూసి చలించిపోయాడు. లాటిన్ అమెరికా పేదల జీవితాల్లో కొత్త సూర్యోదయాన్ని ఆవిష్కంచాలని నిర్ణయించుకున్నాడు. దోపిడీ శక్తులను అంతమొందించాలంటే సమసమాజాన్ని స్థాపించడం ఒక్కటే మార్గమని భావించాడు. అందుకే కష్టాల కడలి లాంటి విప్లవ బాటను ఎంచుకున్నాడు. ఆయనను తలచుకుని ఎందరో పోరాట వీరులు ఉత్సాహం నింపుకుంటున్నారు.

క్యూబా విప్లవం వచ్చిన తరువాత 1955 సంవత్సరంలో కాస్ట్రో నుండి తీసుకున్న మాట ప్రకారం లాటిన్ అమెరికాపై ఎర్ర బావుటా ఎగరవేయడానికి క్యూబాలో అధికార పదవిని త్యజించి విప్లవ బాట పట్టిన మహానేత చే గువేరా. ఈ రోజుల్లో అధికారం కోసం ఆరాటపడుతూ, పదవీ వ్యామోహంలో సకల సుఖాలు అనుభవించడానికి పోటీ పడుతున్న నాయకులను చూస్తున్న యువతకు, పేదల జీవితాల్లో వెలుగుల కోసం అధికారాన్నే వదిలిపెట్టిన 'చే' యువతకు ఆదర్శప్రాయుడే. సామ్రాజ్యవాదుల కళ్లు కప్పి అజ్ఞాతంలో ఉంటూ లాటిన్ అమెరికాలోని వివిధ దేశాల్లో వప్లవపోరాటాన్ని నిర్మించడానికి ప్రయత్నించాడు. అలాంటి మహా యోధుల జీవిత విశేషాలను ప్రచురిస్తున్న 'మార్క్సిస్టు' పత్రికకు అభినందనలు. ఇంకా ఇలాంటి వీరయోధుల జీవిత విశేషాలను ప్రచురించి, ప్రజల్ని చైతన్యవంతులను చేస్తారని అభిప్రాయపడుతున్నాను.

**టి. రాజ్‌కుమార్,**

చెక్కరాయి బంధ(గ్రామం)

లంబసింగి (పోస్టు), చింతపల్లి (మండలం)

విశాఖ (జిల్లా)

**సోషలిస్టు ప్రపంచం**

# సోషలిజం: సోషలిజానికి మార్గం

## వియత్నాం అవగాహన



రచయిత వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి

**ఎన్ గెయెన్ ఫు ట్రోంగ్**

'సోషలిజం, సోషలిజానికి దారితీసే మార్గం' అనేది ఒక మౌలిక సైద్ధాంతిక, ఆచరణాత్మక అంశం. ఇది సంక్లిష్టమైన సమస్య. లోతుగా విశ్లేషించాల్సిన సమస్య. సోషలిజం సాధన కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో వియత్నాం అనుభవాల ఆధారంగా కొన్ని అంశాలు మీ ముందుంచుతున్నాను. ఇక్కడ మనముందు అనేక ప్రశ్నలున్నాయి. సోషలిజం అంటే ఏమిటి? సోషలిస్టు పంథాను వియత్నాం ఎందుకు ఎంచుకున్నది ? వియత్నాంలో దశల వారీగా సోషలిస్టు సమాజ నిర్మాణం చేయటం ఎలా? గత పాతికేళ్లలో వియత్నాం సాధించిన ఆర్థికాభివృద్ధి, సోషలిస్టు నిర్మాణ ప్రక్రియ ఏ మేరకు ముందంజ వేసింది? ఈ క్రమంలో నేర్చుకున్న అనుభవాలు ఏమిటి?

సోషలిజం ఒక సిద్ధాంతం, సోషలిజం ఒక ఉద్యమం, సోషలిజం ఒక అధికార వ్యవస్థ అన్న మూడు కోణాల్లో మనం సోషలిజాన్ని చూడాలి. నిర్దిష్ట చారిత్రక పరిస్థితినిబట్టి ఈ మూడు కోణాలు నిర్దిష్ట స్థానాన్ని ఆక్రమిస్తాయి. మార్క్సిజం-లెనినిజం ఆధారంగా సమకాలీన సమాజంలో నిర్మించనున్న శాస్త్రీయ సోషలిజం గురించి నేను మాట్లాడుతున్నాను.

గతంలో సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాల కూటమి ఉనికిలో ఉన్నప్పుడు వియత్నాంలో సోషలిస్టు నిర్మాణం కోసం ప్రయత్నం చేయటం సాధారణ పరిణామంగా కనిపించేది. కానీ సోషలిస్టు రష్యా పతనం తర్వాత పలు దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయి. తిరిగి మళ్లీ నేడు సోషలిజం గురించిన ఆసక్తి పెరిగింది. విస్తృతమైన చర్చలు జరుగుతున్నాయి.

పెట్టుబడిదారీ విధానం నేడు ఆమోదయోగ్యమైనంతగా గతంలో ఎన్నడూ లేదు. ఉత్పాదక శక్తులను విముక్తి చేయటంలోనూ, ఉత్పాదకత పెంచటంలోనూ, శాస్త్ర సాంకేతిక రంగాలను ఆధునీకరించటంలోనూ పెట్టుబడిదారీ విధానం నిస్సందేహంగా కీలక పాత్ర పోషించింది. ఆర్థిక వ్యవస్థలు బలోపేతం కావటంతో పాటు కార్మికవర్గ పోరాటాల కృషి ఫలితంగా గతంలో ఎన్నడూ లేనంతగా పలు పెట్టుబడిదారీ దేశాలు సంక్షేమ వ్యవస్థలకు తెరతీశాయి. అయినప్పటికీ పెట్టుబడిదారీ విధానం తన మౌలిక ఆంతరంగిక వైరుధ్యాన్ని అధిగమించలేకపోయింది. 2008లో అమెరికాలో ఆరంభమైన ఆర్థిక సంక్షోభం అతి తక్కువ కాలంలోనే ఇతర పెట్టుబడిదారీ దేశాలను చుట్టుముట్టి ప్రపంచవ్యాప్త ప్రభావం చూపటాన్ని మనం చూస్తున్నాము.

ఈ సంక్షోభంతో పాటు ఆహారం, ఇంధన సంక్షోభాలు, ప్రకృతి వనరుల తరుగుదల, పర్యావరణ పతనం మానవాళి మనుగడనూ, అభివృద్ధినీ ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వ్యక్తులపై ఆధారపడిన సమాజంలో సంపద, లాభాలు ప్రామాణికంగా భావించే అభివృద్ధి విధానాన్ని అనుసరించిన ఫలితంగా తలెత్తిన పర్యవసానాలే ఇవి. పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి, వినిమయంలో మౌలిక లక్షణాలు ఇవే. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికి వ్యతిరేకమైనదనీ, మానవాళికి వ్యతిరేకమైనదనీ, ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణ పరంగా మన్నిక సాధించలేనిదనీ రుజువైంది. మార్క్స్ చెప్పినట్లు తన సంపదకు మూల కారణాలైన శ్రమశక్తి, ప్రకృతి వనరులనే పెట్టుబడిదారీ విధానం నాశనం చేస్తుంది. శాస్త్రవేత్తల అభిప్రాయంలో కూడా ప్రస్తుతం పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న సంక్షోభం సదరు పెట్టుబడిదారీ విధానం పరిమితుల్లో పరిష్కరించుకోవటం అసాధ్యంగా మారింది.

ప్రస్తుతం పెట్టుబడిదారీ విధానం అమలు జరుగుతున్న దేశాల్లో పెల్లుబుకుతున్న ప్రజాందోళనలు ఆయా దేశాల్లోని పాలక వ్యవస్థల డొల్లతనాన్ని వెల్లడిస్తున్నాయి. పశ్చిమ దేశాలు రుద్దిన 'స్వేచ్ఛా ప్రజాస్వామ్యం' సూత్రాల ఆధారంగా సాగుతున్న ప్రజాస్వామిక దేశాల్లో సైతం ప్రజాస్వామ్య నిజస్వభావానికి తగ్గట్లుగా ప్రజలకోసం, ప్రజల ద్వారా ప్రజాస్వామ్యం అమలు జరిపేందుకు అవకాశాలు కల్పించటం లేదు. ప్రజాస్వామ్యం పేరుతో ఉన్నప్పటికీ ఆయా దేశాల్లో అధికారం కేవలం పిడికెడు మంది చేతుల్లోనే ఉంటోంది. ప్రధాన పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల కోసం పాటుపడుతోంది. కేవలం ఒక్క శాతం మంది, మొత్తం సంపదపైనా, ఉత్పత్తి సాధనాలపైనా ఆధిపత్యం సాధించటమే కాక మాస్ మీడియా, ద్రవ్య సంస్థలపై సంపూర్ణ ఆధిపత్యాన్ని కలిగి ఉన్నారు.

కేవలం లాభాల కోసం మానవ విలువలు మంటగలిపి అదుపులేని దోపిడీకి దిగజారే వ్యవస్థ కాకుండా నిజంగా ప్రజలకోసం అభివృద్ధి జరిగే వ్యవస్థ మనకు కావాలి. ధనికులూ, పేదల మధ్య ఆర్థిక అంతరాలు పెరిగే వ్యవస్థ కాక ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక అభివృద్ధి కూడా సమాంతరంగా సాగే వ్యవస్థ కావాలి. పరస్పర వ్యతిరేకత, స్పర్ధ, పరిమిత ప్రయోజనాలు సొంతం చేసుకోవటానికి పోటీ పడే వ్యవస్థల స్థానంలో సామాజిక ప్రగతిశీల విలువల కోసం, వాత్సల్యం, ఐక్యతలను పెంపొందించే వ్యవస్థలు కావాలి. పర్యావరణాన్ని ధ్వంసం చేసి అదుపు లేకుండా దోపిడీ చేసే వ్యవస్థల స్థానంలో పర్యా

వరణాన్ని పరిరక్షించి భావి తరాలకు అందించే వ్యవస్థ, మన్నికైన అభివృద్ధి వ్యూహాలను అనుసరించే వ్యవస్థ కావాలి. కేవలం సంపన్న వంతులైన కొద్దిమంది ప్రయోజనాల కోసం పని చేసే ప్రజాస్వామ్యం కాక ప్రజలకోసం ప్రజలతో పని చేసే ప్రజాస్వామిక వ్యవస్థ కావాలి. నిజానికి ఇవే నిఖార్సయిన సోషలిస్టు విలువలు.

వియత్నాం ప్రజలు 'స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మించిన విలువైన బహుమతి లేదు' అన్న నినాదంతో స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం కోసం వీరోచితంగా పోరాడారు. వలసవాదం, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం కఠినమైన విప్లవ పోరాటం సాగించారు.

హొ చి మిన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లటానికి చేసే కృషిలో భాగంగా జాతీయ స్వాతంత్ర్యంతో సోషలిజం నిర్మాణమే వియత్నాం విప్లవ లక్ష్యం. హొ చి మిన్ తన అనుభవాలను శాస్త్రీయ మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాలతో మేళవించి కేవలం సోషలిజం, కమ్యూనిజం మాత్రమే నిజమైన స్వేచ్ఛాయుతమైన సమాజాన్నీ, దేశంలోని ప్రజలందరికీ సంతోషంతో కూడిన జీవితాన్నీ ఇవ్వగలదన్న నిర్ధారణకు వచ్చారు. చారిత్రక కర్తవ్య సాధనలో ప్రజల శక్తి యుక్తులు కూడదీసి సోషలిస్టు సమాజ నిర్మాణం సాగించటం వియత్నాం విప్లవపు మౌలిక లక్ష్యం.

కానీ సోషలిజం అంటే ఏమిటి? సోషలిజం దిశగా ఎలా ముందుకెళ్లాలి? నేడు మన ఆలోచనల నిండా ఆక్రమించుకున్న అంశాలివి. వియత్నాం పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో అడుగు ముందుకేస్తూ ఆ దిశగా అవగాహన కల్పించటం, మార్గదర్శనం చేయటం గురించిన ఆలోచనలు మన మస్తిష్కాలను ఆక్రమించి ఉన్నాయి.

నేటికీ కొన్ని అపరిష్కృత విషయాలు ఉన్నప్పటికీ వియత్నాం ప్రజలు నిర్మించబూనుకున్న సోషలిస్టు వ్యవస్థ సంపన్నులైన ప్రజలతో నిండిన సమాజంగా ఉంటుంది. నాగరికత, స్వచ్ఛత, ప్రజాస్వామ్యంతో నిండి ఉన్న సమాజం. ఆ సమాజంలో ప్రజలే ప్రభుత్వం. అది ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశం. ఆధునిక ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాల మీద ఆధారపడ్డ దేశం. అటువంటి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం వియత్నాం ప్రజలు కృషి చేస్తున్నారు. జాతీయ గుర్తింపు, సమగ్రాభివృద్ధికి తగిన అవకాశాలు కలిగిన ఆధునిక సంస్కృతితో నిండి ఉండే వియత్నాం కోసం, దేశంలోని వివిధ జాతులు సమాన హక్కులూ, అవకాశాలూ కలిగి ఉండి పరస్పర గౌరవంతోనూ, సహకారంతోనూ వ్యవహరించే వియత్నాం కోసం, ప్రజల కోసం ప్రజల ద్వారా ప్రజల వలన ఎన్నుకోబడ్డ చట్టబద్ధమైన కమ్యూనిస్టు ప్రభుత్వం ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండే వియత్నాం కోసం ప్రజలు కృషి చేస్తున్నారు.

**"హొ చి మిన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లటానికి చేసే కృషిలో భాగంగా జాతీయ స్వాతంత్ర్యంతో సోషలిజం నిర్మాణమే వియత్నాం విప్లవ లక్ష్యం. హొ చి మిన్ తన అనుభవాలను శాస్త్రీయ మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాలతో మేళవించి కేవలం సోషలిజం, కమ్యూనిజం మాత్రమే నిజమైన స్వేచ్ఛాయుతమైన సమాజాన్నీ, దేశంలోని ప్రజలందరికీ సంతోషంతో కూడిన జీవితాన్నీ ఇవ్వగలదన్న నిర్ధారణకు వచ్చారు."**



వియత్నాం విప్లవ రథసారథి
కామ్రేడ్ హొచి మిన్

ఈ లక్ష్యాలు సాధించాలంటే దేశాన్ని వేగంగా పారిశ్రామికీకరణ, ఆధునీకరణ గావించాలి. విజ్ఞానం ఆధారిత సోషలిస్టు లక్షణాలతో కూడిన మార్కెట్ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాల్సి ఉంది. జాతీయ గుర్తింపు కలిగిన ఆధునిక సంస్కృతిని పాదుకొల్పాలి. మానవ వనరుల అభివృద్ధికి ఊతమివ్వాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించాలి. సామాజిక ప్రగతిని ప్రోత్సహించాలి. జాతీయ భద్రతను పటిష్టం చేసే విధంగా రక్షణ వ్యవస్థలను ఆధునీకరించాలి. సామాజిక వ్యవస్థను కాపాడాలి. స్వాతంత్ర్యం, స్వావలంబన, శాంతి, స్నేహం, సహకారం అభివృద్ధి సూత్రాలపై ఆధారపడ్డ విదేశాంగ విధానాన్ని అమలు చేయాలి. ప్రపంచంతో మరింత క్రియాశీలకంగా సంలీనం అవ్వాలి. దేశంలో సోషలిస్టు ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మించాలి. జాతీయ ఐక్యత పటిష్టం చేయాలి. ప్రజల కోసం, ప్రజల ద్వారా చట్టబద్ధమైన ప్రజా సోషలిస్టు వ్యవస్థను నిర్మించాలి. మరింత శక్తివంతమైన పారదర్శకమైన పార్టీని నిర్మించాలి. మనం మరింత లోతుల్లోకి వెళ్లే కొద్దీ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణ ప్రక్రియ సుదీర్ఘమైనదీ, సంక్లిష్టమైనదీ అని రుజువు అవుతోంది. ఎందుకంటే సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం అంటే అన్ని సామాజిక రంగాల్లో సమూలమైన మార్పులు తేవాలి. వరుస యుద్ధాలతో నాశనమైన నామమాత్రపు ఉత్పాదకత కలిగిన వెనకబడిన వ్యవసాయక దేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కాకుండానే సోషలిస్టు వ్యవస్థ అభివృద్ధి కోసం వియత్నాం కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తోంది. ఈ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం నిస్సందేహంగా సుదీర్ఘకాల ప్రక్రియ. వివిధ దశలు దాటి ముందుకు పోవాల్సిన ప్రక్రియ. ఈ అన్ని దశల్లోనూ పాత శక్తులతో కొత్త శక్తులు పాత ఉత్పత్తి సంబంధాలతో కొత్త ఉత్పత్తి సంబంధాలు ఘర్షణపడాల్సిన పరిస్థితి ఉంటుంది. వియత్నాంలో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి జరుగుతున్న అటువంటి సుదీర్ఘ ప్రక్రియను ప్రత్యర్థులు నిరంతరం ఆటంకం కలిగిస్తున్నారు. అవాంతరాలు సృష్టిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను బైపాస్ చేస్తున్నాము అనటంలో నా ఉద్దేశ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండే దోపిడీ, అణచివేత, అసమానతలు, సామాజిక దుర్లక్షణాలతో పాటు సోషలిస్టు వ్యవస్థతో సమన్వయం చేసుకోలేని రాజకీయ వ్యవస్థలను కూడా బైపాస్ చేస్తున్నాము అని అర్థం చేసుకోవాలి. అంత మాత్రాన పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామంలో సమాజం సాధించుకున్న నాగరిక లక్షణాలు, విలువలను వదులుకోవాలని కాదు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగమైన విలువలను స్వీకరించేటపుడు వాటన్నింటినీ గుండు గుత్తగా స్వీకరించటం కాక కావాల్సినవాటిని మాత్రమే ఎంచుకోవాలి.

> **❝ సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ అన్నది వినూత్నమైనదే కాదు, మా పార్టీ అవగాహనలో అది ఒక ముఖ్యమైన మలుపు. పార్టీ పునరుద్ధరణ ప్రక్రియ మొదలైన గత 25 ఏళ్లల్లో సాధించిన ముఖ్యమైన ముందంజల్లో ఇది ఒకటి. ❞**

సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ అన్నది వినూత్నమైనదే కాదు. మా పార్టీ అవగాహనలో అది ఒక ముఖ్యమైన మలుపు. పార్టీ పునరుద్ధరణ ప్రక్రియ మొదలైన గత 25 ఏళ్లల్లో సాధించిన ముఖ్యమైన ముందంజల్లో ఇది ఒకటి. వియత్నాం అనుభవాలు, ప్రపంచ పరిణామాల ఆకళింపు ద్వారానే మా పార్టీ పునరుద్ధరణ సాధ్యమైంది. మా అభిప్రాయంలో బహుళ రంగాలలో సరుకుల ఆర్థిక వ్యవస్థ అనేది సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగం. ఇటువంటి ఆర్థిక వ్యవస్థ సోషలిస్టు అవగాహనతో మార్కెట్ ప్రమాణాల్లో అమలు జరిగే ఆర్థిక వ్యవస్థ. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ చరిత్రలోనే ఇది కొత్త తరహా ఆర్థిక వ్యవస్థ. ఈ ఆర్థిక వ్యవస్థ మార్కెట్ సూత్రాలకు లోబడి ఉంటుంది. కానీ అదే సమయంలో మార్కెట్ సూత్రాలకు లోబడి ఉన్న ఈ సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ సోషలిస్టు ప్రభుత్వ విధి విధానాల అజమాయిషీలో, ఆ విధానాలపై ఆధారపడి అమలు జరుగుతుంది. నాగరిక లక్షణాలు, స్వచ్ఛత, ప్రజాస్వామ్యం ప్రాతిపదికన ఆర్థిక ఫలాలు ప్రజలందరికీ పంపిణీ చేసే విధంగా ఉండాలి. అందువల్లనే ఇది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కాదు అలా అని సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ కూడా కాదు.

సోషలిస్టు లక్షణాలు కలిగిన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో వైవిధ్యభరితమైన ఆర్థిక రంగాలు, యాజమాన్య వ్యవస్థలు ఉంటాయి. ప్రధాన ఆర్థిక రంగాలు చట్టబద్ధ విధి విధానాలకు లోబడి ఉంటాయి. పరస్పర సహజీవనం, సమన్వయం, సహకారం, ఆరోగ్యవంతమైన పోటీ ప్రాతిపదికన ఈ రంగాలు పని చేస్తుంటాయి. ఈ తరహా ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుంది. సమిష్టి ఆర్థిక రంగం నిరంతరం సంఘటితమవుతుంది. అభివృద్ధి అవుతుంది. సమిష్టి ఆర్థిక రంగాన్ని అభివృద్ధి చేయటంలో ప్రైవేటు రంగం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ, సమిష్టి ఆర్థిక రంగం జాతీయ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉండాలి. బహుళ స్వభావం కలిగిన యాజమాన్యం, జాయింట్ స్టాక్ కంపెనీలు సమాంతరంగా కొనసాగుతాయి. ఆర్థిక ప్రయోజనాలు పారదర్శకంగా పంపిణీ జరిగాలి. ఆర్థికాభివృద్ధికి పునాదులు వేయాలి. ఫలితాలు, ఆర్థిక సామర్ధ్యం, ఇతర వనరులతో కలిసి పంపిణీ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తాయి. ఈ పంపిణీకి సంక్షేమ వ్యవస్థలూ, సామాజిక భద్రతా పునాదులుగా ఉంటాయి. చట్టాలు, వ్యూహాలు, ప్రణాళికలు, విధానాలు, యంత్రాంగం ఆర్థిక వ్యవస్థలను నియంత్రించి ఆర్థికాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేలా వ్యవహరిస్తుంది.

వియత్నాం అనుసరిస్తున్న సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ మౌలిక లక్షణం ఏమిటంటే ఇందులో ఆర్థిక సూత్రాలు, సమాజం సమన్వయం కలిగి ఉంటాయి. ఆర్థికాభివృద్ధీ, సామాజిక వృద్ధీ సమాంతరంగా కొనసాగుతాయి. ప్రతి విధానాన్ని రూపొందించేటపుడు పారదర్శకత ప్రాతిపదికగా ఉంటుంది. అంటే సామాజిక ఫలితాలు అందుబాటులోకి రావటానికి ఆర్థిక వ్యవస్థ పతాక స్థాయిలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఇక్కడ ఉండదు. అలాగే సామాజిక న్యాయం కోసం ఆర్థిక వ్యవస్థనూ, అభివృద్ధినీ ఫణంగా పెట్టాల్సిన అవసరం కూడా లేదు. దానికి భిన్నంగా ఆర్థిక విధానానికి సంబంధించిన ప్రతి నిర్ణయం సామాజిక అభివృద్ధి లక్ష్యంగా ఉంటుంది. ప్రతి సామాజిక విధానం ఆర్థికాభివృద్ధికి సోపానంగా ఉంటుంది. ప్రజలను చట్టబద్ధంగా సాధికారవంతులను చేస్తూనే పేదరికాన్ని తగ్గించటం, బలహీనులైన వారికి ప్రత్యేక రక్షణలు కల్పించటం, జాతికి ఎనలేని సేవలు అందించిన వారి అవసరాలు తీర్చే విధంగా వ్యవహరించటం వంటి ప్రయోజనాలు సమాంతరంగా సాధించడం జరుగుతుంది. ఆరోగ్యవంతమైన మన్నికైన సామాజిక కోణం కలిగిన ఆర్థికాభివృద్ధిని సాధించటానికి చేసే ప్రయత్నంలో ఉండాల్సిన లక్షణాలు ఇవి.

సంస్కృతి సమాజానికి బౌద్ధిక పునాది అని పార్టీ భావిస్తుంది. అందువల్లనే ఆర్థికాభివృద్ధి, సామాజిక ప్రగతితో పాటు సాంస్కృతిక అభివృద్ధి కూడా సోషలిస్టు వియత్నాం నిర్మాణంలో అంతర్భాగంగా ఉన్న లక్షణం. వియాత్నం నిర్మించబూనుకున్న సంస్కృతి జాతీయ అస్థిత్వం, మానవతా విలువలతో కూడిన భిన్నత్వంలో ఏకత్వం అన్న సూత్రం, వియత్నాంలోని అన్ని తరగతులు, విశ్వాసాలకు సంబంధించిన సంస్కృతుల్లో మంచి లక్షణాలన్నిటినీ పుణికి పుచ్చుకుని మార్క్సిజం లెనినిజం, హెూ చి మిన్ ఆలోచనల ప్రాతిపదికన బౌద్ధిక జీవితం అందించే ప్రయత్నం, మానవాళి సాంస్కృతిక విలువలను పుణికి పుచ్చుకుని ఆరోగ్యవంతమైన, నాగరికమైన, మానవీయతకు పట్టం కట్టే ఉన్నత స్థాయిలో విజ్ఞానవంతమైన, ఉన్నతమైన ఆయుః ప్రమాణాలు కలిగిన ఆరోగ్యవంతమైన, సౌందర్యారాధనతో కూడిన, సంపూర్ణ జీవన విధానం అందించటం సోషలిస్టు వియత్నాం నిర్మాణంలో అంతర్భాగం. ఏ తరహా అభివృద్ధి వ్యూహంలోనైనా ప్రజలే కీలక పాత్ర పోషించాలి. వియాత్నం పునరుద్ధరణ క్రమంలో సాంస్కృతికాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి లక్ష్యాలుగా ఉండాలి. విద్యారంగ అభివృద్ధి, శాస్త్ర సాంకేతికరంగాల్లో శిక్షణ జాతీయ విధానంలో ముఖ్యాంశాలుగా ఉంటాయి. పర్యావరణ మన్నిక, పరిరక్షణ ఈ మధ్యకాలంలో ఒక ముఖ్యమైన సమస్యగా ముందుకొచ్చింది. ఆధునిక నాగరికత లక్షణాల్లో భాగంగా లైంగిక సమానత్వం, ప్రగతిశీల దృక్పథం కలిగిన కుటుంబాలు అభివృద్ధి చెందటానికి అవకాశం కల్పించటం సోషలిస్టు వియత్నాం నిర్మాణంలో అంతర్లీన లక్షణాలుగా ఉంటాయి.

సోషలిస్టు సమాజంలో ప్రజల ఉమ్మడి ప్రయోజనాలు ప్రాతిపదికన ప్రగతిశీల మానవీయ విలువలు ఉంటాయి. ఈ విలువలు వ్యక్తిగత ప్రయోజనాల ప్రాతిపదికన పోటీ తత్వంపై ఆధారపడిన సమాజాల్లో ఉండే మానవీయ విలువలకంటే పూర్తి భిన్నంగా ఉంటాయి. వైరుధ్యం, వ్యతిరేకత స్థానంలో సామాజిక చైతన్యాన్ని సోషలిస్టు వ్యవస్థ పెంపొందిస్తుంది. సోషలిస్టు వ్యవస్థలో పార్టీ, ప్రభుత్వం, ప్రజల మధ్య సంబంధాలు ఉమ్మడి లక్ష్యం కోసం ఉమ్మడి ప్రయోజనాల కోసం పాటుపడే భిన్న వ్యవస్థలు, శక్తులు, సంస్థల మధ్య ఉండే సంబంధాల్లాగా ఉంటాయి. పార్టీ ఇచ్చే ప్రతి నిర్దేశమూ, ప్రభుత్వం తీసుకునే ప్రతి

నిర్ణయమూ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ ధ్యేయంగానే ఉంటాయి. సోషలిస్టు వ్యవస్థలో రాజకీయ నిర్మాణ రూపం స్థూలంగా పార్టీ నాయకత్వం, ప్రభుత్వ యాజమాన్యం, ప్రజల అజమాయిషీ అనే విధంగా ఉంటాయి. స్వాభావికంగానే సోషలిజం ప్రజాస్వామిక స్వభావం కలిగింది. సోషలిస్టు సమాజం నిర్మాణంలో ప్రజాస్వామ్యం సాధనంగా కూడా ఉంటుంది. నిజమైన అధికారం ప్రజలకు చెందేలా సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని నిర్మించటం వియత్నాం విప్లవంలో అంతిమ, దీర్ఘకాల లక్ష్యం. ప్రజాస్వామ్య ప్రమాణాల పరిరక్షణకు నిరంతరం అంకితం కావాలనీ, ప్రజలకు ఉపయోగకరమైన రీతిలో శాసనబద్ధమైన సోషలిస్టు వ్యవస్థను నిర్మించాలనే దానికి ప్రాతిపదికగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కార్మికులు, రైతులు, మేధావుల మధ్య ఐక్యత పాదుకొల్పటం లక్ష్యంగా వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పని చేస్తోంది. రాజ్యాంగ యంత్రం ప్రజల నిర్నిరోధమైన అధికారాన్ని గుర్తిస్తూనే పార్టీ ప్రమాణాలకు అనుగుణంగా సమాజాన్ని నిర్మించేలా పని చేస్తోంది. సమాజంలోని అన్ని రంగాల్లో ప్రజలు అధికారం చెలాయించేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. శాసనబద్ధమైన సోషలిస్టు ప్రభుత్వం శాసనబద్ధమైన పెట్టుబడిదారీ ప్రభుత్వం కంటే భిన్నమైనదని మేము గుర్తించాము. పెట్టుబడిదారీ వ్యవస్థలో చట్టసభలు బూర్జువావర్గ ప్రయోజనాలు కాపాడే అనేక సాధనాల్లో ఒక సాధనం. కానీ సోషలిస్టు వ్యవస్థలో చట్టసభలు ప్రజల అధికారానికి దర్పణాలు. ప్రజా ప్రయోజనాలు కాపాడే సాధనాలు. చట్టాల అమలును అనివార్యం చేయటం ద్వారా ప్రజలు రాజకీయ అధికారం చెలాయించేలా అవి చూస్తాయి. దేశానికీ, ప్రజలకూ వ్యతిరేకంగా జరిగే ఏ ప్రయత్నాలనైనా, ఉల్లంఘనలనైనా నియంత్రించే వేదికలుగా ఉంటాయి. అదేసమయంలో జాతీయ సమైక్యత మన బలానికి ప్రతీకగా భావిస్తాము. వియత్నాం విప్లవ లక్ష్యాల సాధనలో జాతీయ సమైక్యత వాహకంగా పని చేస్తుంది. వివిధ తెగలు, జాతుల మధ్య సమానత్వం, ఐక్యత నిరంతరం ప్రోత్సహిస్తాము.

సోషలిస్టు ప్రమాణాల మార్గదర్శనంలో వియత్నాంను పునరుద్ధరించటానికీ, జాతీయ అభివృద్ధి సాధించటానికీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అవసరమనే విషయాన్ని గుర్తించి పార్టీ నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాము. సోషలిస్టు వ్యవస్థలో పార్టీ కీలకమైన లింకు. వియత్నాం కార్మికవర్గానికి, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహిస్తుంది. పార్టీ ఆవిర్భావం, ఉనికి, అభివృద్ధి... ఇవన్నీ కూడా వియత్నాం కార్మికవర్గం కోసం, శ్రామికుల కోసం, మొత్తంగా వియత్నాం దేశం కోసమే. అధికార పార్టీ దేశానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు మొత్తం జాతికి నేతగా గుర్తిస్తారు. అందువల్లనే వియత్నాం ప్రజలకూ, కార్మిక వర్గానికీ, జాతికీ వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు అన్నది నిర్వివాదం. ఈ మాట చెప్తున్నంత మాత్రాన కమ్యూనిస్టు పార్టీకి ఉండాల్సిన వర్గ దృక్పథాన్ని పక్కన పెడుతున్నామని భావించరాదు. దానికి భిన్నంగా కార్మిక వర్గ పార్టీగా పార్టీ స్వభావాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవటమే. ఎందుకంటే కార్మికవర్గ ప్రయోజనాలు మిగిలిన శ్రామిక వర్గం, మొత్తంగా జాతి ప్రయోజనాల కంటే భిన్నమైనవి కాదు. మార్క్సిజం-లెనినిజం, హో చి మిన్ ఆలోచనలు మా పార్టీ సైద్ధాంతిక పునాదులు. ఈ పునాదుల వెలుగులో పార్టీ విప్లవ కార్యక్రమాలు చేపడుతుంది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం పార్టీ ప్రాథమిక నిర్మాణ సూత్రంగా ఉంటుంది. పార్టీ తన వేదికలు, వ్యూహాలు, విధానపరమైన మార్గనిర్దేశనాలను తన సమాచార సాధనాలు, ఉపదేశాలు, సమీకరణలు, నిర్మాణం, పర్యవేక్షణల ద్వారా అమలు చేస్తుంది. ఈ పద్ధతులు పార్టీ సభ్యులతో అమలు చేసి ఆదర్శవంతులను తయారు చేసి పార్టీ పనిలో ఏకీకృత వ్యక్తిగా నిలబెడుతుంది. బ్యూరోక్రసీ, అవినీతి, నైతికపతనం అనేవి నిరంతరం పాలక పార్టీలకు ముప్పే. ప్రత్యేకించి మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం తనను తాను సంస్కరించుకునేందుకు ప్రయత్నం చేస్తుంది. దిద్దుబాటు అమలు చేస్తుంది. పార్టీలోనూ, మొత్తంగా పాలనా యంత్రాంగంలోనూ అవకాశవాదాన్నీ, వ్యక్తివాదాన్నీ, అవినీతినీ, బ్యూరోక్రసీ, వృధా, నైతిక పతనాలనూ తిరస్కరిస్తుంది.

సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థతో సహా

" సోషలిస్టు ప్రమాణాల మార్గదర్శనంలో వియత్నాంను పునరుద్ధరించటానికీ, జాతీయ అభివృద్ధి సాధించటానికీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అవసరమనే విషయాన్ని గుర్తించి పార్టీ నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాము. సోషలిస్టు వ్యవస్థలో పార్టీ కీలకమైన లింకు. వియత్నాం కార్మిక వర్గానికి, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహిస్తుంది. "



శిథిలాలనుండి సుందర నగరం: అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణతో సర్వ నాశనమైన వియత్నాం సోషలిస్టు మార్గంలో శరవేగంగా పురోగమిస్తోంది. వియత్నాం రాజధాని హెచి మిన్ నగరం రాత్రి దృశ్యం

> **ఇన్ని ఫలితాలు సాధించినప్పటికీ వియత్నాం జాతీయ అభివృద్ధి సాధన క్రమంలో అధిగమించాల్సిన పరిమితులు ఇంకా కొన్ని ఉన్నాయి. ఆర్థికంగా చూసినపుడు వృద్ధి నాణ్యత తక్కువగా ఉంది. మౌలిక సదుపాయాల కల్పన అసమానంగా ఉంది. ప్రభుత్వ ఆధీనంలో ఉన్నవాటితో సహా అనేక వాణిజ్య రంగాల శక్తి సామర్థ్యాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి.**

పార్టీ అమలు చేసిన పునరుద్ధరణ ప్రక్రియ గత పాతికేళ్లల్లో దేశంలో ఎన్నో సానుకూల మార్పులు తెచ్చింది.

వియత్నాం ఒకప్పుడు పేద దేశం. యుద్ధంలో శిథిలమైన దేశం. ప్రజల జీవితాలు, మౌలిక సదుపాయాలు, పర్యావరణం ఛిద్రమయ్యాయి. ఆహారం ఇతర కనీస అవసరాల కొరత వేధిస్తూ ఉండేది. ప్రజలు చెప్పలేని కష్టాలు పడుతూ ఉండేవారు. నాల్గింట మూడొంతుల మంది ప్రజలు దారిద్ర్యంలో మగ్గుతుండేవారు. పునరుద్ధరణ ప్రక్రియ మొదలుకాక ముందు వియత్నాం పరిస్థితి అది.

పునరుద్ధరణ ప్రక్రియ ప్రారంభమైన గత పాతికేళ్లలో ఆర్థిక వ్యవస్థ సగటున 7 – 8 శాతం వృద్ధి రేటు సాధించింది. తలసరి ఆదాయం 11 రెట్లు పెరిగింది. 2008 వరకు వియత్నాం తక్కువ ఆదాయం ఉన్న దేశంగా గుర్తించబడేది. 2008లో ఆ మచ్చ తొలగిపోయింది. ఆహారధాన్యాల కొరత ఎదుర్కొన్న స్థితి నుండి ఆహార భద్రత సాధించే స్థితికి చేరటమే కాదు. ధాన్యం, ఇతర వ్యవసాయోత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. పారిశ్రామిక రంగం, సేవా రంగం వేగంగా అభివృద్ధి చెందాయి. స్థూల జాతీయోత్పత్తిలో ఈ రెండు రంగాలు నేడు 80 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఎగుమతులు నికరంగా పెరుగుతూ ఉన్నాయి. 2011 నాటికి ఎగుమతులు 10,000 కోట్ల డాలర్లను అధిగమించాయి. 2011 చివరి నాటికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 20,000 కోట్ల డాలర్లను దాటాయి. 1980 దశకం నాటి సామాజిక ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించటానికీ, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించటానికీ ఈ ఆర్థికాభివృద్ధి బాగా ఉపయోగపడింది. ప్రతి ఏటా 2 – 3 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దాటి పైకి వచ్చారు. 1986లో దారిద్ర్యరేఖ దిగువన ఉన్న ప్రజల సంఖ్య 75 శాతం వరకు ఉంటే 2010 నాటికి కేవలం 9.5 శాతం మాత్రమే. 2000 సంవత్సరం నాటికల్లా నిరక్షరాస్యత నిర్మూలించ గలిగాము. సార్వత్రిక ప్రాథమిక విద్యను అందించాము. ఉన్నత స్థాయి విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య గత పాతికేళ్లలో 9 రెట్లు పెరిగింది. 95 శాతం వయోజనులు అక్షరాస్యులు. సాధారణ వ్యాధులన్నింటినీ నిర్మూలించ గలిగాము. పేదలు, ఆరేళ్ల లోపు పిల్లలకు పూర్తిగా ఉచిత ఆరోగ్య బీమాఅందిస్తున్నాము. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల సంఖ్య మూడు రెట్లు తగ్గింది. శిశుమరణాల రేటు ఆరు రెట్లు తగ్గింది. 1990లో 62 సంవత్సరాలు ఆయుః ప్రమాణం ఉంటే 2010 నాటికి 73 సంవత్సరాలకు పెరిగింది. వియత్నాం ప్రజల సాంస్కృతి వైవిధ్యం పెరిగింది. 2.5 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. సమాచార సాంకేతిక రంగం వినియోగం వేగంగా పెరుగుతున్న దేశాల్లో వియత్నాం ఒకటి. సహస్రాబ్ది లక్ష్యాల సాధనలో వేగంగా ముందంజ వేస్తున్న దేశంగా వియత్నాం ఐక్యరాజ్య సమితి ద్వారా గుర్తింపు పొందింది.

అందువల్ల పునరుద్ధరణ విధానం వియత్నాంలో అనేక సానుకూల మార్పులు తెచ్చిందని చెప్పవచ్చు. ఆర్థికాభివృద్ధి, మెరుగైన ఉత్పాదకత, వేగంగా దారిద్ర్యం తగ్గుదల, ఉన్నతమైన జీవన ప్రమాణాలు, తగ్గిన సామాజిక సమస్యలు, రాజకీయ సామాజిక స్థిరత్వం, భద్రత, పెరిగిన జాతీయ ప్రతిష్ట, శక్తి, ఇనుమడించిన పార్టీ ప్రతిష్ట వంటి అనేక సానుకూల ఫలితాలు రావటానికి పునరుద్ధరణ విధానం దోహదం చేసిందని చెప్పవచ్చు. రెండు దశాబ్దాల పురోగతిని విశ్లేషిస్తూ పార్టీ 10వ మహాసభ "పునరుద్ధరణ ప్రక్రియ చారిత్రక ప్రాధాన్యత కలిగిన విజయాలు సాధించింది" అని అంచనా వేసింది. వియత్నాం ప్రజలు గతంలో అనుభవించిన ప్రమాణాల కంటే నేడు మెరుగైన జీవన ప్రమాణాలు అనుభవిస్తున్నారు. అందువల్లనే పునరుద్ధరణ క్రమాన్ని ప్రారంభించిన వియత్నాం కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆదరించారు. అక్కున చేర్చుకున్నారు. వియత్నాంలో ప్రారంభమైన పునరుద్ధరణ ప్రక్రియ సోషలిస్టు ఆర్థికాభివృద్ధి సాధించటమే కాదు, అదేస్థాయిలో అభివృద్ధి సాధించిన పెట్టుబడిదారీ వ్యవస్థ కంటే మిన్నగా సామాజిక ఫలితాలు కూడా సాధించగలదు అని రుజువు అయ్యింది.

ఇన్ని ఫలితాలు సాధించినప్పటికీ వియత్నాం జాతీయ అభివృద్ధి సాధన క్రమంలో అధిగమించాల్సిన పరిమితులు ఇంకా కొన్ని ఉన్నాయి.

ఆర్థికంగా చూసినపుడు వృద్ధి నాణ్యత తక్కువగా ఉంది. మౌలిక సదుపాయాల కల్పన అసమానంగా ఉంది. ప్రభుత్వ ఆధీనంలో ఉన్నవాటితో సహా అనేక వాణిజ్య రంగాల శక్తి సామర్థ్యాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో పర్యావరణం కలుషితం అయ్యింది. మార్కెట్ నియంత్రణ, యాజమాన్యం తగిన విధంగా లేదు. ప్రపంచీకరణ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో విలీనం కావటంతో పోటీతత్వం పెరిగింది.

సామాజికంగా చూసినపుడు ధనికులు పేదల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. విద్య, వైద్య సదుపాయాలు, ఇతర ప్రజా సేవల విషయంలో నాణ్యత తక్కువగా ఉంటోంది. సాంస్కృతిక విలువలు తగ్గుముఖం పడుతున్నాయి. నేరాలు పెరుగుతున్నాయి. సామాజిక దుర్లక్షణాలు మరింత సంక్లిష్టమవుతున్నాయి. ప్రత్యేకించి అవినీతి, వృధాతత్వం, రాజకీయ సైద్ధాంతిక పటుత్వం, వ్యక్తిగత నైతిక విలువలు తగ్గుముఖం పడుతున్నాయి.

వియత్నాం నేడు సోషలిజం సాధనలో పరిణామ దశలో ఉందని గుర్తించాము. ఈ పరిణామ దశలో సోషలిస్టు ప్రమాణాలు, పద్ధతులను సోషలిస్టేతర పద్ధతులతో మమేకం చేస్తూ అభివృద్ధి చేశాము. ఈ సోషలిస్టేతర లక్షణాల్లో పెట్టుబడిదారీ లక్షణాలు కూడా ప్రముఖంగా ఉన్నాయి. నేడు మార్కెట్ ద్వారాలు తెరవటం, అంతర్జాతీయ మార్కెట్‌తో మమేకం అవుతున్న తరుణంలో ఈ సోషలిస్టు లక్షణాలు, సోషలిస్టేతర లక్షణాల మధ్య మమేకం అయ్యే ప్రక్రియ మరింత సంక్లిష్టంగా, దూకుడుగా మారింది. పైన పేర్కొన్న సానుకూల అంశాలతో పాటు అనేక సవాళ్లుకూడా ఈ దశలో ఎదురవుతున్నాయి. ఈ సవాళ్లను తెలివిగా ఎదుర్కోవటమే కాదు. సమయం మించి పోకుండా సమర్థవంతంగా పరిష్కరించుకోవాలి. ఇది క్లిష్టమైన పోరాటం. ఈ పోరాటంలో విజయం సాధించేందుకు స్ఫూర్తి, వినూత్నత, నూతన దృక్పథం

కావాలి. సోషలిజం సాధన, వ్యవస్థలోని సోషలిస్టు లక్షణాలను మరింత సంఘటితం చేసుకుని తిరుగులేని విధంగా ఆధిపత్య దశకు తీసుకు రావటం అనేది ఒక నిరంతర ప్రయత్నం. ఈ ప్రయత్నంలో విజయం సాధించటం అన్నది సరైన విధానాలు, రాజకీయ స్ఫూర్తి, నాయకత్వం పటిమ, పార్టీ పోరాట శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది.

ప్రస్తుతం మేము అనుసరిస్తున్న అభివృద్ధి వ్యూహాలను పునఃసమీక్షించుకుంటున్నాము. మౌలిక సదుపాయలు, మానవ వనరులు, పరిపాలనాసంస్కరణల్లో మన్నికత్వం, నాణ్యతలు ఈ పునఃసమీక్ష లక్ష్యాలుగా ఉంటాయి. సామాజికంగా పేదరిక నిర్మూలన, విద్యా, వైద్యసేవలు ఇతర పౌర సేవల మెరుగుదల, ప్రజల సాంస్కృతిక జీవనాన్ని పటిష్టపర్చటం ఈ ప్రయత్నంలో అంతర్గత లక్ష్యాలే.

సోషలిజం నిర్మాణం అంటే నూతన తరహా సమాజాన్ని నిర్మించటం అని సిద్ధాంతం, అనుభవం రుజువు చేస్తున్నాయి. అయితే ఈ నూతన సమాజ నిర్మాణం అంత తేలికైన పనేమీ కాదు. మనముందున్న సవాళ్ల పరిష్కారానికి పార్టీ నాయకత్వ పాత్రతో పాటు ప్రజల నుండి వినూత్న ఆలోచనలు, రాజకీయ మద్దతు, క్రియాశీల భాగస్వామ్యం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పార్టీ రూపొందించే మార్గదర్శక సూత్రాలు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు దర్పణం పట్టినపుడు ఈ మార్గదర్శకాలను స్వీకరించి అమలు చేయటంలో ప్రజలు నిస్సందేహంగా మద్దతు ఇస్తారు. వియత్నాం అంతిమ విజయం వియత్నాం ప్రజల శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంది.

అదేసమయంలో వియత్నాం అభివృద్ధి కోసం పార్టీ ప్రతిపాదించే ప్రత్యామ్నాయాలు, రూపొందించే విధానాలు వియత్నాం చరిత్ర ప్రత్యేకతలతో పాటు సమకాలీన ప్రపంచ పరిణామాలను కూడా నేపథ్యంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచీకరించబడిన దేశాలున్న నేటి తరుణంలో ఏ దేశమూ మిగిలిన దేశాలతో నిమిత్తం లేకుండా తనంతట తాను ముందుకు పోగలిగిన పరిస్థితి లేదు. అందువల్లనే వియత్నాం ఈ ప్రపంచీరణలో అంతర్భాగం కావాలని క్రియాశీలంగా కృషి చేస్తోంది. తదను గుణంగా స్వాతంత్ర్యం, స్వావలంబన, శాంతి, సహకారం, అభివృద్ధిలో భాగస్వామ్యం అన్న సూత్రాల ఆధారంగా విదేశాంగ విధానాన్ని అమలు చేయబూనుకొంటోంది. పరస్పర ప్రయోజనం, పరస్పర సార్వభౌమత్వ గుర్తింపు, ప్రాదేశిక సమగ్రత, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవటం వంటి ప్రమాణాల ప్రాతిపదికన వైవిధ్యభరితమైన అంతర్జాతీయ సంబంధాల దిశగా వియత్నాం ముందుకు సాగుతోంది.

అదేసమయంలో కార్మికవర్గ శాస్త్రీయ విప్లవాత్మక సిద్ధాంతం మార్క్సిజం-లెనినిజం పునాదులపై నిలకడగా నిలబడటం కూడా అంతే అవసరం. మార్క్సిజం-లెనినిజంలోని శాస్త్రీయ విప్లవాత్మక లక్షణాలు శాశ్వతత్వం కలిగినవి. ప్రపంచ వ్యాప్తంగా విప్లవకారులు ఈ విప్లవాత్మక లక్షణాలను అందిపుచ్చుకోవటానికీ, అమలు చేయటానికీ, ముందుకు తీసుకెళ్లటానికీ కృషి చేశారు. నిరంతర విప్లవాత్మక శాస్త్రీయ అభివృద్ధి, విప్లవాల నేపథ్యంలో ఈ విలువలు, ప్రమాణాలు, లక్షణాలు మరింతగా రాటు దేలనున్నాయి. రానున్న కాలంలో వివిధ దేశాల్లో చోటుచేసుకోనున్న విప్లవాత్మక పరిణామాలు మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాల ప్రాసంగితను రుజువు చేయనున్నాయి. సమకాలీన సమాజంలో ముందుకొస్తున్న సైద్ధాంతిక శాస్త్ర సాంకేతిక ధోరణుల్లో మనకు అక్కరకొచ్చే వాటిని మాత్రమే ఎంపిక చేసుకుని విమర్శనాత్మక పద్ధతిలో అంగీకరించాల్సి ఉంది. తద్వారా మనం ఎంచుకున్న మౌలిక అవగాహన, సిద్ధాంత ప్రాతిపదికను నిరంతరం తాజా పర్చుకోవచ్చు. శక్తివంతం చేసుకోవచ్చు. నూతన స్ఫూర్తితో నింపుకోవచ్చు.

వియత్నాం ప్రజలు ప్రారంభించిన ఈ ప్రక్రియ ఎంతో సంక్లిష్టమైనదనీ, ఇంతకు ముందు ఎన్నడూ చేపట్టనీ, వినూత్న ప్రక్రియ అనీ, ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లటానికి ఆయా సందర్భాల్లో గుణపాఠాలు నేర్చుకోవాల్సి వుందనీ మేము భావిస్తున్నాము. మేము తీసుకున్న పైన ప్రస్తావించిన చర్యలు సోషలిస్టు వియత్నాం స్థాపన దిశగా ప్రారంభించిన సుదీర్ఘ ప్రయాణంలో తొలి అడుగులు మాత్రమే. ప్రతి దేశంలోనూ సోషలిజం లక్ష్యాలు ఒకటిగానే వుండవచ్చు. కానీ ఆయా లక్ష్యాలు సాధించటానికి అనుసరించే విధి విధానాలు మాత్రం పూర్తిగా భిన్నమైనవిగా వుంటాయి. ఆయా దేశాల ప్రత్యేక చారిత్రక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. వియత్నాం ప్రారంభించిన ఈ ప్రయాణం వియత్నాం అవసరాలు, ప్రత్యేకతలు, చారిత్రక నేపథ్యంతో నిండి ఉన్నాయి.

**(అనువాదం: కె. వీరయ్య)**

**“ వియత్నాం ప్రజలు ప్రారంభించిన ఈ ప్రక్రియ ఎంతో సంక్లిష్టమైనదనీ, ఇంతకు ముందు ఎన్నడూ చేపట్టనీ, వినూత్న ప్రక్రియ అనీ, ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లటానికి ఆయా సందర్భాల్లో గుణపాఠాలు నేర్చుకోవాల్సి వుందనీ మేము భావిస్తున్నాము. మేము తీసుకున్న పైన ప్రస్తావించిన చర్యలు సోషలిస్టు వియత్నాం స్థాపన దిశగా ప్రారంభించిన సుధీర్ఘ ప్రయాణంలో తొలి అడుగులు మాత్రమే. ”**

**‘మార్క్సిస్టు’ పై**
**మీ అభిప్రాయాలు తెలపండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి
మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్,**
‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# ప్రత్యామ్నాయ విధానాల కోసం రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం

(6వ పేజీ తరువాయి)

మార్గం లేదని వాదిస్తున్నారు.

నగదు బదిలీ పద్ధతి మన పాలక వర్గాలకు ఖర్చు తగ్గించుకోవడం అవసరంగా ఉంది. దీనికి నగదు బదిలీ పథకం అనువుగా ఉంటుంది. సామ్రాజ్యవాదులకు కూడా సరు కులు అమ్ముకోడానికి ఈ పథకం అనువుగా ఉంటుంది. అందువల్ల మన పాలక వర్గాలూ, సామ్రాజ్యవాదులూ ఈ పథకాన్ని ప్రమోట్ చేస్తున్నారు. కానీ ఈ పథకం వల్ల సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోతారు. సంక్షోభ ప్రభావం వారిమీద తీవ్రంగా పడుతుంది.

**వాతావరణ సంక్షోభం**

వాతావరణ సంక్షోభం నేడు ఒక ప్రధాన ఉపద్రవంగా ముందుకు వచ్చింది. ఈ సంక్షోభాన్ని నివారించేందుకు అనేక ఒప్పందాలు కుదురుతున్నాయి. అంతర్జాతీయంగా మన ప్రభుత్వాలు కుదుర్చు కుంటున్న వాతావరణ ఒప్పందాల వల్ల మన విద్యుత్ వాడకంపై పరిమితులు ఏర్ప డతాయి.

మొత్తం మీద చూసినప్పుడు ఈ విధానాల వల్ల రానున్న రోజుల్లో ప్రజలపై మరిన్ని భారాలు పడతాయి. అందువల్ల ఈ విధానాలకు వ్యతిరేకంగా మనం పోరాడాలి. కానీ ఈ ప్రతికూల నినాదాలతో (అదివద్దు, ఇది వద్దు అంటూ) మనం ప్రజలను సమీకరించలేం.

**ప్రత్యామ్నాయ విధానాలు**

మనం ప్రజలను ప్రత్యామ్నాయ విధానాల ప్రాతిపదికగానే సమీకరించ గలం. ఆ ప్రత్యామ్నాయ విధానాలు సరళీకరణ విధానాలకు భిన్నంగా ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా ఉండాలి. దీని వల్ల ఆర్థిక భారాలతో నలిగి పోతున్న ప్రజలకు కొంత వెసులుబాటు వస్తుంది, మరోవైపు ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ఇటువంటి విధానాలు అమలు పరిచేందుకు ప్రస్తుతం మన దేశంలో అవకాశం ఉంది.

రెండు రకాల చర్యలు తీసుకుంటే మనం ప్రత్యామ్నాయ విధానాలు అమలు పరచగలం. 1. కుంభకోణాలను అరికట్టాలి. యుపిఎ ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయి. వీటిని అరికడితే ఈ డబ్బంతా ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. 2. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను తగ్గించాలి. రెండేళ్ల కాలంలో యుపిఎ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు 5 లక్షల కోట్ల రూపాయల పన్నురాయితీలిచ్చింది. ఈ రాయితీలు తగ్గిస్తే ఖజానాకు మరింత డబ్బు చేరుతుంది.

ఈ రెండింటి వల్ల వచ్చే డబ్బుతో ప్రజలకు ఉద్యోగాలు కల్పించే కార్య క్రమాలను ప్రభుత్వమే అమలు చేయవచ్చు. ఒకవైపు ప్రజలకు ఆర్థిక భారాలనుండి వెసులుబాటు కల్పిస్తూ వారికి ఉపాధి పెంచితే వారి కొనుగోలు శక్తి పెరిగి పారిశ్రామికాభివృద్ధి జరు గుతుంది. దేశాభివృద్ధి ముందుకు పోతుంది.

**రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం**

కానీ ఇటువంటి ప్రత్యామ్నాయ విధానాలు అమలుపరిచే రాజకీయ కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందు వల్ల ప్రత్యామ్నాయ విధానాలు అమలు పరిచే ఒక రాజకీయ ప్రత్యామ్నాయం ఇప్పుడు ఏర్పడాల్సి ఉంది. అటువంటి రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడే అవ కాశం ఉందా? ఉందనే ప్రస్థుత పరిస్థితులు చెబుతున్నాయి.

ప్రజలకు వెసులుబాటు కల్పించే రాజకీయ ప్రత్యామ్నాయం ఉందంటే ప్రజలు దానికి ఓటు వేస్తారని ఇటీవల ఢిల్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉదంతం మనకు తెలియ జేస్తోంది. ఢిల్లీ ప్రజలకు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామనీ, అందరికీ మంచినీరు ఉచితంగా ఇస్తామనీ తదితర డిమాండ్లతో ఆప్ గెలుపొందింది. అయితే ఆ పార్టీకి మతో న్మాదం పట్ల, సరళీకరణ ఆర్థిక విధానాల పట్ల స్పష్టత లేదు.

ప్రాంతీయ పార్టీల్లో కూడా నేడు కింది స్థాయిలో అసంతృప్తి పెరుగుతోంది. ఆ పార్టీలేవీ కూడా విధానాల గురించి మాట్లా డ్డం లేదు. వామపక్షాల బలం పెరిగితే తప్ప ఇటువంటి ప్రాంతీయ పార్టీలను ప్రత్యామ్నాయ విధానాల వైపు మళ్లించేందుకు వారిపై ప్రభావం వేయలేం.

కానీ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గద్దె దించడం, బిజెపి అధికారంలోకి రాకుండా చూడ్డం మన ప్రధాన కర్తవ్యం. ఈ రెంటికీ వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ కూటమి అధికారంలోకి రావాలి. అయితే ఎన్నికల తరువాత పరిస్థితులు ఎలా ఉంటాయో మనం ఇప్పుడే చెప్పలేం. ఎన్నికలకు ముందున్న పార్టీల కలయికలు ఎన్నికల తరువాత ఉండకపోవచ్చు. ఎన్నికల్లో ఆయా పార్టీలు సాధించిన స్థానాలపై అంతా ఆధారపడి ఉంటుంది. అందుకు గాను ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యతిరేక, బిజెపి వ్యతిరేక స్థానిక శక్తులతో మనం సీట్ల సర్దుబాటు చేసుకోవలసిన అవసరం ఉంది. ⦿

## మార్క్సిస్టు పాఠకులకు మనవి

2005 జులైలో ప్రారంభమైన 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక గత 93 మాసాలుగా నిర్విఘ్నంగా వెలువడుతూ 94వ సంచిక మీ చేతుల్లో ఉంది. విడిప్రతి రూ. 5/-, సంవత్సరం చందా రూ. 60/-కి అమ్మడం వల్ల పత్రిక ప్రింటింగ్ ఖర్చులు కూడా రావడం లేదు. ఇటీవలి కాలంతో కాగితం ధర, ఇతర ఖర్చులు పెరగడం వల్ల పత్రిక ధర పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. కనుక 2014 మార్చి నెల నుండి 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక ధర కింది విధంగా ఉంటుంది.

| | |
|---|---|
| **విడి ప్రతి** | **రూ. 10/-** |
| **సంవత్సర చందా** | **రూ. 100/-** |

పాఠకులు సహకరించాల్సిందిగా కోరుతున్నాం.

**మేనేజర్,**
**మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక,**
**ఎంహెచ్ భవన్, (ప్రజాశక్తి భవనం)**
**అజామాబాద్, హైదరాబాద్ -20**

# వాసిరెడ్డి భాస్కరరావు

(2వ పేజీతరువాయి)

త్తేజపరచగా.. 1942లో రాసిన బుర్రకథ అది. దాన్ని ఆంధ్ర–నైజాం సంస్థాన సరిహద్దు గ్రామమైన మాచినేనిపాలెంలో సాధన చేశారు. ఒకవంతగా తమ్ముడు వీరభద్రరావు, రెండో వంతగా ఖమ్మంకు చెందిన బుర్రపంతులు ఉండేవారు. ప్రప్రథమంగా నందిగామ తాలూకా మున్నలూరులో 'స్టాలిన్ గ్రాడ్ యుద్ధం' బుర్రకథ చెప్పారు. ఆనాటికే కోగంటి గోపాలకృష్ణయ్య 'స్వతంత్ర భారత్' అనే చిన్న బుర్రకథ రాసినా.. సుంకర రాసిన 'స్టాలిన్ గ్రాడ్ యుద్ధం' ఆంధ్ర ప్రజానాట్యమండలి తొలి బుర్రకథ అయ్యింది. ఈ బుర్రకథ ప్రజాదరణ పొందిన అనంతరం ఆ అనుభవంతో సుంకర.. తిరువూరు తాలూకాలో తాను కళ్లారా చూసిన జమీందారీ దురంతాలను చిత్రిస్తూ 'కష్టజీవి' బుర్రకథను రాసి చుట్టుపక్కల గ్రామాల్లో చెప్పారు. ఆ బుర్రకథ ఏ గ్రామంలో చెప్పినా, ప్రతివారూ అది తమ ఊరి గాథగానే భావించేవారు. ప్రజలిచ్చిన ఉత్సాహం సుంకరను మరింత ముందుకు నడిపింది. ఈ విషయం తెలుసుకున్న మద్దుకూరి చంద్రశేఖరరావు.. సుంకరను విజయవాడకు రప్పించి ఆ బుర్రకథలను 'ప్రజాశక్తి' పత్రికలో ప్రచురించారు. తాను హిందీ టీచరుగా పనిచేస్తున్న కాలంలోనే బుర్రకథలు చెప్పే సుంకరతో వాసిరెడ్డికి మైత్రి కుదిరింది. అక్కడి నుంచి వారిద్దరూ కలిసి బుర్రకథలు చెప్పడం ప్రారంభించారు. వారి బుర్రకథలు ఝంఝూమారుత తరంగం మాదిరిగా సాగేవి. అవి ప్రజలను ఉత్తేజితులను చేసి విశేషంగా చైతన్యవంతం చేశాయి.

తరువాత వారు నాటక రచనలు కొనసాగించారు. 1946లో 'ముందడుగు', 1947లో 'మాభూమి', 1948లో 'అపనింద' నాటకాలను రాశారు. కమ్మని జాను తెనుగు ప్రయోగించి రాసిన నాటకాలివి. విశిష్టత, విప్లవతత్వం వీరి నాటకాల్లో గోచరిస్తాయి. వేళ్లూనుకున్న జమీందారీ వ్యవస్థలో నలిగిపోయే రైతుల సముద్ధరణకు సాగిన జమీన్ రైతుల పోరాటానికి దోహదమిచ్చిన నాటకం 'ముందడుగు'. రాష్ట్రవ్యాప్తంగా అనేక దళాలు వందల ప్రదర్శనలతో లక్షలాది ప్రజలను తరింప చేసిన నాటకం ఇది. తరువాత తెలంగాణాలో రైతాంగ సాయుధ పోరాటాన్ని దృష్టిలో పెట్టుకొని 'మాభూమి' నాటకం రాశారు. నిజాం సంస్థానంలో భూమి, భుక్తి, బానిసత్వ విముక్తి కోసం పోరాడుతున్న మట్టిమనుషులపై రజాకారులు, దేశముఖ్‌లు జరుపుతున్న క్రూర అకృత్యాలు.. అణచివేతలకు వ్యతిరేకంగా.. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు 'మాభూమి' రచన చేశారు.


ఆనాడు తెలుగు నాటక రంగంలో వచ్చిన అద్భుతమైన నాటకాలు రెండే రెండున్నాయి. ఒకటి గురజాడ అప్పారావు రాసిన 'కన్యాశుల్కం' కాగా.. రెండోది 'సుంకర– వాసిరెడ్డి' ద్వయం రాసిన 'మాభూమి'. ఈ నాటకాన్ని ఆంధ్ర ప్రజానాట్యమండలి అచ్చు వేయించింది. డాక్టరు గరికపాటి రాజారావు దర్శకత్వంలో ప్రదర్శనలను విస్తృతంగా జనబాహుళ్యంలోకి తీసుకువెళ్లింది. సుమారు 200 దళాలు ఏర్పడి వెయ్యికిపైగా ప్రదర్శనలిచ్చిన నాటకం 'మాభూమి' మాత్రమే. ఈ నాటకాన్ని సుమారు 20 లక్షల మంది ప్రజలు తిలకించారని అంచనా. ప్రపంచ నాటక రంగ చరిత్రలోనే ఓ ఉజ్వలమైన నాటకంగా ప్రసిద్ధి చెందింది 'మాభూమి'. రాష్ట్రంలోనేగాక, బొంబాయి, మద్రాసు నగరాల్లోకూడా ప్రదర్శించబడింది. 'మాభూమి' నాటకంలో కమ్మని తెలుగు భాష జాలువారిందనీ.. ఇది ప్రజా కవులకే సాధ్యమని విశ్వనాథ సత్యనారాయణ కొనియాడారు. తాను మూడుసార్లు ఈ నాటకాన్ని తిలకించాననీ, అన్నిసార్లూ మొదటిసారి ప్రదర్శించినంత తాజాగా నటీనటులు ప్రదర్శించారనీ నార్ల వెంకటేశ్వరరావు కొనియాడారు. గిడుగు సీతాపతి కూడా ఈ నాటకాన్ని ఎంతో మెచ్చుకున్నారు.

మద్రాసులో ఈ నాటకాన్ని బెజవాడ గోపాలరెడ్డి వంటివారు తిలకించారు. గొప్ప నాటకమని ప్రశంసించారు. అయితే.. ఆ నాటకం ప్రజల్లో కలిగిస్తున్న చైతన్యానికీ, అలజడికీ జడిసి నిషేధం విధించారు. అయినప్పటికీ ఆ నిషేధకాలంలో సాయుధ దళాల కాపలా మధ్య అనేకచోట్ల ఆ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. ఓ రోజు తిరువూరు ప్రాంతంలోని కొణిజర్ల వద్ద (నైజాం సంస్థానానికి సరిహద్దున) మాభూమి నాటకం వేశారు. పాతిక ముప్పై వేల మంది వచ్చారు. ఈ నాటకం చెడగొట్టడానికి రజాకార్లు వస్తున్నారని ప్రచారం జరగడంతో.. వారిని నిలువరించి నాటక ప్రదర్శన కొనసాగించాలని పార్టీ నిర్ణయించింది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు ప్రదర్శన చుట్టూ లాఠీలతో కాపలాగా నిలబడి ప్రదర్శన జయప్రదం చేశారు. సుంకరతోపాటు కలిసి రచించిన ఈ నాటకాల్లో.. వాసిరెడ్డి కమ్మని తెలంగాణా మాండలికాన్ని అత్యద్భుతంగా పలికించారు.

వాసిరెడ్డి భాస్కరరావు తనకున్న కొద్దిపాటి ఆస్తినీ పార్టీకి సమర్పించిన త్యాగధనుడు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధకాలంలో ఆయన అజ్ఞాతవాస జీవితం గడిపారు. చాలాకాలం బొంబాయి మొదలైన ప్రాంతాల్లో అజ్ఞాత జీవితం గడిపారు. ఆ కాలంలో పోలీసులు ఆయన ఇంటిపై దాడిచేసి అనేక అముద్రిత గ్రంథాలను ధ్వంసం చేశారు. అందులో చాలా ముఖ్యమైన 'జాతీయ సాహిత్య విమర్శ' గ్రంథం రాతప్రతి కూడా ఉంది. అజ్ఞాతవాస కాలంలో ఆయన మార్క్సిస్టు సిద్ధాంత పక్ష పత్రిక 'జనత',.. 'ప్రజాశక్తి' పత్రిక సంపాదకవర్గాల్లో పనిచేశారు. అజ్ఞాతకాలంలోనే ఆయనను పోలీసులు పట్టుకున్నారు. 20 రోజులపాటు వరుసగా చిత్రహింసల పాల్జేశారు. కొంతకాలం జైలు జీవితం గడిపారు. దీంతో అనారోగ్యం పాలయ్యారు. కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధం తొలగిన తరువాత ఆయన జైలు నుంచి విడుదలై జబ్బుతోనే మద్రాసు చేరారు. అక్కడ సుంకరతో కలిసి సినిమా రంగంలో పనిచేశారు. 'పుట్టిల్లు', 'పల్లెటూరు', 'కన్నతల్లి' సినిమాలకు వారుభయులూ సంభాషణలు, పాటలు రాశారు. తాను స్వంతంగా 'పోతుగడ్డ' నాటకాన్ని రాశారు. ఈ నాటకం కూడా అంతకుముందటి నాటకాల మాదిరిగానే చాలా ప్రజాదరణ పొందింది. మద్రాసులో ఆయన ఆరోగ్యం చక్కబడలేదు. 1954లో తిరిగి వీరులపాడుకు చేరుకున్నారు. పరిణితి చెందిన కమ్యూనిస్టుగా ఆయన మార్క్సిజం గొప్పదనాన్ని గ్రామస్తులకు వివరిస్తూ వారిలో రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచే ప్రయత్నం చేశారు.

జబ్బు మరింత ముదిరి చివరికాయన 43 ఏళ్ల చిన్న వయసులోనే 1957 నవంబరు 1న ఆంధ్ర ప్రజానాట్యమండలినీ, తెలుగు ప్రజలనూ, ప్రజా సాహిత్యాభిమానులనూ.. విచార సాగరంలో ముంచి శాశ్వతంగా కన్నుమూశారు. నిరాడంబరుడు, రైతుబిడ్డ, బహుభాషా కోవిదుడు, ప్రజా రచయిత ఆయన వాసిరెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ మహాకవి శ్రీశ్రీ.. తెలుగు సాహిత్యానికీ, కష్టజీవులకూ ఎనలేని లోటని తీవ్ర విచారాన్ని ప్రకటించారు. ధనిక బీద వర్గాల మధ్య నిత్య ఘర్షణనూ, ధనాఢ్య వర్గాల దోపిడీ విధానాన్నీ.. తమ హక్కుల కోసం ప్రజానీకం సాగించిన పోరాటాలనూ సమున్నతంగా చిత్రిస్తూ.. సర్వమానవ సమానత్వం, సౌభాగ్యాలతో జీవించే నవసమాజాన్ని నిర్మించేందుకు మహదావేశంతో సుంకర సత్యనారాయణతో కలిసి కలం పట్టిన అభ్యుదయ రచయిత వాసిరెడ్డి భాస్కరరావు తెలుగు అభ్యుదయ సాహిత్యంలో ధృవతారగా వెలుగొందుతారు. ●

# నాగరిక సమాజపు మొదటి రోజునుండి స్వార్థమే దాన్ని నడిపిస్తోంది



**- ఫ్రెడరిక్ ఏంగెల్స్**

....నాగరిక సమాజం ఎంతటి ఘన విజయాలు సాధించిందంటే ప్రాచీన సమాజానికి వాటిని అందుకునే సామర్థ్యం ఏకోశానా లేదు. అయితే ఈ ఘనవిజయాలను అది మానవునిలోని అతి నికృష్టమైన వాంఛలనూ, కోర్కెలనూ చెలరేగేట్లు చేయడం ద్వారా, వాటి కోసం అతనిలోని ఇతర అన్ని రకాల నైపుణ్యాలనూ వదులుకునేట్లు చేయడం ద్వారా సాధించింది. నాగరిక సమాజపు మొట్టమొదటి రోజునుండి ఇప్పటివరకు కూడా స్వార్థమే దాన్ని నడిపిస్తోంది. సంపద, మరింత సంపద, మరింత మరింత సంపద... సంపద సమాజం కోసం కాదు, వ్యక్తి కోసం... ఇదే దాని ఏకైక లక్ష్యం, తుది లక్ష్యం. నాగరిక సమాజంలో సైన్సు అభివృద్ధి చెందినా, లేక ఒక్కోసారి కళలు బ్రహ్మాండంగా వికసించినా... ఇవన్నీ ఎందుకు జరిగాయంటే అవి లేకుండా ఆధునిక సంపదను సంపూర్ణంగా సాధించడం సాధ్యం కాదు కాబట్టి.

ఒక వర్గాన్ని మరో వర్గం దోచుకోవడమే నాగరికత పునాదిగా ఉంది కాబట్టి, దాని అభివృద్ధి అంతా నిరంతర వైరుధ్యాలతో కూడి ఉంది. ఉత్పత్తిలో ప్రతి ముందడుగూ పీడిత వర్గాల, అంటే మెజారిటీ ప్రజల జీవన స్థితిలో ఒక వెనకడుగు. ఒకరికి ప్రయోజనకరమైనది ఏదైనా రెండోవారికి హాని చేస్తుంది. ప్రతి వర్గం యొక్క సరికొత్త విముక్తి, మరో వర్గానికి అణచివేత. యంత్రాల ప్రవేశం దీనికి మంచి ఉదాహరణ. దీని ప్రభావాన్ని నేడు ప్రపంచమంతా చవి చూస్తోంది. బర్బర సమాజాల్లో మనకు హక్కులు, విధుల మధ్య తేడా కనిపించదు. కానీ నాగరిక సమాజంలో ఒక వర్గం అన్ని రకాల హక్కులూ అనుభవిస్తుంది. మరో వర్గం అన్ని రకాల బాధ్యతలూ మోస్తుంది.

కానీ అదే కాదు. పాలక వర్గాలకు ఏది మంచిదైతే మొత్తం సమాజానికి అదే మంచిదవుతుంది. పాలక వర్గాలు దాన్నే తమదిగా భావిస్తాయి. అందువల్ల నాగరికత పెరుగుతున్న కొద్దీ అది తను సృష్టించే దుష్ట శక్తులను ప్రేమ అనే ముసుగుతో కప్పేస్తుంది. వాటిని చిన్నవిగా చేసి చూపుతుంది, లేదంటే అవి ఉన్న విషయాన్నే నిరాకరిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే నాగరికత, అంతకు ముందు సమాజాల్లో ఎక్కడా లేని, కనీసం నాగరికత ప్రారంభంలో కూడా కనిపించని మోసకారితనంతో వ్యవహరిస్తుంది. చివరికి అది పీడిత ప్రజల ప్రయోజనాలకోసమే... దోపిడీ వర్గం పీడిత వర్గాలను దోపిడీ చేస్తున్నట్లు కూడా నమ్మిస్తుంది. పీడిత వర్గం ఈ విషయాన్ని గ్రహించలేకపోతే, దీనికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయకపోతే మొత్తం శ్రామిక ప్రజలకు ద్రోహం చేసినట్లే అవుతుంది.

**(ఫ్రెడరిక్ ఏంగెల్స్ రాసిన "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక' గ్రంథం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.8, No.10, February 2014